21-8Pg1exHMNWJQE:21-8Pg1exHMNWJQE.qxd 21/Aug/26 12:20 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 202 పేజీలు: 12 వెల: 6.50

ప్రతిబోటు.. ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలి 3లో
ఎంఎస్ఎంఇలకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు
# ఎస్ఇసి కసరత్తు

**బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**
**పురపాలక సంఘాల ఛైర్మన్‌ల ప్రత్యక్ష ఎన్నిక బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**
**అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియ ముగించేలా కార్యాచరణ**

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్ధానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు జరుగుతుంది. అక్టోబరు లోపల పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎపి వర్షాకాల సమావేశాల్లో సిఎం చంద్రబాబు పుర, నగర పాలక సంస్థల ఎన్నికలు అక్టోబరు లోపలే నిర్వహించాలని మంత్రులతో ప్రస్తావించారు. ఈ క్రమంలో పురపాలక, నగర పాలక సంస్దలల్లో చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందు. పంచాయతీరాజ్ వ్యవస్దలో కేంద్రం నిర్దేశించినట్లు జెడ్పీటిసిలు,ఎంపిటిసిలు ఎన్నికలు నిర్వహించాలని, చైర్మన్ ఇటు మండల పరిషత్‌కు.అటు జెడ్పీ చైర్మన్ ఎన్నికలు జరగాలని శాసనసభ బిల్లు ఆమోదించింది.ఇదే బిల్లులో మండల పరిషత్,. జిల్లా పరిషత్ సింగిల్ వైస్ చైర్మన్ వ్యవస్దను పునర్దురించాలని నిర్ణయించింది.ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరులో జరుగవచ్చునని అంచనా వేస్తున్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ అంశాన్ని ధృవీరంచలేదు.

## అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న
# మరిన్ని రహదారులు



**విజయవాడ.,ఆగస్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం ఇ 13, ఇ 15, ఇ 1, ఇ 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే ఇ 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు.16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఇ 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ 3) మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు.సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ ఇ 1రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయారోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమ తులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

**31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు**
**రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం**
2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది రాష్ట్రాలు
కుప్పం మీదుగా బుల్లెట్ రైలు మూడు రాష్ట్రాలతో సరికొత్త కారిడార్
**కేంద్రం ముందుకు దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి మౌలిక వసతుల ప్రతిపాదనలు**
ఎపి పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలు పరిష్కరించండి
**షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనపై త్వరిత నిర్ణయం తీసుకోండి**
**కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి**



గురువారం చంగల్‌పట్‌లో నిర్వహించిన 31వ సదరన్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, విజయ్, సతీషన్, డికె శివకుమార్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయా రాష్ట్రాల మంత్రులు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన అజెండాపై సమావేశంలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షణాది రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సిఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎపి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి- బెంగళూరు- చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు.

**తిరుపతి నుంచి అయోధ్య వరకు తీర్థయాత్ర సర్క్యూట్**

దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, >>2

## సీట్లు, నిధులు తగ్గొద్దు 2లో
దక్షిణాది రాష్ట్రాల సమష్టి స్వరం, అమిత్‌షా అధ్యక్షతన
చంగల్‌పట్‌లో దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం

## అరణ్యానికి సాంకేతిక
# రక్షణ కవచం

- అడవిలో ప్రతి కదలికపై నిఘాకు అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- ప్రతి అంగుళం అడవిని పరిరక్షించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థ
- 'ఈగస్తు' తరహా మొబైల్ యాప్‌తో వ్యవస్థలో జవాబుదారీతనం
- కర్ణాటక నమూనా అటవీ పరిరక్షణపై డి.సిఎం పవన్ కళ్యాణ్ దృష్టి



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న తరహా అత్యాధునిక సాంకేతిక పరిపాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి అంగుళం అటవీ భూమిని సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అరణ్యా రామంలో కర్ణాటక తరహా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ ద్వారా అడవుల మ్యాపింగ్‌తోపాటు పూర్తి స్థాయిలో వన్యప్రాణుల కదలికలు, అటవీ కార్యకలాపాలపై డిజిటల్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీశాఖ బృందం కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించింది. కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న ఐటి విధానాలు, జిఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తదితర వ్యవస్థలపై అధ్యయనం జరిపి, పూర్తి వివరాలతో కూడిన నివేది కను పవన్ కళ్యాణ్ అందజేశారు. తమ పరిశీలనలు, కర్ణాటకలో విజయవంతమైన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ నివేది కను క్షుణ్ణంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్ కర్ణాటకలో సత్ఫలితాలు ఇచ్చిన పలు విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేయా లని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా >>2



## జంతర్ మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ
**జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు**
**ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం**

## విద్యాహక్కు చట్టం కింద
# లక్ష దాటిన ప్రవేశాలు

- ప్రజా ప్రభుత్వ ఘనతన్న మంత్రి లోకేష్
- 2022-26 మధ్య ప్రైవేట్ పాఠశాలల్లో 1,04,046 మందికి అవకాశం
- ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నామని వెల్లడి
- ఆర్‌టిఇపై విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడమే కారణమని వివరణ



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) అమలులో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాలు భారీగా పెరిగాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. గురువారం శాసనమండలిలో ఆర్టీఇ ప్రవేశాలపై సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) కింద ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే ప్రక్రియను ప్రజాప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. దీని ఫలితంగా 2022-23 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు మొత్తం 1,04,046 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. పూర్తి పారదర్శకత కోసం అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నాం" అని వివరించారు.

గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రవేశాల సంఖ్యలో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని లోకేష్ గణాంకా లతో సహా వివరించారు. "2022-23 విద్యా సంవత్సరంలో కేవలం 2,203మంది విద్యార్థులుమాత్రమే ఆర్టీఇకింద ప్రవేశాలు పొందారు. కానీ, ప్రజాప్రభుత్వంవచ్చిన మొదటి యేడాదే, అంటే 2024-25లో, ఈ సంఖ్య ఏకంగా 29,000కు >>2



గురువారం ఉరవకొండ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులను బలవంతంగా పక్కకు లాగుతున్న పోలీసులు

# పంటలెండిపోతున్నాయ్ నీళ్లు విడుదల చేయండి

హంద్రీ-నీవా అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం
ఉరవకొండలో ప్రధాన రహదారిపై బైఠాయింపు
తహశీల్దార్ కార్యాలయం మూసివేసి భారీ ధర్నా
ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో రైతులతో మాట్లాడించిన ఎస్ఐ
సాగునీరు ఇవ్వలేమని తేల్చి చెప్పిన హంద్రీనీవా అధికారులు
ముందుగా ప్రకటించకుండా నీరివ్వమంటే నష్టపోతామని ఆవేదన

**ఉరవకొండ, ఆగస్టు 20 ప్రభాతవార్త:** సాగు నీటి కోసం ఉరవకొండ ప్రాంత రైతులు గురువారం రోడ్డెక్కారు. కళ్లముందరే నీరు పారుతున్నా పంట పొలాలకు అందించే మార్గం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు హంద్రీనీవా తూములు ఎత్తి నీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. అనంత పురం జిల్లా ఉరవకొండ మండల పరిధి >>2

# చర్చలు విఫలం

రెండు డిమాండ్లపై సానుకూల స్పందన
మరోసారి చర్చిస్తా: మంత్రి సత్యకుమార్
జూడాల సమ్మె కొనసాగింపు

**గుంటూరు మెడికల్, ఆగస్టు 20, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యుల ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి గురువారం చర్చలు జరిపారు. జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భార్గవ్ సాయి, డాక్టర్ రచన తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. జూనియర్ వైద్యులు ప్రధానంగా ప్రస్తావించిన మూడు డిమాండ్లపై చర్చించినమంత్రి.. రెండుఅంశాలపై సాను కూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలి పారు. జూనియర్ వైద్యులు కోరుతున్న స్టైపెండ్‌ను 20 శాతం పెంచాలన్న డిమాండ్‌పై మంత్రి స్పందిస్తూ.. ఈ అంశాన్ని ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళతామని తెలి పారు. అయితే 20 శాతం పెంపు అమలు చేయడం కష్టసాధ్యమయ్యే అవకాశం ఉందని కూడా మంత్రి పేర్కొన్నట్లు జూడా ప్రతినిధులు వెల్లడించారు. మిగిలిన రెండు డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబిఎస్, పిజి వైద్య విద్య పూర్తిచేసిన అర్హులైన వైద్యులు అందుబాటులో ఉండగా, వైద్యేతర విద్యార్హతలైన ఎంఎస్సీ, పిహెచ్‌డీ చేసిన వారిని అధ్యాపకులుగా నియమించకూడదన్న డిమాండ్‌పై ప్రభుత్వం >>2



గురువారం మీడియాతో జూడాలు

# మూలపేటలో 'కోరమండల్'

రూ.2,250 కోట్లతో రసాయన పరిశ్రమ
400మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు
450 ఎకరాల భూమి కేటాయింపు
రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**శ్రీకాకుళం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిఅభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో శ్రీకాకుళం జిల్లా మూలపేట ప్రాంతం పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫాస్ఫరిక్ యాసిడ్, అనుబంధ ఎరువుల తయారీ కాంప్లెక్స్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఏర్పాటుకు సంస్థకు 450 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ జీవోఎంఎస్ నం.211ను జారీ చేశారు. ఈ భారీ పరిశ్రమద్వారా సుమారు రూ.2,250 కోట్ల పెట్టుబడులు జిల్లాకు రానుండగా, ప్రారంభ దశలోనే 400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రోజుకు 2,000 టన్నుల సల్ఫ్యూరిక్ యాసిడ్, 650 టన్నుల ఫాస్ఫరిక్ యాసిడ్, 1,000 టన్నుల జిప్సమ్ ప్లాస్టర్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. 2030 అక్టోబరు నాటికి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించారు. మూలపేటలో ఇంతటి భారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శ్రీకాకుళంజిల్లా పారిశ్రామిక అభివృద్ధికి ఒక మైలు రాయిగా నిలవనుంది. పరిశ్రమల రాకతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, అనుబంధ రంగాలు, వ్యాపారాలు, రవాణా, సేవారంగాలు కూడా అభివృద్ధి చెందే అవకాశంఉంది. తద్వారా మూలపేటతో పాటు పరిసర ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలన్న లక్ష్యంతో మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుంటు >>2

21-8pg2exHMNWJQE:21-8pg2exHMNWJQE.qxd 21/Aug/26 12:12 AM Page 1





గురువారం ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో ముస్సోరి-కెంప్టి రహదారిలో ఒక పెద్ద భాగం కొట్టుకుపోయిన దృశ్యం

# సీట్లు, నిధులు తగ్గొద్దు

**చెన్నై, ఆగస్టు 20:** దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా ఈ సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు నిధులు తగ్గొద్దు రాష్ట్రాల హక్కులు క్షీణించవద్దు అన్న సందేశం బలంగా వినిపించింది. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. తమిళనాడు సిఎం విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టబద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు. ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డికె శివకుమార్ వెల్లడించారు. నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాలమధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డికె శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సిఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లైపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ-కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి-బెంగళూరు-చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని, విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది ఉమ్మడి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. 12 యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు ఇవ్వాలని, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణాది జల సమస్యలకు పరిష్కారంగా నదులఅనుసంధానంపై చంద్రబాబు మరోసారి దృష్టి సారించారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు జలాల విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంగా-కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ.151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి. మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు, అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది.

# 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి విశేష స్పందన

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తున్న నేతలు

### స్థానిక సమస్యలు, అవసరాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ

**విజయవాడ, ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగు దేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రారంభమైన ఈ యాత్ర, 25వ రోజుకు చేరేసరికి 71.80 లక్షల ఇళ్లను సందర్శించి కీలక మైలురాయిని అధిగమించింది. గురువారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 2,53,832 ఇళ్లను సందర్శించారు. దీంతో ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు సందర్శించిన మొత్తం ఇళ్ల సంఖ్య 71.80 లక్షలకు చేరినట్లు పార్టీ వర్గాలు ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించాయి. 70 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని దాటడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ ఇంటింటి పర్యటనలు విస్తృతంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు అందిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా తెలియజేస్తున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల ప్రచారానికే పరిమితంకాకుండా, ప్రజలతోనేరుగా మాట్లాడి వారి స్పందనను తెలుసుకుంటున్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో స్థానికంగా ఉన్న అవసరాలు, మౌలిక వసతుల కొరత, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై నాయకులు, కార్యకర్తలు సమాచారాన్ని సేకరిస్తున్నారు.

# 'ఉచితాలు' ఉచితమా?

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు సీరియస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై గురువారం తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న (గతంలో విధించిన) మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం స్పష్టంగా నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్మాణ ధరలు భూములిచ్చిన భూయజమానులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేకపోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల మెట్లు తొక్కే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

>> మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఎపి 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్‌లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు.

**విభజన హామీలు పరిష్కరించండి**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను సిఎం చంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తికాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఎపి అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఎపి భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సిఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్-13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సిఎం కోరారు. విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బిపిసిఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి భద్రతకు 'గోదావరి-కావేరి అనుసంధానం'**

భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టిఎంసిలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సిఎం చంద్రబాబు కేంద్రం ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రా లకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతాలకు తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సిఎంలు ప్రసంశించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సిఎం డికె శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సిఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నీళ్లు విడుదల చేయండి

>> లోని నింబగల్లు, రేణుమాలకులపల్లి, వ్యాసాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఉదయం మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంవద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ బ్రిడ్జిపై రాస్తారోకోకు ఉపక్రమించగా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులు జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించకుండా అడ్డుకున్నారు. దీంతో రైతులు అక్కడి నుండి ఉరవకొండ మండల తహశీల్దార్ కార్యాలయం చేరుకొని కార్యాలయం ప్రధాన ద్వారా మూసివేసి అక్కడే బైటాయించారు. పంటలను కాపాడేందుకు నీరు ఇవ్వాలని నినాదాలతో హోరెత్తించారు. అయితే ఆ సమయంలో కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులు కొందరు మినహా అధికారులు ఒక్కరూ కూడా లేకపోవడంతో రైతులు అక్కడి నుండి ప్రధాన రహదారిపైకి చేరుకొని రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జనార్ధననాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను సర్దిచెపే ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. దీంతో రైతులను బలవంతంగా పక్కకు తరలించారు. ఈక్రమంలోనే ఎస్ఐ హంద్రీనీవా అధికారులకు ఫోన్‌చేసి రైతుల ఆందోళన చేస్తున్న విషయాన్ని వారికి వివరించారు. అంతేగాక పలువురు రైతులను హంద్రీనీవా అధికారులతో మాట్లాడించారు. హెచ్ఎల్‌సి కింద సాగునీరు ఇవ్వమని ఆ అధికారులు ముందే ప్రకటించినట్లు హంద్రీనీవా కింద నీరు ఇవ్వమని మీరు ఎందుకు ప్రకటించలేదని, అలా ప్రకటించి ఉంటే తాము లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి మిరప, తదితర పెట్టుకునేవారం కాదన్నారు. ఇప్పుడు తీరా పంటలు పెట్టుకున్న తరువాత నీరు ఇవ్వమని తూములు మూసివేస్తే మేమెక్కడికి వెళ్లాలని ఫోన్‌లో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉందని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమిదని, తాము ఏమీ చేయలేమని అధికారులు రైతులకు తేల్చిచెప్పారు. దీంతో రైతులు రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించి వెళ్దామని దాదాపు గంటపాటు వేచి చూసి అధికారులెవ్వరూ రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది.

# చర్చలు విఫలం

>> సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా వైద్యుల పదవీ విరమణ వయస్సును 60 యేళ్ల నుంచి 65 యేళ్లకు పెంచకూడదన్న డిమాండ్‌పైనా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.

**మరోసారి చర్చలకు పిలుపు**

తమ డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు రెండు రోజుల్లో జూనియర్‌వైద్యులను పిలుస్తామని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపినట్లు జూడా వెల్లడించింది. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని జూడాలు వ్యక్తం చేశారు.

**నేడు విజయవాడలో జూడాల విలేకరుల సమావేశం**

మంత్రి చర్చల వివరాలను వెల్లడించేందుకు జూనియర్ వైద్యుల సంఘం శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో విలేకరుల సమా వేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల వివరాలు, మూడు డిమాండ్లపై వచ్చిన స్పందన, తదుపరి కార్యాచరణను జూడా ప్రతినిధులు వెల్లడించనున్నారు. సమ్మె కొనసాగింపుపై కూడా విలేకరుల సమా వేశంలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

# మూలపేటలో

>> న్నారు. ఈ క్రమంలో కోరమండల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ భారీ పెట్టుబడులతో శ్రీకాకుళం జిల్లాకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలజరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వం భూకేటాయింపులను ఖరారుచేసింది. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణతో పాటు తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఏపీఐఐసి వీసీ అండ్ ఎండీ, పరిశ్రమల శాఖ సంచాలకులు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. 'మూలపేటలో కోరమండల్ పరిశ్రమ ఏర్పాటు శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ప్రగతికి ఒక చారిత్రాత్మక ముందడుగు. రూ.2,250 కోట్ల పెట్టుబడులతో వచ్చే ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుంది. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది' అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

21-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.నవమి రా.11.37
న.అనూరాధ ఉ.11.53
వ.సా.6.10-రా.7.58
దు1.ఉ.8.23-ఉ.9.13
దు2. మ.12.35-మ.1.25
రాహు.ఉ.10.30-మ.12.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

**వృషభం :** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తలనొప్పిగా మారుతుంది.

**మిథునం :** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనల వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొంటారు. శ్రమ అధికంగా ఉంటుంది.

**కర్కాటకం :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు సౌలభ్యం.

**కన్య :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**తుల :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు :** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. జీవిత భాగస్వామి నుండి ధనం లభిస్తుంది. వస్త్ర లాభం.

**మకరం :** మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించబడతాయి. వాహన సౌఖ్యం. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**కుంభం :** నైపుణ్యతతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో లాభము తెస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మీనం :** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. కాంట్రాక్ట్‌లు దక్కుతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి

# లక్ష దాటిన ప్రవేశాలు

>> పెరిగింది. అదేవిధంగా, 2026-27లో 28,742 మంది విద్యార్థు లకు ప్రైవేట్‌స్కూళ్లలో సీట్లులభించాయి. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం" అని అన్నారు.
విద్యాహక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని, దాని ఫలితంగానే అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు పెరిగాయని మంత్రి తెలిపారు. సమాజంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆర్‌టిఇ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం:**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది. గురువారం శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేష్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు2026, ఎపి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఎపి ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్‌లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఎపి ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

## రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్

# కుమారుడిపై కేసు నమోదు

### దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తా.. చట్టంపై పూర్తి నమ్మకం ఉంది: సంజూష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఈనెల 16న కారు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి ముఖి(26) మృతిచెందారు. రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్ అతివేగంగా ఆస్టన్ మార్టిన్ కారు నడిపి యువతిని ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి సహచరుల ఫిర్యాదుతో మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు లింగమనేని సంజూష్‌పై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా,ప్రమాదం జరిగిన అనంతరం తాను ఎక్కడికీ వెళ్లిపోకుండా స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు సంజూష్ తెలిపారు. జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో పోలీసులకు పూర్తిగా సహకరించానని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన భారతి ముఖిని ఆసుపత్రికి తరలించడం, అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా తాను చట్టపరమైన దర్యాప్తుకు సహకరించానని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని వాస్తవాలను పోలీసులు సమగ్రంగా పరిశీలించి, ప్రమాదానికి ముందు మరియు తరువాత జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం పోలీసులు విచారణ జరుపుతున్నారు అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తన శారీరక పరిస్థితిని నిర్ధారించేందుకు పోలీసులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సంజుష్ తెలిపారు. ఇందులో బ్రీత్ అనలైజర్ టెస్ట్, యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మూడు పరీక్షల్లోనూ నెగెటివ్ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తులో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తానని సంజుష్ తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసుల దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని, దర్యాప్తులో అవసరమైన ప్రతి సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మన దేశ చట్టవ్యవస్థ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం మరియు విశ్వాసం ఉందని, దర్యాప్తు ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు సంజుష్ పేర్కొన్నారు.

# స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలొద్దు: సిపిఎం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్, చైర్ పర్సన్ పోస్టులకు ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని సిపిఎం వ్యతిరేకిస్తున్నది.ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. దీనివల్ల ప్రజలకు దగ్గరగా వుండే కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, యంపిటీసీలు, జెడ్పిటీసీలకు ప్రాధాన్యతవుండదు. అధికారం కేంద్రీకృతమై పోతుంది. 73, 74 రాజ్యాంగ సవరణ స్ఫూర్తి దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది. అందువల్ల ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి. వెనుకబడిన తరగతులకు 34 రిజర్వేషన్లు ఖాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నది. ఇదిఅమల్లోకి రావాలంటే రిజర్వేషన్లపై ఉన్న 50 పరిమితిని సవరించాలి. ఇందుకు పార్లమెంటు చట్టం చేయాలి. కేంద్ర ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగాఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపిలు ఈ రాజ్యాంగ సవరణ జరిగేటట్లు చూడాలన్నారు.

# సాంకేతిక రక్షణ కవచం

>> అడవిలో ప్రతి అణువును కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించే విధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పట్ల పవన్ కల్యాణ్ ఆసక్తి కనబర్చారు. జియోస్పేషియల్ డ్యాష్‌బోర్డ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్యపై ఎప్పటికప్పుడు విశ్లేషణ, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాలు, మానవ- వన్యప్రాణి ఘర్షణల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

**సిబ్బందిలో జవాబుదారీతనం పెంచేలా చర్యలు**

కర్ణాటక అమలు చేస్తున్న ఈగస్తు మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పర్యవేక్షణ, వారి భద్రతా చర్యల్లో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని, గస్తీ, హాజరు, నిరంతర మార్గ నిర్దేశం, నివేదికల సమర్పణకు ఇది సమర్థవంతమైన సాధనంగా పని చేస్తోందని, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖలో ఇప్పటికే అమలులో ఉన్న ఫారెస్ట్ పోర్టల్, సింగిల్ సైన్‌ఆన్ వ్యవస్థలను అనుసంధానించి ఈగస్తు మొబైల్ యాప్ రూపొందించాలని డి.సిఎం సూచించారు. ఇది వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుందన్నారు.

**సత్వర పరిహారం అందించేలా..**

వన్యప్రాణుల వల్ల అటవీ సరిహద్దు గ్రామాల్లో జరిగే పంటల నష్టానికి పరిహారం చెల్లించే ప్రక్రియను కూడా డిజిటలీకరణ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, తద్వారా పంటల నష్టంపై నివేదికలు, రైతులకు పరిహారం చెల్లింపుల వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వేగంగా పరిహారం చెల్లించే వెసులుబాటు కలుగుతుందన్నారు. జిఐఎస్ ఆధారిత ధ్రువీకరణ వ్యవస్థను తక్షణం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**అటవీ సరిహద్దులకు చట్టబద్ధమైన భద్రత**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గనిర్దేశకత్వంలో, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నాయకత్వంలో ఇప్పటికే అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రంలో కూడా చేపట్టిన విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. తద్వారా అటవీ సరిహద్దుల చట్టబద్ధతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు హనుమాన్ ద్వారా ఇప్పటికే మానవ- వన్యప్రాణుల ఘర్షణల నివారణ, విశ్లేషణ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన డ్యాష్‌బోర్డులు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు.

**కర్ణాటకతో పరస్పర సాంకేతిక సహకారం..**

ఇప్పటికే కర్ణాటక అటవీ శాఖతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి పలు ఒప్పందాలు చేసుకున్నామని, పరస్పర సాంకేతిక సహకారం దిశగా అడుగులు వేయనున్నట్లు డి.సిఎం పవన్ కల్యాణ్ వివరించారు. అందుకోసం ఇరు రాష్ట్రాల అటవీశాఖల ఆధ్వర్యంలో సంయుక్త సాంకేతిక వర్క్‌షాప్‌లు, పత్రాల మార్పిడి, అవసరం ఉన్న చోట సోర్స్ కోడ్ భాగస్వామ్యం, జిఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

21-8pg3exHMNWJQEBCRP:21-8pg3exHMNWJQEBCRP.qxd 21/Aug/26 12:41 AM Page 1



## సర్ క్లెయిమ్‌లు, అభ్యంతరాల విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ2026 ప్రక్రియను, క్లెయిమ్ లు, అభ్యంతరాల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. సచివాల యం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, అదనపు డిఇఒలు, డిప్యూటీ డిఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒ ఎస్.డిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు. ఓటర్లకు మరింత సులభంగా సేవలు అందించేందుకు ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు సిఇఒ వెల్లడించారు. ఆయా రోజుల్లో బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి, ఓటర్ల జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, మార్గదర్శకాలను అందిస్తారని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్లకు, మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు అందజేయడం, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, బిఎల్‌ఓలతో బుక్ ఎ కాల్ పెండింగ్ సమస్యలు, ఎన్‌జిఎస్‌పి పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులపై సిఇఒ నిశితంగా సమీక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సిఇఒ ఆదేశాలు జారీచేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో ఓటర్ల నమోదు అధికారులకు అర్ధన్యాయ అధికారాలు ఉన్నాయని, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విచారణల సమయంలో ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను బిఎల్ఓ యాప్ ద్వారా మాత్రమే అప్‌లోడ్ చేయాలని, ఇందుకు బిఎల్‌ఓలకు సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు.

# ప్రతి బోటు.. ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలి

- ఘటన తర్వాత స్పందించడం కంటే.. ముందే అప్రమత్తంగా ఉండాలి
- గల్లంతైన మత్స్యకారుల ఆచూకీపై సిఎం చంద్రబాబు సమీక్ష
- 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలిస్తున్నట్లు అధికారుల వివరణ



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తర్వాత స్పందించడం కాకుండా.. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించేలా ఎస్ఓపి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, వేటకు వెళ్లే వారి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటేనే అత్యవసర సమయాల్లో సత్వర సాయం అందించగలమని స్పష్టం చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఒడలరేవు, దుమ్ములపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటనపై గురువారం కూడా క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు**

ఈ నెల 3వ తేదీన ఏడుగురు మత్స్యకారులు బోటులో వేటకు వెళ్లారని, పది రోజుల తర్వాత తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నెల 16న మత్స్యకారుల ఆచూకీ లభించడం లేదని కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. బోటులో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు, బోటు ఒంటరిగా ఎందుకు సముద్రంలోకి వెళ్లింది? బోటు గల్లంతైన విషయం అధికారులకు ఎప్పుడు తెలిసింది? తెలిసిన వెంటనే గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు? అనే అంశాలపై సిఎం అధికారులను ప్రశ్నించారు. గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే చెన్నైలోని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌తో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ఏపికి చెందిన బోటు గల్లంతైన విషయాన్ని అండమాన్ సహా బంగ్లాదేశ్ కు కూడా చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారుల ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. నేవీ డార్నియర్ విమానాల ద్వారా 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు నిర్వహించినట్లు సిఎంకు వివరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు అందుతున్న సాంకేతిక సహాయం, రోజువారీ సమన్వయ వ్యవస్థలపైనా చంద్రబాబు సమీక్షి ంచారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మత్స్యకారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

**భద్రతలో మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత**

సముద్రంలో గల్లంతయిన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. ఈ నెల 16న 8 మంది మత్స్యకారులు వేటకు వెళ్లగా సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు

## మెడికో ప్రియాంక కేసు సీన్ రిక్రియేషన్

### కొనసాగుతున్న నిందితుల పోలీసు కస్టడీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వైద్య విద్యార్థిని ప్రియాంక కేసులో నిందితుల పోలీసు కస్టడీ కొనసాగుతోంది. సీన్ రిక్రియేషన్ తోపాటు పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. రెండు రోజుల పోలీసు కస్టడీలో ఉన్న ఏ1 సురవరపు దస్వంత్, ఏ2 ఆండ్రూ ఎడ్వర్డ్ జోసఫ్‌ల నుంచి పోలీసులు కీలక వివరాలు రాబడుతున్నారు. ప్రియాంక స్కూటీని కారు ఢీకొట్టిన ఘటనకు సంబంధించి ఆధారాలను సేకరిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు కీలకమైన సీన్ రీక్రియేషన్ నిర్వహించారు. తొలుత మోరంపూడిలోని ద్వారకానగర్‌లో ఉన్న ఏ1 దస్వంత్ ఇంటికి నిందితుడిని తీసుకెళ్లి ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. అనంతరం లాలాచెరువులోని హనుమ ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లో ఉన్న ఏ2 జోసఫ్ ఇంటి వద్ద కూడా సీన్ రీక్రియేషన్ చేశారు. అనంతరం ఘటన జరిగిన ఏవీ అప్పారావు రోడ్డులోని ప్రసాదిత్య మాల్ వద్దకు నిందితులను తీసుకెళ్లి ఘటన ఎలా జరిగిందన్న అంశంపై పోలీసులు వివరాలు సేకరించారు. స్కూటీని కారు ఢీకొట్టిన విధానం, నిందితుల కదలికలు, ఘటనకు ముందు, తరువాత జరిగిన పరిణామాల పై ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. సీన్ రీక్రియేషన్ తో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. సేకరించిన ఆధారాలు, నిందితుల వాంగ్మూలాలను క్రోడీకరించి దర్యాప్తు నివేదికలో పొందుపరుస్తున్నారు. కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు.



## సమ్మెలోనూ జూడాలు సేవాభావం

### రక్తదానంతో మానవత్వం చాటిన జూనియర్ వైద్యులు

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 11వ రోజుకు చేరుకుంది. మూడో దశలో నాలుగో రోజైన గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ వైద్యులు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు. ఇంటర్న్ వైద్యులు, పిజి వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా సుమారు 125 మంది ఇంటర్న్, రెసిడెంట్ వైద్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజారోగ్యం, సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. మరో 15 మంది పిజి వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. భారత వైద్యుల సంఘం యువ వైద్యుల విభాగం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ ఆరే నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ వైద్యులకు, వారి డిమాండ్లకు సంఘీభావం తెలిపారు. గుంటూరు వైద్యుల సంఘం ప్రతినిధులు కూడా నిరసన ప్రదేశాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్, ఆర్థోపెడిక్స్ విభాగం ఆచార్యుడు, అధిపతి డాక్టర్ పి. అనిల్ బాబు, కోశాధికారి డాక్టర్ కవిత, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ శివ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన జూనియర్ వైద్యుల సంఘాల ప్రతినిధులు తమ తమ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని కోరారు. అర్థవంతమైన చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపి, పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని విజ్ఞప్తి చేశారు.
పాటలతో నిరసన: అనంతరం జూనియర్ వైద్యులు తమ ఇంటర్న్‌షిప్, పిజి శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందులు, సమస్యలను ప్రతిబింబించే పాటలను ఆలపించారు. పాటల ద్వారా తమ ఆవేదనను, నిరసనను శాంతియుతంగా, సృజనాత్మకంగా వ్యక్తం చేశారు.

## ఒంగోలులో విషాదం

### లిఫ్ట్ దిగుతూ మహిళ మృతి

**ఒంగోలు(క్రైమ్), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలోని సూర్య టవర్స్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్న లిఫ్ట్ ప్రమాదంలో 50 ఏళ్ల మహిళ మృతి చెందారు. కుమార్తె, మనవడితో కలిసి లిఫ్ట్‌లో ప్రయాణించిన వినీత ప్రమాదానికి గురయ్యారు. లిఫ్ట్ ఒక అంతస్తుకు చేరుకున్న అనంతరం కుమార్తె, మనవడు ముందుగా బయటకు వెళ్లారు. వినీత కూడా లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో అనూహ్యంగా లిఫ్ట్ కిందకు కదిలినట్లు సమాచారం. ఆ సమయంలో లిఫ్ట్ గేట్లు పూర్తిగా మూసుకోకపోవడంతో ఆమె బయటకు రావడానికి ప్రయత్నించగా ఫ్లోర్, లిఫ్ట్ మధ్య ఇరుక్కుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె కుమార్తె తీవ్ర ఆందోళనకు గురై సహాయం కోసం కేకలు వేయగా అపార్ట్‌మెంట్‌లోని ఇతర నివాసితులు అక్కడికి చేరుకున్నారు. లిఫ్ట్ గేటును తెరిచి వినీతను బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు. కొంతసేపటి అనంతరం ఆమెను లిఫ్ట్ నుంచి బయటకు తీసి అత్యవసరంగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించినప్పటికీ ఆమె ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో వినీత కుమార్తె లిఫ్ట్ గేటును తెరిచి తల్లిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. చుట్టుపక్కల వారు కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో అపార్ట్‌మెంట్ వాసుల్లో భయాందోళన నెలకొంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నగరంలోని అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాల్లో ఉన్న లిఫ్ట్‌ల భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

## విశాఖపట్నం స్కూల్ ఘటనపై విద్యాశాఖ తీవ్ర దిగ్భ్రాంతి

### ముగ్గురు సభ్యుల కమిటీ విచారణకు ఆదేశం

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో మైనర్ విద్యార్థి మృతి చెందిన ఘటన అత్యంత దురదృష్టకరం, బాధాకరం. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తోందని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను సమర్పించారు. ఆ ప్రాథమిక నివేదిక ఆధారంగా వాస్తవాలను సమగ్రంగా పరిశీలించేందుకు త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇందులో విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఒ) సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా, విద్యార్థులతో ఉపాధ్యాయులు సున్నితంగా, బాధ్యతాయుతంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించేలా అవసరమైన సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. త్రీమెన్ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి తగిన చర్యలు తీసుకోబడతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.

## ఎపిపిఎస్సీ, డిఎస్సీల మధ్య వ్యత్యాసం జగన్‌కు తెలియదు: మంత్రి లోకేష్



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌కు ఎపిపిఎస్సీ, డిఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆరోపణలు చేసారు. జగన్ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్‌మీట్ వీడియోను లోకేశ్ గురువారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "ఎపిపిఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డిఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు. ఎపిపిఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డిఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ) ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

**టీచర్ కొట్టడంతో విద్యార్థి మృతి బాధాకరం: మంత్రి లోకేశ్**

విశాఖలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్ కొట్టడంతో ఆరేళ్ల ప్రణయ్ తేజ్ మృతి చెందటం బాధాకరమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాధ్యులపై, సంబంధిత స్కూలు యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులకు ప్రగాఢ సంతాపం తెలియజేసారు. 'ధైర్యంగా ఉండండి.. మీకు కలిగిన నష్టం ఎవ్వరూ పూడ్చలేనిది.. తమ ప్రభుత్వం మీకు అన్నివిధాలా అండగా ఉంటుంది' అని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ప్రణయ్ తేజ తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేసారు.

## విశాఖ జూపార్క్ వద్ద పోలీస్ ఎస్కార్ట్ వాహనం ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా


**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ జూపార్క్ వద్ద పోలీస్ ఎస్కార్ట్ వాహనం ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీసారు. విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు హోంమంత్రి అనిత సూచించారు. ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితిని పోలీస్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. విశాఖ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. గాయపడిన కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచన చేసారు. గాయపడిన కానిస్టేబుళ్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు తేదీని మార్చారు. గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటించగా తాజాగా ఆగస్టు 26, బుధవారానికి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26కే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే రోజు ఈ పండగకు ప్రభుత్వ సెలవు అమల్లో ఉండనుంది.

# ఎంఎస్ఎంఇలకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు

- విశాఖలో అంతర్జాతీయ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్
- మూడు రోజులు పాటు సమావేశాలు
- 25 దేశాల నుంచి 40 మందికి పైగా కొనుగోలుదారులు 250కుపైగా ఎంఎస్ఎంఇలు హాజరు



**విశాఖపట్నం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ఆర్ఏఎంపీ) పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఎంఈడిసీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో)తో కలిసి నిర్వహిస్తున్న అంతర్జాతీయ రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్ (ఆర్బీఎస్ఎం)ను గురువారం విశాఖపట్నంలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎపి ఎంఎస్ఎంఇడిసి డైరెక్టర్లు నీలపు విజయానందరెడ్డి, ముగడ రాజారావు, ప్రధాన విజయరామ్, పి.వి.వి. సత్యనారాయణమూర్తి, డాక్టర్ చిన్నరాజు గుడిపూడి, నల్లే వీర ప్రసన్నకుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఫియో ప్రతినిధులు, విదేశీ కొనుగోలుదారులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు, పాల్గొంటున్న ఎంఎస్ఎంఈలు తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో 25 దేశాల నుంచి 40 మందికి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఆంధ్రప్రదేశ్‌లోని 250కు పైగా ఎంఎస్ఎంఈ లు పాల్గొంటున్నాయి. ఎగుమతి అవకాశాలు, వాణిజ్య భాగస్వామ్యాలు, వ్యాపార ఆర్డర్లకు దారితీసేలా కొనుగోలుదారులు ఎంస్ఎంఇల మధ్య నిర్మిత వన్‌టువన్ వ్యాపార సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగించిన ఎపి ఎంఎస్ఎంఇడిసి చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఇలు వెన్నెముకగా నిలుస్తున్నాయని అన్నారు. ఉపాధి కల్పన, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, సమగ్ర ఆర్థిక వృద్ధిలో ఎంఎస్ఎంఇల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు కొత్త సంస్థలను స్థాపించడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం, ఆర్థిక వనరులను పొందడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను నేరుగా చేరుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, బియ్యం, వస్త్రాలు, రసాయనాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ బలాలను అంతర్జాతీయంగా పోటీపడగల ఉత్పత్తులుగా మార్చేందుకు విలువ ఆధారిత ఉత్పత్తులు, మెరుగైన ప్యాకేజింగ్, తగిన ధ్రువపత్రాలు, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల పాటింపుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లకు మధ్య ఉన్న దూరాన్ని ఆర్బిఎస్ఎం వంటి కార్యక్రమాలు తగ్గిస్తున్నాయని చైర్మన్ తెలిపారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను నేరుగా రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ఎంఎస్ ఎంఈ లకు కీలకమైన మార్కెట్ అనుసంధానాన్ని ఈ కార్యక్రమం అందిస్తోందన్నారు. పాల్గొంటున్న ఎంఎస్ఎంఇలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కొనుగోలుదారుల నిర్దిష్ట అవసరాలను అర్థం చేసుకుని, కార్యక్రమం అనంతరం కూడా నిరంతరంగా వారితో సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గ్రామీణ స్థాయి నుంచే ఔత్సాహికతను ప్రోత్సహించడం, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే ఉన్న, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు సామర్థ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, సాంకేతికత స్వీకరణ, ఇతర సహాయక చర్యల ద్వారా ఏపీ ఎంఎస్ఎంఇడిసి నిరంతరం మద్దతు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి స్వాగతం పలికిన ఫియో జాయింట్ డైరెక్టర్ జనరల్ కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, విశ్వసనీయమైన అంతర్జాతీయ కొనుగోలుదారులను గుర్తించడం, అంతర్జాతీయ మార్కెట్లను నేరుగా చేరుకోవడం ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటని అన్నారు. ఈ ఆర్బీఎస్ఎంలో పాల్గొంటున్న అంతర్జాతీయ కొనుగోలుదారులు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్, సుగంధ ద్రవ్యాలు, బియ్యం, సముద్ర ఉత్పత్తులు, ఫుడ్ ఇంగ్రిడియంట్స్, రసాయనాలు, తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. వన్‌టువన్ సమావేశాల ద్వారా ఎంఎస్ఎంఇలు తమ ఉత్పత్తులు, సామర్థ్యాలను అంతర్జాతీయ కొనుగోలుదారులకు పరిచయం చేయడంతో పాటు మార్కెట్ అనుకూలతను అంచనా వేసుకోవడం, ఎగుమతులు, సోర్సింగ్, ఉత్పత్తి అభివృద్ధి, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాలపై చర్చించే అవకాశం లభిస్తోంది. వ్యవసాయ, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాలు పెరగడం ద్వారా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీవో), ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రామీణ వ్యాపార సంస్థలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రాసెస్డ్, ఎగుమతి ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం ద్వారా స్థానికంగా విలువ జోడింపు, పంట అనంతర నష్టాల తగ్గింపు, ఉత్పత్తులకు మెరుగైన ధర లభించడం, రైతుల ఆదాయాల పెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం అంతర్జాతీయ కొనుగోలుదారులను ఎంఎస్ఎంఇ ప్రతినిధులకు పరిచయం చేసి, వన్‌టువన్ వ్యాపార సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 20, 21 తేదీల్లో కూడా కొనసాగనున్నాయి. ఎపిఎంఎస్ఎంఇడిసి, ఫియో బృందాలు ఈ సమావేశాలను సమన్వయం చేస్తున్నాయి. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎగుమతి అవకాశాలను ఆయన వివరించారు.

# వేగంగా కుప్పం - మారికుప్పం రైల్వేలైన్ పనులు

- రూ.363-500 కోట్ల వ్యయం అంచనా.. కర్ణాటకలో పనులు పూర్తి
- ఆంధ్రప్రదేశ్‌లో ఊపందుకున్న పనులు.. 2028 మార్చికి పూర్తి లక్ష్యంగా చర్యలు



గుడుపల్లె మండలం అగరం వద్ద రైల్వేలైనుకు పనులు చేపడుతున్న దృశ్యం

**కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** కుప్పం పట్టణం నుంచి కర్ణాటకలోని మారికుప్పం (కెజిఎఫ్) నూతన రైల్వేలైను పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం గుడుపల్లె మండలంలో రైల్వే లైనుకు సంబంధించిన పనులు చేపడుతున్నారు. మొత్తం 23.7కి.మీ.ల మేర ఈ నూతన రైల్వేలైను నిర్మిస్తున్నారు. ఇందులో కర్ణాటక ప్రాంతంలో 6కి.మీ.ల దూరం ఉండగా ఆంధ్రలోనే అత్యధికంగా 17.7కి.మీ.లమేర రైల్వే లైను వస్తోంది. సుమారు రూ.363కోట్ల నుంచి రూ.500కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ పశ్చిమ రైల్వే ఈ ప్రాజెక్టు చేపడుతోంది. కర్ణాటక ప్రాంతంలో పరిధిలో ఇప్పటికే రైల్వే ట్రాక్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఆంధ్ర ప్రాంతం లో గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి రైల్వే లైనుకు భూసమీకరణ పనులు ఆలస్యం కావడంతో ప్రాజెక్టు కొంత మందగించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైల్వే లైనుకు అవసరమైన భూసేకరణ పనులు దాదాపు పూర్తి చేయడంతో పనులు వేగం పుంజుకున్నాయి.

2028మార్చిలోగా పూర్తి : కుప్పం - మారికుప్పం రైల్వేలైనును 2028మార్చిలోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించుకున్నారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రాంతంలో సివిల్ ఇంజనీరింగ్, భూమి చదును, కల్వర్టులు, వంతెనల నిర్మాణాలతో పాటు రైల్వేట్రాక్‌ను నిర్మించాల్సి ఉంది. కాగా ఈ నూతన రైల్వేలైనులో కర్ణాటకలోని విరూపాక్షపురం, కుప్పం ద్రవిడ వర్సిటీ సమీపంలో కొత్తగా రైల్వేస్టేషన్లను నిర్మించనున్నారు. ఈ రైల్వేలైను మారికుప్పం నుంచి అగరం, ద్రవిడ వర్సిటీ, గుత్తార్లపల్లి మీదుగా కుప్పం రైల్వేస్టేషన్‌లో కలుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కుప్పం ప్రాంత ప్రజలకు ఉపయుకంగా ఉంటుంది. ఈ నూతన రైల్వేలైను అందుబాటులో వస్తే చెన్నై - బెంగళూరు నగరాల మధ్య తిరిగే ప్రయాణీకులకు సైతం వెసులుబాటు కలగడంతో పాటు ప్రధాన రైలు మార్గంలో సైతం రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు, రైళ్లకు రూట్ క్లియరెన్స్‌లు త్వరగా కలిగే అవకాశముంది.

21-8pg4:21-8pg4.qxd 20/Aug/26 10:34 PM Page 1



వార్త

రాజకీయాలలో తప్పులు చేస్తే వాటి విష ఫలితాలను లక్షలు, కోట్ల మంది అనుభవించవలసి వస్తుంది.

న-గోథే

# భూగర్భజల సంక్షోభం?


నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావాల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టంఏమిటంటే వేసవిలోనే కాదు, వర్షాకాలంలో కూడా నీటి కష్టాలుఇబ్బడి ముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చబోతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. భూగర్భమట్టాలు నానాటికీ దిగజారిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. యేటాయేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం ఎనభై శాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం రోజురోజుకు తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి ప్రయత్నాలు జరగక్కపోవడంతో మట్టాలు దిగజారిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా భూగర్భజలాల వినియోగం అంతకంతకు పెరుగుతున్నది. దీనిని నియంత్రించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా, యమున, కావేరి లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే సాగునీరు నిరుపయోగంగా సముద్రం పాలవుతున్నది. ఇంకొకపక్క ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా దాదాపు మూడువందల ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలను భారత్ వినియోగించుకుంటున్నది. దేశంలో ఆరు వేల ఐదువందల డెబ్భైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాకులు పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింతగా అడుగంటిపోతాయి. భారత్‌లో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూట అరవై రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటి వల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవం. లక్షలాది ఎకరాలు బీడుభూములు సాగుల్లోకి వచ్చిన మాట కూడా వాస్తవమే. అయితే ఇది రాను రాను పెరగడం మాత్రం అత్యంత ప్రమాదకరమంటున్నారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా వాననీటిని ఒడిసిపట్టే కార్యక్రమాలు చేపట్టకుండా బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నీటివృధా కూడా బాగా పెరిగింది. పంజాబ్‌లో డెబ్భైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవై శాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం భూగర్భజలాలను వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాలు దేశం వనరుల్లో అరవై శాతంపైగా హరించుకుపోతాయని ప్రపంచ బ్యాంకు గతంలో ఒక నివేదికలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్థాన్, హర్యానా,పంజాబ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో యేటా లక్షలాది కోట్లలీటర్ల భూగర్భజలాలను తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో ఐదు శాతం పైగా పెరుగుదల నమోదవుతున్నది. గతంలో చేసిన అధ్యయనాల్లో వెల్లడయింది. మరొకపక్క దేశంలో అధిక శాతం జిల్లాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం రెండువందల యాభై నాలుగు జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, రెండువందల ఇరవై నాలుగు జిల్లాల్లో ఫ్లోరైడ్, నూటఅరవైరెండు జిల్లాల్లో క్షారత, ముప్పైనాలుగు జిల్లాల్లో పాషాణం స్థాయికి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగు చూసింది. ముఖ్యంగా పాషాణం లాంటి భారీ లోహాలను భూగర్భజలాల నుంచి తొలగించడం కష్టంగా మారుతుందని అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరా కూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోవడం కూడా మరొక కారణంగా చెప్పొచ్చు. కొన్ని పరిశ్రమలు ముఖ్యంగా శీతలపానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నగర, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల్లో వాడకం పెరిగిపోతున్నది. నీటి వృథాకు అదుపు లేకుండాపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టివేయలేం. భూగర్భజలాల మట్టాల పెంపునకు దేశవ్యాప్తంగా చర్యలుతీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్‌కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువులు, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మతు చేయించడంతో చాలా ప్రాంతాల్లో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని చెప్పొచ్చు. కానీ అవి వాడుతున్న భూగర్భజలాల మట్టాలను భర్తీ చేయలేకపోతున్నాయి. అందుకే భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. సాగునీటి సంగతి దేవుడెరుగు. గుక్కెడు మంచినీళ్ల కోసందేశవ్యాప్తంగా కోట్లాది మంది పడరాని పాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రకరకాల రోగాల బారినపడుతున్నారు. స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ప్రజలందరికి కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.

ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.



స్వామి వివేకానంద

నాలుక మనం చెప్పినట్లు వినకపోవడమే అన్ని అనర్థాలకు మూలం.



సెనెకా

# సప్తధారల సంగమమే వికసిత్ భారత్

*భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవాహాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షి తమైన, పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన, సాంస్కృతికంగా ప్రభావవంతమైన దేశంగా ఎదుగుతుంది. సప్త ధారల సంగమం సంపన్న భారతానికి మార్గం.*

**తిప్పర్తి శ్రీనివాస్**

భారతదేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకుసాగుతున్న వేళ, వికసిత్ భారత్ అనే లక్ష్యం దేశం ముం దున్న అత్యంత ప్రతిష్ఠాత్మక సంకల్పంగా నిలుస్తోంది. అభి వృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం కాదు.ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు,యువతకుఉపాధి అవకాశాలు,రైతుకు స్థిరమైన ఆదాయం, పరిశ్రమలకు అను కూల వాతావరణం, సాంకేతికతలో స్వావలంబన, పర్యా వరణ పరిరక్షణ, ప్రపంచ వేదికపై భారతదేశానికి గౌరవ ప్రదమైన స్థానం ఇవన్నీ కలిసిన సమగ్ర పురోగతే నిజమైన వికసిత్ భారత్. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతిశక్తి, రక్షాశక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు కీలక రంగాలు దేశ ప్రగతికి సప్త ధారలుగా నిలవగలవు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ మానవ వనరు లను అభివృద్ధికి వినియోగించుకోవాలంటే తయారీ రంగం బలపడాలి. కేవలం సేవారంగంపై ఆధారపడకుండా ఎలక్ట్రా నిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలు, ఔషధాలు, ఆటో మొబైల్స్, టెక్స్‌టైల్స్, యంత్ర పరికరాలు వంటి రంగాల్లో దేశీయ ఉత్పత్తి పెరగాలి. 'మేక్ ఇన్ ఇండియా' భావన ఉత్పత్తి పెంపుతోనే ఆగిపోకూడదు. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో విశ్వసనీయత, నాణ్యత, పోటీ సామర్థ్యం పెరగాలి. పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేయాలి. తయారీ రంగం విస్తరించినప్పుడే కోట్లాది యువతకుప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భారత ఆర్థిక వ్యవస్థకు రైతాంగం వెన్నెముక. వ్యవసాయం లాభసాటిగా మారకుండా వికసిత్ భారత్ కల సాకారం కావడం కష్టం.రైతుకు కేవలం ఉత్పత్తి పెంచేసాంకేతికత ఇవ్వడం సరిపోదు, ఉత్పత్తికి తగిన ధర, నిల్వ సదుపాయాలు, రవాణా,ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు కూడా అందుబాటులో ఉండాలి. సూక్ష్మ నీటిపారుదల, డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ సలహాలు, మట్టి పరీక్షలు, వాతావరణ సమాచార వ్యవస్థలు రైతుకు అందుబాటులోకిరావాలి. వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుగా కాకుండా 'అగ్రిబిజినెస్'గా చూడాలి.ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచవచ్చు. రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశీయ మార్కెట్ విస్తరిస్తుంది. 21వ శతాబ్దపు ప్రపంచ పోటీలో సాంకేతికతే ప్రధాన శక్తి. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాలి. సాంకేతికతను కేవలం పెద్ద నగరాలకు పరిమితం చేయకుండా గ్రామీణ భారతానికి తీసుకెళ్లడం అవసరం.డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ వంటి సేవలు సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేయాలి. అదే సమయంలో డిజిటల్ విభజన తగ్గాలి. సాంకేతికత కొద్దిమందికి మాత్రమే అవకాశాలు కల్పిస్తే అది సమగ్ర అభివృద్ధి కాదు. దేశ ఆర్థిక ప్రగతికి రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ వ్యవస్థలు కీలకం. ఒక ప్రాంతంలో తయారైన వస్తువు మరో ప్రాంతానికి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేరేలా మౌలిక



వసతులు అభివృద్ధి చెందాలి. 'గతిశక్తి భావన కేవలం రవాణా వేగానికి సంబంధించినది కాదు.దేశంలోని ఉత్పత్తికేంద్రాలు, మార్కెట్లు, పోర్టులు, పరిశ్రమలు, వ్యవసాయ ప్రాంతాలను సమర్థవంతంగా అనుసంధానించే సమగ్రవ్యవస్థ కావాలి. మౌలిక వసతులపై పెట్టుబడులు పెరిగితే పరిశ్రమలు వస్తాయి, ఉద్యోగాలు పెరుగుతాయి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి.దేశం ఆర్థికంగా ఎంత బలంగాఉన్నా,భద్రతా పరంగా బలహీనంగా ఉంటే ఆ అభివృద్ధికి స్థిరత్వం ఉండదు. అందుకే రక్షణ రంగంలో స్వావలంబన అత్యవసరం. ఆయుధాలు, డ్రోన్లు, క్షి పణులు, రాడార్లు, సైబర్ భద్రత, అంతరిక్ష రక్షణ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెం చాలి. రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల ఒక వైపు జాతీయ భద్రత బలోపేతం అవుతుంది. మరోవైపు అధునాతన పరిశ్రమలకు, పరిశోధనకు, నైపుణ్య ఉపాధికి అవకాశాలు ఏర్పడతాయి. రక్షణ రంగాన్ని దిగుమతులపై ఆధారపడే వ్యవస్థనుంచి పరిశోధన, ఆవిష్కరణ, ఎగుమతు ల కేంద్రంగా మార్చడం వికసిత్ భారత్‌కు కీలకం. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేసే నమూనా ఇకపై కొన సాగదు. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు సౌర,పవన, జల, గ్రీన్ హైడ్రోజన్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరులు కీలకంకానున్నాయి. గ్రీన్ ఎనర్జీపై పెట్టుబడులు పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చు. విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ సాంకేతికత, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా కొత్త ఆర్థిక అవకాశంగా చూడాల్సిన సమయం ఇది. భారతదేశానికి ప్రపంచ వేదికపై ప్రత్యేకమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మేధోసంపద ఉంది. యోగా, ఆయుర్వేదం, భారతీయ సంగీతం,నృత్యం, కళలు, సాహిత్యం, సినిమా, వంటకాలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రవాస భారతీయుల ప్రభావం ఇవన్నీ భారతదేశ సాఫ్ట్ పవర్‌ను పెంచగల శక్తులు. ప్రపంచంతో సంబంధాలు కేవలం వాణిజ్యం, దౌత్యం, రక్షణ ఒప్పందాలద్వారా మాత్రమే ఏర్పడవు. సంస్కృతి, విద్య, మానవీయ విలువలు కూడా దేశాల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచుతాయి. భారతీయ సంస్కృతి, విజ్ఞానం, ఆలోచనా విధానం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలి. భారతదేశాన్ని కేవలం పెద్ద మార్కెట్‌గా కాకుండా జ్ఞానం, సంస్కృతి, విలువలకు ప్రతీకగా ప్రపంచం గుర్తించేలా చేయాలి. ఈ ఏడు రంగాలను విడివిడిగా చూడటం సరైన విధానం కాదు. తయారీ రంగానికి సాంకేతికత అవసరం. తయారీకి గతిశక్తి అవసరం. రైతాంగానికి సాంకేతికత, మౌలిక వసతులు అవసరం. పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ అవసరం. రక్షణ రంగానికి అత్యాధునిక సాంకేతికత అవసరం. ప్రపంచ మార్కెట్లలో భారత ఉత్పత్తులకు గుర్తింపు రావడానికి సాఫ్ట్‌పవర్ కూడా తోడ్పడుతుంది. అంటే ఈ సప్త ధారలుపరస్పరం అనుసంధానమైన అభివృద్ధి ప్రవాహాలు. అయితే విధానాలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటి అమలులో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనం ఉండాలి. కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు, రైతులు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేసినప్పుడే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. అభివృద్ధి ఫలాలు దేశంలోని చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే వికసిత్ భారత్ అనే పదానికి నిజమైన అర్థం వస్తుంది. భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవా హాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షి

# 'ఇవి' విప్లవంతో ప్రకృతిపై భారం!

**నూకల దేవేందర్**

ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. భారతదేశం సైతం నగరాలను కాలుష్యరహితం చేయడానికి ఈవీలకు ప్రాధాన్యత ఇస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనూ దీనికి సంబంధించి కార్యాచరణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌ను కాలుష్యం నుంచివిముక్తి చేయడానికి క్యూర్ పరిధిలో ఈవీ ఆటోలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో కాలుష్య నివారణకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఈవీల వల్ల పట్టణాలు, నగరాల్లో కాలుష్యాన్ని కొంతమేర నివారించగలిగినా వాటి తయారీకి అవసరమయ్యే ఖనిజాల కోసం గ్రామాలు, అడవులు, పర్వతాలు, తద్వారా ప్రకృతికి ఎంత మేర నష్టం జరుగుతుందో ప్రభుత్వాలు ఒక అంచనా వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సాధారణ పెట్రోల్ కారు కంటే ఈవీ కారును తయారు చేయడానికి ఆరు రెట్లు ఎక్కువ ఖనిజాలు అవసరమవుతాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. ఎలక్ట్రిక్ కార్లలో బ్యాటరీలు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థల కోసం రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్ వంటి ఖనిజాలు ఎక్కువగా అవసరం కావడమే దీనికి కారణమని తేల్చింది. ఈవీ మార్కెట్ పుంజుకుంటుండడంతో ఈ ఖనిజాలకు సైతం డిమాండ్ పెరుగుతున్నది. 2040 నాటికి వీటి డిమాండ్ రెట్టింపవుతుందని ఐఈఏ అంచనా వేసింది.ఈవీల తయారీకి అవసరమయ్యే ఖనిజాలు వెలికితీయాలంటే పెద్ద గనులు ఏర్పాటు చేసి మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం అడవులను నరకడం, కొండలను తొలగించడంవంటి చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. భూములను తవ్వడం, ఖనిజాలను వేరు చేయడం, శుద్ధి చేయడానికి నీరు, విద్యుత్ అవసరమవుతాయి. దీనివల్ల కూడా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడి వేరే మార్గాల ద్వారా కాలుష్యం పెరగవచ్చు. గనుల ప్రాంతాలనుబట్టి వ్యర్థాలు, నీటి కాలుష్యం, నేలపై పడే ప్రభావం వల్ల స్థానిక జీవ వైవిధ్యానికి ముప్పు తలెత్తవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలు వంద శాతం కాలుష్యరహిత వాహనాలు కావు. పెట్రోల్ కార్లతో పోలిస్తే మన దేశంలో వీటి జీవిత కాల ఉద్గారాలు సుమారు 20 శాతం మాత్రమే తక్కువగా ఉన్నాయని అనేక నివేదికలు చెప్తున్నాయి. మరోవైపు ఈవీ తయారీకి అవసరమయ్యే ఖనిజాలు తవ్వే సమయంలో,వాటిని శుద్ధి చేసే సమయంలో, బ్యాటరీ తయారు చేసే సమయంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అంటే ఈవీల ద్వారా ఓ వైపు నగరాల్లో కాలుష్యాన్ని తగ్గిస్తూ గనుల తవ్వకాల పేరుతో మరో చోట పర్యావరణానికి హానీ చేస్తున్నామా? అనేది మనం నిర్ధారించుకోవాల్సి ఉన్నది.2025 నాటికి ప్రపంచ ఈవీ బ్యాటరీ వినియోగం 1.2 టెరావాట్ గంటలకు చేరింది. 2020తో పోలిస్తే ఏది ఏడు రేట్లు ఎక్కువ. భవిష్యత్తులో ఈ డిమాండ్‌ను తట్టుకోవాలంటే వాడేసిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం అత్యంత కీలకం. 2040 నాటికి అవసరమైన ఖనిజాల్లో 20శాతం వాటా రీసైక్లింగ్ ద్వారానే వస్తుందని అంచనా. దీంతో రీసైక్లింగ్‌పై ప్రభుత్వాలు ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. పటిష్టమైన రీసైక్లింగ్ పాలసీని రూపొందించాలి.ఒక వాహనంలో వాడే బ్యాటరీజీవిత కాలం ఎంత? పాడైపోయాక దాన్ని ఎక్కడ రీసైక్లింగ్ చేయాలి? అనే విషయాలను పొందుపర్చాలి.ప్రతి పెట్రోల్ కారు స్థానంలో ఈవీని రోడ్డెక్కిస్తే పర్యావరణ, కాలుష్య సమస్య తీరదు. దీనివల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం దొరకదు. ముందుగా వ్యక్తిగత వాహనాలవాడకాన్ని తగ్గించాల్సి ఉంటుంది. మెట్రో, రైళ్లు, బస్సులవైపు ప్రజలను మళ్లించాల్సి ఉంటుంది. నడిచేదూరం ఉన్నచోట నడక,సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాలి.అప్పుడే వాహనాల అవసరం తగ్గుతుంది.తద్వారా ఖనిజాలతవ్వకాలు తగ్గిప్రకృతిపై పడుతున్న భారం తగ్గుతుంది. పెట్రోల్ కారా, ఈవీ కారా అన్నదికాదు.అసలు మనకు ఎన్నికార్లు అవసరమన్న ప్రశ్నే భవిష్యత్ పర్యావరణ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. ●

# పేరెంట్స్-టీచర్స్ భాగస్వామ్యమే బడులకు బలం

**శ్రీ నగేష్ మల్లాడి**

విద్యా విషయ విశ్లేషకులు ఒకప్రముఖ విద్యావేత్త డొరొతీ హెచ్ కొహెన్ ఏమన్నారంటే 'ఏపాఠశాల కూడా ఉపాధ్యాయుల, తలిదండ్రుల మధ్య సత్సంబంధాలు బలపరచకపోతే పిల్లల ప్రగతికి సరైన వ్యూహాలు రచించలేరు,విద్యార్థి అభిరుచులకు అనుగుణంగా అవకాశాలు ఏర్పరచలేరు' అని వక్కాణించారు. తలిదండ్రులే పిల్లలకు తొలి గురువులుగా పిల్లలను చదువు లేదా ఇతర అభివృద్ధి పథంవైపు ప్రభావితం చేసే ఒక దిక్సుచిగా చెప్పవచ్చు. చాలా సందర్భాల్లో తలిదండ్రులు బాలలకు ఒక రోల్ మోడల్‌గా నిలబడడమే కాకుండా బాలల ప్రవర్తనా నియమావళిలో, ఉత్సుకతను అందించడంలో, మంచి చెడుల బేరీజులో, జీవననైపుణ్యాల పరికల్పనలో,సామాజికభావోద్వేగ వికాసాన్ని అందించడంలో తలిదండ్రులు ప్రధాన భూమిక వహిస్తారనడంలో ఎంత మాత్రం సందేహంలేదు.పిల్లలు తమ గురించి తాము అర్థం చేసుకోవడం, తమ భావాలను మంచి భావాలను అలవరచుకోవడం, ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. దీనికి తోడు ఆత్మవిశ్వాసం,సామాజికస్పృహ బాధ్యతా యుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో తల్లిదండ్రులు తమకర్తవ్యాన్ని నిర్వహించడం అనివార్యమనిఅనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మ, నాన్న ఇరువురూ ఉద్యోగ, ఉపాధి బాటలో, కొన్ని కుటుంబాలు తమ జీవనపోరాటంలో మునిగితేలుతూ తమ పిల్లల ఆలనా,పాలనా అజమాయిషీలో కొంచెం సమయాభావం, కొన్నిసార్లు ఏమరుపాటుగా వుంటున్నారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావం, ఉమ్మడి కుటుంబాలకు దూరం, పట్టణ సంస్కృతీ, పొరుగువారితో పోలిక, సంపాదనపట్లే ఎక్కువ మక్కువ, సమయపాలనలేని ప్రయాసలు, ప్రయత్నాలు, పిల్లల బాగోగులను పర్యవేక్షి ంచే సమయం దొరకక ఒక యాంత్రిక జీవితంలో తమ కన్నపిల్లల్ని తామే నిర్లక్ష్యం చేస్తున్న తరుణమిది. ఇదే కొనసాగితే పిల్లలు ప్రగతివైపు పయనించకుండా తీవ్రమైన మానసిక సంక్షోభంతో సరైన మార్గదర్శకత్వం లేక తొలుత తప్పటడుగులు అనిపించినా క్రమేణా చేతికందని చెడుస్నేహాలు, చెడు అలవాట్లకు, ప్రతి విషయంలోనూ విపరీతధోరణి, చదువుపట్ల నిర్లక్ష్యం, ఆలా కాదని వారిస్తే తల్లిదండ్రులపై కోపం, తాను స్వతంత్రుణ్ణి కాదనే ఆలోచన, తనను నిబంధనలతో నియంత్రిస్తున్నారే ఆరోపణలు, ఇలా పిల్లలు పెడదారిలో నడుస్తున్న ఉదాహరణలెన్నోన్నో.ఈపరిస్థితి రాకుండా బాల్యం నుండి పిల్లలను సరైనపంథాలో నడిపించడానికి తలిదండ్రులే బాధ్యతగాతమ సమయాన్ని కేటాయించడమే కాకుండా వారిని మంచి వైపు నడిపించడానికి, ప్రధాన బాధ్యత వహించాలి. కొత్త విషయాల అవగాహన కల్పించడానికి,జీవననైపుణ్యాల,కుటుంబ విలువలను బోధించడానికి,తమపిల్లలు తనకుతానే తనలక్ష్యాన్ని నిర్దేశించుకొనేలా తీర్చిదిద్దడానికి,చదువులో,సంరక్షణలో,



భవిష్యత్తుకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంతం. అంతేకాక,ముఖ్యంగా పాఠశాలలో చేరాక తన పిల్లల ప్రగతి, అంచనా, కావలసిన తోడ్పాటు వంటి విషయాలను ఉపాధ్యాయులకు కూడా విడమరచి నచ్చచెప్పే నైపుణ్యం, నేర్పరితనం చొరవ తల్లిదండ్రులకే ఉంటుంది. అందుకే ప్రతివిద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలతో తరచూ సత్సంబంధాలు కలిగి ఉండాలని, తరచూ తమ పిల్లల గురించి చర్చించాలని, తన అభిప్రాయాలను సూటిగా చెప్పి చదువులో, ప్రవర్తనలో ఏమైనా ఒడిదుడుకులు ఉంటే అప్పటికప్పుడే సరిచెయ్యాలని ఎందరో మేధావులు హెచ్చరిస్తున్నారు. బాలలు ఏవర్గమైనా, పేద,ధనిక లేదా ఏనేపథ్యంలో ఉన్నావారిని ప్రోత్సహించే లేదా తీర్చిదిద్దే తీరులోనే వారి భవిత ముడిపడి ఉంటుంది. పిల్లల బాగోగుల దర్యాప్తు లేదా చదువు పర్యవేక్షణ తనపిల్లలతో ఇంటిదగ్గర తల్లిదండ్రులు చర్చించడం సంప్రదించడమే కాకుండా మరొక చురుకైన చొరవకూడా తీసుకోవాలి. సమయం తీసుకొని తమ పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు, చదువుల సారాంశాలు కూడా పర్యవేక్షి ంచాలి. తరచూ పాఠశాల ఉపాధ్యాయు లను, క్లాస్ టీచర్ని కూడా కలసి తమబిడ్డల ప్రగతి గురించి దర్యాప్తు చెయ్యాలి. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా, చదువు కున్నవారైనా ఉపాధ్యాయులను కలవడంవలన పిల్లల చదు వుపట్ల తల్లిదండ్రులకున్న శ్రద్ధ, ఆసక్తిస్పష్టంగా కనిస్పిస్తుం ది. పాఠశాల యాజమాన్యం పిలిచినప్పుడే కాకుండా తల్లి దండ్రులు కనీసం నెలకు ఒక్కసారైనా వెళ్లి పిల్లల గురించి తెలుసుకోవాలి. మార్కులొక్కటేకాదు ఉపాధ్యాయులతో ఎలా మెలుగుతున్నారు, తరగతిగదిలో ఎలా వ్యవహరిస్తున్నారు, పాఠం చెప్పేటప్పుడు శ్రద్ధ ఎలా ఉంది,ఎపుడైనా సందేహ నివృత్తికై ప్రశ్నిస్తాడా లేక నిశబ్దంగానే కూర్చుంటున్నాడా, మిత్రులతో ఎలామెలుగుతున్నాడు, ఉపాధ్యాయులపట్ల, పెద్దలపట్ల గౌరవభావాలూ ఎలా ఉన్నాయి?అనే విషయాలు క్షుణంగా అడిగి తెలుసుకోవాలి. దీనితోబాటు ఆటపాటల్లో ఉత్సహం, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారా, లేకసిగ్గు బిడియంతో ఉంటున్నారా అనే విషయాలను గమనించాలి. ఈప్రక్రియ వలన తమపిల్లల ప్రగతి లేదా వెనుకబాటు తనాన్ని అంచనా వేయడమేకాదు ఆయా అంశాలలో ఉపాధ్యాయులతో భాగస్వామ్యమై తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ఉపాధ్యాయుల సలహాలను పాటించి ఇంటి దగ్గర కుడా పర్యవేక్షి ంచడానికి వీలు కలుగుతుంది. బాలల భవిష్యత్తు, అభివృద్ధి తరగతిగదిలోనే నిర్మించబడు తుంది గనుక దానికి సంబంధించిన వ్యూహాలను రచించడం లో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు ఎప్పటిక ప్పుడు చర్చిస్తూనే ఉండాలి. పేరెంట్ సమావేశాల పేరిట తల్లిదండ్రులతో నామమాత్రపు సమావేశాలే కాకుండా పిల్లల ప్రగతి, విద్యార్థి ఏదేని రంగంలో వెనుకబడి ఉంటే ఆ విష యాలను తల్లిదండ్రులతో కూడా చర్చించి ఆవిద్యార్థినేపథ్యా లను పరిగణనలోనికి తీసుకొని అనువైన వ్యూహాలను నిర్మించాలి. ఈప్రక్రియ ద్వారా విద్యార్థికి ఒక మానసిక సంబంధమైన పరిపుష్టి లభిస్తుంది. తద్వారా ఎదురైన లోపాలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతాడు. అంతేగాక అభ్యసనలో లేదా తరగతి గదిలో ఉత్సహంగా పాల్గొనని విద్యార్థి నిర్లక్ష్యానికి గురైతే అది సమ్మిళిత విద్యా సూత్రానికే వ్యతిరేకం. అందుకే పాఠశాల యాజమాన్యాలు కూడా ఈ

# ప్రజావాక్కు



### విద్యాబోర్డులు ఏర్పాటు చేయాలి

దేశంలోపాఠశాలవిద్యకు సంబంధించి 65విద్యా బోర్డులు వేర్వేరుపాఠ్యప్రణాళికలు,మూల్యాంకన పద్ధతులు, గుర్తింపు ప్రమాణాలు,పర్యవేక్షణ వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. విద్యలో వైవిధ్యం సహజమే. దేశవ్యాప్తంగా ఉన్న త విద్య, పోటీపరీక్షలు, ఉద్యోగ అవకాశాల్లో విద్యార్థులు ఒకే వేదికపై పోటీపడుతున్నప్పుడు పాఠశాల స్థాయిలోనే వేర్వేరు ప్రమాణాలుండటం విద్యార్థులకు సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తుంది. ఈనేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన ఏకీకృత జాతీయ నియంత్రణ వ్యవస్థను సీరియస్‌గా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏ బోర్డుకు అనుబంధంగా పాఠశాల కొనసాగుతోందన్న దానితో సంబంధం లేకుండా, ఉపాధ్యాయుల అర్హతలు, బోధనా నాణ్యత, మూల్యాంకన ప్రమాణాలు, విద్యార్థుల భద్రత, కనీస మౌలిక వసతుల విషయంలో దేశవ్యాప్తంగా ఒకే స్థాయి ప్రమాణాలు ఉండాలి.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆహార కల్తీలను అంతం చేయాలి

మన నిత్యజీవితంలో వాడే అనేక ఆహార పదార్థాలు కల్తీకి గురవుతున్నాయి. మార్కెట్లో ఎక్కువగా కల్తీ జరిగే ముఖ్య వస్తువులనేకం. సింథటిక్ పాలు, ఎండిన బొప్పాయి గింజలు కలిపిన మిరియాలు, చౌకరకం మినరల్ ఆయిల్స్ లాంటివి కలిపిన నూనెలు, వనస్పతి (డాల్డా), జంతువుల కొవ్వు, బంగాళాదుంప గుజ్జు కలిపిన నెయ్యి, వెన్నబెల్లం పాకం,చక్కెర పాకం,కార్న్ సిరప్‌లు కలిపిన తేనె,పండ్లుత్వరగా పండడానికి కార్బైడ్,ఒకటా? రెండా? ఆర్థిక లాభాల కోసం ఆహారంలో నాణ్యతలేని, హానికరమైన లేదా పనికిరాని పై పదార్థాలను కలపడం వల్ల ఆహారం సహజగుణం కోల్పోయి,ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ప్రజల అవసరాలు తీర్చండి

మోరాకో వలసలకు ప్రధాన కారణం అక్కడి అభివృద్ధి నమూనాలోఉన్నది.అక్కడి యువత ఉచితఆరోగ్యంఉచిత విద్య గురించి అడుగుతుంటే అక్కడి ప్రభుత్వం 2030 లో ఫుట్‌బాల్ ప్రపంచకప్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు,స్టేడియంలు నిర్మిస్తున్నది. ప్రజల మౌలిక సదుపాయాలు పట్టించుకోకుండా హంగు ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వబట్టే ఇలాంటి దుస్థితి దాపురించింది.

- భారత అవినాష్, జనగామ

### గురువులకు విద్యార్థుల శిక్షలా?

నల్లగొండ జిల్లా కొండపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపరెడ్డిని పదవతరగతి చదివే, గంజాయిసేవించే విద్యార్థులు 27కత్తిపోట్లతో చంపడం విద్యవ్యవస్థకే తలవంపు తెస్తుంది. తల్లిదండ్రుల క్రమశిక్షణలేని విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యాబుద్ధులు చెప్పే దైవ సమానులైన గురువులను హత్య చేయడం. హింసించడం చాలా బాధాకరం. రాష్ట్రంలో ఇలాంటి విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులు, విద్యార్థులు, కౌన్సిలింగ్ నిర్వహించవలసిన అవసరం ఉంది. నేటికీ కొన్ని గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు, గంజాయి సేవించడం, సిగరెట్ స్మోకింగ్ చేయడం, ఫెరివల్ పార్టీ, బర్త్‌డే, పార్టీలపేరుతో మత్తుమందు పార్టీలు చేసుకుంటున్నారు.క్రమశిక్షణతో ఉండాలని మంచిగా చదవాలని చెప్పే గురువుల పైదాడులు దౌర్జన్యాలుచేస్తున్నారు. గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గంజాయి, స్మోకింగ్, గుట్కాలు తినడం.సిగరెట్ తాగడం వంటి చెడు అలవాటు ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### ప్రయాణికుల గోడు వినండి

మంగళగిరి బస్టాండులోకి ఎంప్లాయీస్ సచివాలయం అని కొన్ని బస్సులు వస్తున్నాయి. ఎక్కబోతే ఓన్లీ ఫర్ ఎంప్లాయీస్ అని ఎక్కనియ్యలేదు.డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే సిఆర్‌డిఏ బస్సు ఎక్కించారు. మందడం వరకు టికెట్ తీసుకున్న. మంగళగిరి నుండి హైకోర్టు, సచివాలయానికి 13 బస్సులు ఉన్నాయట.అన్నికూడా ఓన్లీ ఫర్‌ఎంప్లాయీస్ ఆట. ఇదేమిటి? ఎంప్లాయీస్‌కు బస్సులెమిటీ ? దానిలో ప్రయాణికులను ఎక్కనియ్యక పోవటం ఏమిటి?అయ్యా ఆర్టీసీ చైర్మన్ గారూ ఎంప్లాయీస్‌కు లక్షలు లక్షలు జీతాలు ఇస్తున్నారు. ఎంప్లాయీస్ వారి ఏర్పాట్లు వారు చూసుకోవాలి. సరే ఆ పేరుతో ఉన్నవాటీలో ప్రయాణికులను కూడాఎక్కించుకోవాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### గడువు తేదీని చూసి తీసుకోవాలి

మనం రోజువారి కార్యక్రమాలు చేసే పనిలో పడి మనం ఏం తింటున్నామో ఏం కొంటున్నామో తెలియకుండా రోజు గడిచి పోతుంది. మనం కొంటున్న తినుబండారాలు, ఇంట్లో వాడుకునే నిత్యావసరాల సరుకులు కొన్ని దుకాణాలలో నిరంతరం నిల్వ ఉండి ఎవరు కొనకపోవడంతో ఆ నిత్యావసరాల సరుకులు వాడుకునే తేదీ గడువు ముగిసే సమయం లేదా ముగిసిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సమ్మెలోనూ సేవాభావం

## జూనియర్ వైద్యుల రక్తదానం

జూనియర్ వైద్యుల సమ్మె 11వ రోజుకు..

రక్తదానంతో మానవత్వం చాటిన జూనియర్ వైద్యులు..

డిమాండ్ల సాధనకు జూడాల పోరుబాట..

సమ్మె కొనసాగుతూనే.. సేవా స్ఫూర్తి చాటిన జూడాలు..

**గుంటూరు మెడికల్,ఆగస్టు 20:(ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 11వ రోజుకు చేరుకుంది. మూడో దశలో నాలుగో రోజైన గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ వైద్యులు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు.



ఇంటర్న్ వైద్యులు, పీజీ వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా సుమారు 125 మంది ఇంటర్న్, రెసిడెంట్ వైద్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజారోగ్యం, సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. మరో 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. భారత వైద్యుల సంఘం యువ వైద్యుల విభాగం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ ఆరే నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ వైద్యులకు, వారి డిమాండ్లకు సంఘీభావం తెలిపారు. గుంటూరు వైద్యుల సంఘం ప్రతినిధులు కూడా నిరసన ప్రదేశాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్, ఆర్థోపెడిక్స్ విభాగం ఆచార్యుడు, అధిపతి డాక్టర్ పి. అనిల్ బాబు, కోశాధికారి డాక్టర్ కవిత, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ శివ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్లకు వినతిపత్రాలు..**

మధ్యాహ్నం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన జూనియర్ వైద్యుల సంఘాల ప్రతినిధులు తమ తమ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని కోరారు. అర్థవంతమైన చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపి, పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

**పాటలతో నిరసన..**

అనంతరం జూనియర్ వైద్యులు తమ ఇంటర్న్‌షిప్, పీజీ శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందులు, సమస్యలను ప్రతిబింబించే పాటలను ఆలపించారు. పాటల ద్వారా తమ ఆవేదనను, నిరసనను శాంతియుతంగా, సృజనాత్మకంగా వ్యక్తం చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కొనసాగిస్తామని జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చల ద్వారా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించాలని వారు ఆకాంక్షించారు.

## నగరంలో చెరువుల అభివృద్ధి పై దృష్టి సారించాలి

-నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** నగర పాలక సంస్థ పరిధిలోని నల్లపాడు చెరువు, యన్.టి.ఆర్ మానస సరోవరంలోని చెరువుల అభివృద్ధి చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటిలో ముందుగా నల్లపాడు చెరువు, యన్.టి.ఆర్ మానస సరోవరంలోని చెరువుల అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నామని, చెరువుల



చెరువుల అభివృద్ధికి సంబంధించిన ప్రపోజల్స్ ను వారం లోగా సిద్దం చేసి ప్రభుత్వ అనుమతికి పంపాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఏపియుఐఎయంయల్ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (ఏపియుఐఎయంయల్) ప్రతినిధులతో నల్లపాడు చెరువు, యన్.టి.ఆర్ మానస సరోవరంలోని చెరువుల అభివృద్ధికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత నల్లపాడు చెరువు, యన్.టి.ఆర్ మానస సరోవరంలను అభివృద్ధి చేయుటకు ఏపియుఐ ఎయంయల్ ప్రతినిధులు తయారు చేసిన డి.పి.ఆర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువులను అభివృద్ధి అభివృద్ధిలో వాకింగ్ ట్రాక్, గ్రీనరి ముఖ్యంగా చెరువు చుట్టూ రైలింగ్ వంటివి తప్పనిసరిగా ఉండాలని ఏపియుఐఎయంయల్ ప్రతినిధులను ఆదేశించారు.

చెరువులను స్థానికంగా ఉండే ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా అభివృద్ధి చేయాలని, వీటి అభివృద్ధికి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్దం చేసి, ప్రభుత్వ అనుమతికి పంపించాలని ఏపియుఐ ఎయంయల్ పతినిధులను జియంసి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, సెంట్రల్ డివైడర్లలో అవేన్యు ప్లాంటేషన్ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలియచేశారు. ఈ సమావేశంలో ఏపియుఐఎయం యల్ ప్రతినిధులు ఆంజనేయులు, బేబి, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తదితరలు పాల్గొన్నారు.

ప్రభాత వార్త

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**

గుంటూరు కలెక్టరేట్,గుంటూరు రూరల్,గుంటూరు వ్యవసాయం,పత్తిపాడు, పెదనందిపాడు,తాడికొండ, దుగ్గిరాల,మంగళగిరి రూరల్, తాడేపల్లి రూరల్, భట్టిప్రోలు,చుండూరు, చేబ్రోలు, దాచేపల్లి, ఈపూరు,

గుంటూరు యూనిట్ కార్యాలయంలో 25-8-2026న జరిగే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' యూనిట్ కార్యాలయము

NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు.

ఫోన్ :8978645935

# జూడాలతో ఆరోగ్య మంత్రి చర్చలు

రెండు డిమాండ్లపై సానుకూల స్పందన..

స్టైఫండ్ పెంపుపై ఆర్థిక శాఖతో చర్చిస్తామని హామీ..

మరో రెండు రోజుల్లో మరోసారి చర్చలకు పిలుస్తామని వెల్లడి..

నేడు విజయవాడలో జూడాల విలేకరుల సమావేశం..

**గుంటూరు మెడికల్,ఆగస్టు 20,(ప్రభాతవార్త) ::** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యుల ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి గురువారం చర్చలు జరిపారు. జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భార్గవ్ సాయి, డాక్టర్ రచన తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. జూనియర్ వైద్యులు ప్రధానంగా ప్రస్తావించిన మూడు డిమాండ్లపై చర్చించిన మంత్రి.. రెండు అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.జూనియర్ వైద్యులు కోరుతున్న స్టైఫండ్‌ను 20 శాతం పెంచాలన్న డిమాండ్‌పై మంత్రి స్పందిస్తూ.. ఈ అంశాన్ని ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. అయితే 20 శాతం పెంపు అమలు చేయడం కష్టసాధ్యమయ్యే అవకాశం ఉందని కూడా మంత్రి పేర్కొన్నట్లు జూడా ప్రతినిధులు వెల్లడించారు.





మిగిలిన రెండు డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్య పూర్తిచేసిన అర్హులైన వైద్యులు అందుబాటులో ఉండగా, వైద్యేతర విద్యార్హతలైన ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేసిన వారిని అధ్యాపకులుగా నియమించకూడదన్న డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.

అదేవిధంగా వైద్యుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచకూడదన్న డిమాండ్‌పైనా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.

**మరోసారి చర్చలకు పిలుపు...**

తమ డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు రెండు రోజుల్లో జూనియర్ వైద్యులను పిలుస్తామని ఆరోగ్యశాఖ మంత్రి తెలిపినట్లు జూడా వెల్లడించింది. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని జూనియర్ వైద్యులు వ్యక్తం చేశారు.

**నేడు విజయవాడలో జూడాల విలేకరుల సమావేశం**

మంత్రి చర్చల వివరాలను వెల్లడించేందుకు జూనియర్ వైద్యుల సంఘం శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో విలేకరుల సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల వివరాలు, మూడు డిమాండ్లపై వచ్చిన స్పందన, తదుపరి కార్యాచరణను జూడా ప్రతినిధులు వెల్లడించనున్నారు. సమ్మె కొనసాగింపుపై కూడా విలేకరుల సమావేశంలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

## పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



గుంటూరు విద్య ఆగస్టు 20 ప్రభాతవార్త : గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను, ఎఫ్ ఏ వన్ పరీక్ష రాసిన తీరును పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ తరగతులకు తగ్గ సామర్థ్యాలు కలిగి ఉండాలని, పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుండి యే మంచి మార్కులు సాధించే విధంగా పోటీ తత్వంతో చదవాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొత్తపల్లి సుశీల

నాలుగేళ్లుగా రాష్ట్ర నర్సింగ్ మండలి రిజిస్ట్రార్‌గా సమర్థవంతమైన సేవలు....

కళాశాలను జాతీయస్థాయిలో అగ్రస్థానానికి తీసుకెళ్లడమే లక్ష్యం

**గుంటూరు మెడికల్,ఆగస్టు 20, ప్రభాతవార్త :** గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నర్సింగ్ ప్రొఫెసర్ కె. సుశీల గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమెను బదిలీపై గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆమె విధుల్లో చేరారు.విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్, మిడ్‌వైఫరీ మండలిలో రిజిస్ట్రార్‌గా, నర్సింగ్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. సుశీలను గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. అయితే రిజిస్ట్రార్‌గా ఆమె నిర్వహి స్తున్న బాధ్యతలను తదు పరి ఉత్తర్వులు వెలువడే వరకు పూర్తి అదనపు బాధ్యతగా కొనసాగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



**నాలుగేళ్లుగా సమర్థవంతమైన సేవలు..**

కె. సుశీల గత నాలుగేళ్లుగా రాష్ట్ర నర్సింగ్, మిడ్‌వైఫరీ మండలి రిజిస్ట్రార్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర నర్సింగ్ రంగంలో మంచి గుర్తింపు పొందారు. నర్సింగ్ విద్య, పరిపాలనా వ్యవస్థలో సమర్థవంతంగా పనిచేస్తూ అధికారిగా ప్రత్యేక పేరు సంపాదించారు.

గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఆధ్వర్యంలో కళాశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు మెరుగైన శిక్షణ, ఉత్తమ వసతులు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**జాతీయస్థాయిలో గుర్తింపు సాధిస్తుందని ఆశాభావం**

కె. సుశీలకు పరిపాలనా అనుభవంతో పాటు నర్సింగ్ విద్యారంగంపై ఉన్న అవగాహన కళాశాల అభివృద్ధికి దోహదపడుతుందని నర్సింగ్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఆమె నాయకత్వంలో గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలు, విద్యార్థుల ప్రతిభలో మరింత పురోగతి సాధించి జాతీయస్థాయిలో ఉత్తమ గుర్తింపు పొందుతుందని ఆశిస్తున్నారు.

## ట్రాఫిక్ నియంత్రణ పై సమావేశం

**గుంటూరు క్రైమ్, ఆగస్టు20,ప్రభాతవార్త:** గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం,అనధికార పార్కింగ్‌ను నియంత్రించడం, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టే అంశాలపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గురువారం గుంటూరు ట్రాఫిక్ డిఎస్పి ఆఫీసులో సమన్వయ సమావేశం నిర్వహించారు.

గుంటూరు టౌన్ ట్రాఫిక్ డివిజన్ డీఎస్పీ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ,వెస్ట్ ట్రాఫిక్ సీఐలు,ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొని నగరంలోని ప్రధాన రహదారుల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలు,అనధికార పార్కింగ్‌పై సమీక్షించారు.

ఈ సమీక్ష లో కొన్ని ప్రధాన ప్రాంతాలను గుర్తించారు. అవి 1రింగ్ రోడ్ – ఐటీసీ,డాన్ బాస్కో సమీపంలో, 2.గుజ్జనగుండ్ల, 3. కలెక్టరేట్ రోడ్ – పోలీస్ పెట్రోల్ బంక్, రమేష్ హాస్పిటల్ ఎదురుగా, 4. జీటీ రోడ్ – ఐటీసీ సమీపంలో, చిలకలూరి పేట రోడ్, 6. కుందుల రోడ్ – కమ్మ హాస్టల్ సమీపంలో, 7. పట్టాభిపురం చర్చి, 8. అమరావతి రోడ్ – ఫంక్షన్ హాల్ ఎదురుగా, 9. ఏసీ కాలేజ్ రోడ్, 10. ఆర్టీసీ బస్ స్టాండ్ ఈప్రాంతాల్లో కాలేజీ బస్సులు, గూడ్స్ టెంపోలు, ప్రైవేట్ అంబులెన్సులు, ట్రావెల్ బస్సులు, కార్లు, క్రేన్లు, జేసీబీలు,ఇసుక లోడ్ వాహనాలు తదితర వాహనాలను రహదారులపై అనధికారికంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా అంబులెన్సుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హోటళ్ల ముందు ట్రావెల్ కార్లు,ఇతర వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

**ఒరిజినల్ సర్టిఫికేట్ పోయినవి**

**నేను తోట శ్రీకాంత్, S/O తోట నాగేశ్వరావు,** 9-107/1, **అడిగొప్పల, దుర్గి, పల్నాడు జిల్లా** 522612.**నా SSC ఒరిజినల్ సర్టిఫికేట్ పోయింది.**

**వివరాలు: పేరు:** THOTA SRIKANTH, **హాల్ టికెట్:** 0915105424, **సర్టిఫికేట్ నెం:** PC/15/14216/242318/6, **పాఠశాల:** GSR EM HS B Gardens Guntur, **పాస్: మార్చి2009. ఎవరికైనా దొరికితే 7674810294ను సంప్రదించగలరు. దుర్వినియోగానికి నేను బాధ్యుడిని కాను.**

## బృందావన్ గార్డెన్స్ రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలి

కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 20,ప్రభాతవార్త ) :** బృందావన్ గార్డెన్స్ రోడ్ విస్తరణ పనులు పూర్తి కానున్నందున వెంటనే రోడ్ నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బృందావన్ గార్డెన్స్ రోడ్ విస్తరణ పనులను, పట్టాభిపురం



మెయిన్ రోడ్ లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్నిపరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ పనులు చివరి దశకు వచ్చినందున తక్షణం రోడ్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే కొన్ని పాయింట్స్ లో విద్యుత్ స్థంబాలు షిఫ్ట్ చేయడానికి సిపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. డ్రైన్ నిర్మాణం పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో 2 రోజుల్లో పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు. కల్వర్ట్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పర్యవేక్షణ చేయాలని, ఎమినిటి కార్యదర్శులు, ఏఈ నాణ్యతపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అనంతరం పట్టాభిపురం మెయిన్ రోడ్ లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, బిల్డింగ్ మ్యాప్, సెట్ బ్యాక్, సెల్లార్లను ను తనిఖీ చేసి, నిర్మాణ వ్యర్థాలను రోడ్ల మీద నుండి తొలగించాలన్నారు. అలాగే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేదం అమలులో ఉన్నందున, ఎక్కడైనా గుర్తిస్తే స్వచ్ఛ యాప్ ద్వారా అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ విష్ణు, డిఈఈ వెంకటరమణ, ఏడీహెచ్ శాంతి, ఏసిపీ రెహ్మాన్, ఎస్ఎస్ సోమశేఖర్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సజ్జల రామకృష్ణారెడ్డి పై సంగం డెయిరీ పరువు నష్టం దావా !

-సజ్జలతో పాటు ఎమ్మెల్సీ మాధవరావు, మరో మూడు సంస్థలకు నోటీసులు - సమాధానానికి సెప్టెంబర్ 2కు కేసు వాయిదా

**గుంటూరు లీగల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న సంగం డెయిరీపై తప్పుడు ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగించారంటూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో గుంటూరు మూడవ అదనపు జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. ఓ.ఎస్. నం. 200/2026గా 10 కోట్ల రూపాయలు చెల్లించాలంటూ పరువు నష్టం దావా దాఖలైంది. పాల సేకరణ చేయకుండా టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి సంగం డెయిరీపై ఆరోపణలు చేశారని దావాలో పేర్కొన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చి, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు ఆరోపణలు ప్రచారం చేశారని సంగం డెయిరీ ప్రతినిధి దావాలో వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తున్న సంగం డెయిరీ చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో ఆవు పాలను సేకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఇందిరా టెలివిజన్ లిమిటెడ్ ను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. సంబంధిత సోషల్ మీడియా కంటెంట్‌కు సంబంధించి గూగుల్ ఎల్ఎల్సీ, మెటా ప్లాట్‌ఫామ్స్ ఇంక్. లను సైతం ప్రతివాదులుగా చేర్చారు. సాక్షిటీవీతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో జరిగిన ప్రచారంపై కూడా న్యాయపరమైన చర్యలు కోరారు. కేసును పరిగణలోకి తీసుకున్న గుంటూరు మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ప్రతివాదులకు నోటీసులు పంపాలని ఆదేశిస్తూ, కేసును సెప్టెంబర్ రెండో తేదీకి వాయిదా వేశారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత

**గుంటూరు క్రైమ్,ఆగస్టు20,ప్రభాతవార్త:** చనిపోయిన హోం గార్డు కుటుంబానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ రూ.2,17,260/ చెక్కును అందజేశారు.గురువారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్, చనిపోయినా హోం గార్డు(హెచ్.జి 90) జి సురేష్ బాబు భార్య సరిత కి ఆర్థిక సహాయంగా రూ.2,17,260/ విలువైన చెక్కును ఆమె కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది,హోం గార్డులు ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని తెలిపారు.హెచ్.జి 90 జి సురేష్ బాబు అనారోగ్యం కారణంగా ఫిబ్రవరి9వ తేదీన మరణించారు.పోలీసు శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

హోమ్‌లోన్ సెంటర్ (RACPC), డోర్ నెం.26-1-52, కన్నవారితోట, గుంటూరు-522004, ఫోన్: 0863-2337730

**డిమాండ్ నోటీసు**

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీతల పేరు మరియు చిరునామా: 1. శ్రీమతి వేల్పుల అరుణ కుమారి, భర్త: తాటిపర్తి శరత్ బాబు, ఫ్లాట్ నెం. 401, కీర్తి హోమ్స్-2, 12వ లేన్, బాలాజీ నగర్, అమరావతి రోడ్, వంశీ కృష్ణ రైస్ మిల్ దగ్గర, నగరాలు, గుంటూరు- 522034. 2. శ్రీ తాటిపర్తి శరత్ బాబు, తండ్రి: మస్తానయ్య, ఫ్లాట్ నెం. 401, కీర్తి హోమ్స్-2, 12వ లేన్, బాలాజీ నగర్, అమరావతి రోడ్, వంశీ కృష్ణ రైస్ మిల్ దగ్గర, నగరాలు, గుంటూరు- 522034.

NPA అకౌంట్ నెం: హోమ్ లోన్: 39454280130.

(II) బకాయి మొత్తం: తేది 01.08.2026 నాటికి రూ. 31,08,380/- (అక్షరాల ముప్పై ఒక లక్షల ఎనిమిది వేల మూడు వందల ఎనభై రూపాయలు మాత్రమే). + పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు, మొ॥వితో కలిపి చెల్లించవలెను.

(III) డిమాండ్ నోటీసు: తేది: 01.08.2026 NPA: తేది: 31.07.2026

షెడ్యూలు ఆస్తి వివరములు

శ్రీమతి వేల్పుల అరుణ కుమారి, భర్త: తాటిపర్తి శరత్ బాబు గార్లకు చెందిన ఆస్తి:

గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్-జిల్లా, ఇంతకముందు గోరంట్ల గ్రామ పంచాయితీ, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొరిటెపాడు డి.నెం. 88, విస్తీర్ణం ఎ. 1.82 సెంట్లు, డి.నెం.91, విస్తీర్ణం ఎ. 13.18 సెంట్లు, మొత్తం ఎ. 15.00 సెంట్లులో ఎ. 2.69 సెంట్లు భూమిలో ప్లాట్ నెం. 17, విస్తీర్ణం 300 చ॥గ॥ల స్థలం నందు నిర్మించిన కీర్తి హోమ్స్-2 పేరుతో ఒక అపార్ట్‌మెంట్ కలదు. హద్దులు: (సమీప డోర్ నెం. 11-980). తూర్పు: ప్లాట్ నెం. 16 - 67'6", దక్షిణం: 40 అ॥ల వెడల్పు రోడ్డు - 40'0", పడమర: ప్లాట్ నెం. 18 - 67'6", ఉత్తరం: ప్లాట్ నెం. 12 - 40'0".

ఈ హద్దుల యందు 300 చ॥గ॥లు లేదా 250.85 చ॥మీ॥ల స్థలంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥ల విస్తీర్ణంలో "కీర్తి హోమ్స్-2" అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులో 1050 చ॥అ॥లు (ఉమ్మడి ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా) తో ఫ్లాట్ నెం. 401 కలదు. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా.

ఈ హద్దుల యందు "కీర్తి హోమ్స్-2" అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులో 1050 చ॥అ॥లు (ఉమ్మడి ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా)తో ఫ్లాట్ నెం. 401 కలదు మరియు ఉమ్మడి హక్కులతో సహా ఈజిమెంట్స్ యొక్క హక్కులు మరియు పైన పేర్కొన్న స్థల కేటాయించబడిన స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ స్థలం కలదు.

(రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1883/2020, తేది: 09.07.2020 ప్రకారం)

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాజ్ సెంటర్ బ్రాంచ్(15623), గుంటూరు వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి సకాలంలో చెల్లించకపోవటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారం నిరర్ధక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున / ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 01.08.2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# బీసీల సంక్షేమం,రాజకీయ ప్రతినిత్యం కోసం టిడిపి నిరంతర కృషి

**స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు దే.**





**కారంపూడిఆగస్టు 20 (ప్రభాతవార్త).**"బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తెలుగుదేశం పార్టీ నిరంతర కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ళ సురేష్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలోవిలేకరులతో మాట్లాడుతూ బీసీలకు అండగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆయన అన్నారు. బీసీలకు 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో బీసీలకు రిజర్వేషన్ తగ్గించి రాజకీయంగా గొంతు నొక్కేసారని అన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ తగ్గించిన సమయంలో వైసీపీ కి చెందిన బీసీ నేతలు ఎందుకు నిలదీయలేదని అన్నారు. పార్టీకి అండగా నిలిచి న కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ తగిన న్యాయం జరుగు తుందని అన్నారు. బీసీ సామాజిక వర్గాలు రాజకీ యంగా ఎదగాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, కటికల బాలకృష్ణ, శ్రీను, ప్రభాకర్ తదితరులు ఉన్నారు. బీసీల పక్షపాతి కూటమి ప్రభుత్వమేటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజ య్య" బీసీలకు నిజమైన న్యాయం కూటమీ శ్రీప్రభ్సత్వంతోనే సాధ్యమవు తుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజ య్య అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం బీసీల సంక్షేమం కోసమే శ్రమిస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపాలిటీ, పంచా యతీ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించడం హార్షనీయ ౦మన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నుండి ఇప్పటివ రకు తెలుగుదేశం పార్టీ బీసీలకు సము చిత న్యాయం చేస్తుందని అన్నారు."

# సమాజాన్ని యువతే మార్చాలి



**సత్తెనపల్లి (ఆగస్టు 20, ప్రభాతవార్త):** సమాజంలో మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భూగ్రహం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రముఖ అంతరిక్ష శా...వేత్త, ఇస్రో, నాసాలలో పనిచేసిన చందు సాంబశివరావు అ న్నారు.జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సత్తెనపల్లి పట్టణంలోని ఎస్‌బీజీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చందు సాంబశివరావు మాట్లాడుతూ యువత సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేయాలని సూచించారు.....లు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న సమయంలో పురుషులు వెనుకబడిపోవడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. మహిళలను గౌరవించడంతో పాటు వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణమైన జ్ఞాన సంపదతో దేశానికి సేవలందించిన మహనీయుడని అన్నారు. ఆయన వ్యక్తిత్వాన్ని, క్రమశిక్షణను, జ్ఞానాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా డాక్టర్ విక్రమ్ సారాభాయ్ భారత అంతరిక్ష రంగానికి చేసిన సేవలను వివరించారు.శ్రీహరికోట నుంచే ఉపగ్రహాలను ఎందుకు ప్రయోగిస్తున్నాం, చంద్రయాన్ ప్రయోగాల విధానం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. వేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో భూగోళం, ఖగోళంపై అవగాహన కలిగిన శా.. .వేత్తలు ఉన్నారని గుర్తు చేశారు.భూమిపై జీవరాశి మనుగడలో చంద్రుడి పాత్ర ఎంతో కీలకమని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలిపారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణను నిరక్ష ్యం చేస్తే భవిష్యత్ తరాల మనుగడ తీవ్రంగా ప్రభావితమవుతుందని హెచ్చరించారు.అనంతరం ఎస్‌బీజీ డిగ్రీ కళాశాల విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చందు సాంబశివరావు సమాధానాలు ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.శ్రీ బాబా గురుదేవ్ విద్యాసంస్థల సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎం.వి. సుబ్బారెడ్డి, పుట్టి సాంబ శివరావు, యోగశా...., కెనడా రామిరెడ్డి, పోతుగంటి రామకోటయ్య, కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ దేవరాజ్, సీపీఐ పట్టణ కార్యదర్శి చెన్నకేశవరావు, శ్రీను, ఎ. సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఒప్పిచర్ల విద్యార్థులకు బయోజైమ్ సంస్థ ఉపకార వేతనం



**కారంపూడిఆగస్టు 20 (ప్రభాతవార్త)** మండలంలోని ఒప్పిచర్ల గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విదా ్యర్థులకు 9వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కన బరిచిన పదిమంది విద్యా ర్థులకు బయోస్టార్ ఇం డియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ఉపకార వేతనా న్ని అందజేశారు. ఒక్కో విద్యార్థికి మూడు వేల రూపాయలు చొప్పున 30 వేల రూపాయలను కంపెనీ రీజనల్ మేనేజర్ టీ. వేణుగోపాల్ రెడ్డి అందించినట్లు పాఠ శాల ప్రధానోపాధ్యాయులు విలీనియం బాలశౌరి తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతిలో కూడా ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చి పాఠశాలకు , గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో కంపెనీ డిస్ట్రిబ్యూటర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఎం రామాం జనేయులు, ఎం శ్రీనివాసరావు, షేక్ బాజీ, బుల్లేడి హరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు బయోస్టాడ్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



**దుర్గి, ఆగస్టు 20 (ప్రభాతవార్త)**ప్రతిభావంతులైన గ్రామీ ణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు బయోస్టాడ్ (త్రీ్ుు) కంపెనీ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య అన్నారు . కంపెనీ రీజినల్ మేనేజర్ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీ తయారుచేసే "బయో జెమ్ మందు అమ్మకం ద్వారా వచ్చిన లాభం నుంచి ప్రతి సంవత్సరం ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక కారణాలవల్ల చదువులు ఆపేయకుండా మా కంపెనీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గత 40 సంవత ్సరాలుగా బయోస్టాడ్ కంపెనీ అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ అండగా నిలుస్తోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముటుకూరు గ్రామంలో 10 మంది, అడిగోప్పల గ్రామంలో 10 మంది చొప్పున మొత్తం 20 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి ..3,000/ చొప్పున ఆర్థిక సాయాన్ని (స్కాలర్‌షిప్) అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ పూర్ణ చంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, దొండపాటి చెన్నయ్య, లింగా సాంబశివరావు, స్థానిక గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల.

## పరిసరాల పరిశుభ్రతతోనే రోగనిరోధక సమాజం




**మాచర్ల టౌన్ ఆగష్టు 20 ప్రభాతవార్త:** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రజారోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ, జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమం (విజుతీదీదిశి) ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించారు. పట్టణం లోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ లో ఈ సందర్భంగా దోవ ౦ల ద్వారా వ్యాపించే వ్యాధుల నుండి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ తమ ఇల్లు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందే నీటి నిల్వ ప్రాంతాలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ప్రతీ శుక్రవారం తప్పనిసరిగా ఖ్రైడే డ్రై డేఖి పాటించి, పాత పాత్రలు, టెర్రస్‌లపై ఉన్న నీటిని ఖాళీ చేయాలని పిలుపునిచ్చారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి. "స్వచ్ఛత ఆరోగ్యం భద్రత" లక్ష ్యంతో దోమలు లేని గ్రామం, దోమలు లేని నగరం నిర్మాణానికి ప్రతి పౌరుడు ప్రాధాన్యత ఇవ్వా లని, ఆరోగ్యవ ంతవె ైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మాచర్ల మలేరియా సబ్ యూనిట్ సూపరువైజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ టి.వి.ఎస్. మదన్ మోహన్ పాల్గొని విద్యార్థి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

## ఎమ్మెల్సీగా ఎన్నికైన రమాదేవికి వర్షం వ్యక్తం చేసిన టిడిపి నేతలు




**కారంపూడి ఆగష్టు 20 ప్రభాతవార్త:**'గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ద ల వ యి. రమాదేవి ఎన్నిక కావడం హర్షనీయమని టిడిపి నేతలు అన్నారు. గురువారం కారంపూడి లోని వినుకొండ రోడ్ లో ఉన్న బీసీ కాలనీలో టిడిపి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమ్మెర దుర్గారావు మాట్లాడుతూ తెలుగుదే శం పార్టీ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. బిసి సామాజిక వర్గంలోని వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తు పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గవర్నర్ కోటాలో ఎమె ్మల్సీ గా రమాదేవిని నియమించటం అభినందనీయమని అన్నారు. వడ్డెర సామాజిక వర్గం అభివృ ద్ధికి టిడిపి కట్టుబడి ఉందని అన్నారు. ఇద్దరు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో టిడిపి జిల్లా కోశాధికారి తిరుమల కొండ నరసింహారావు, మాచర్ల చెన్నకేశవ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమ్మెర అనంత రాములు, నరసరావుపేట వడ్డెర సంఘం నాయకులు బండారు అఖిల్ చంద్ర కీర్తి, బత్తుల రాజు, కారంపూడి వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు కొమ్మెర లక్ష ్మయ్య, వల్లెపు బాబు, చంద్రగిరి ఏడుకొండలు, చల్లా శ్రీను, కొమర యేసు రాజు, కొమ్మెర బాలరాజు, కొమర నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రూ.10 వేల చొప్పున జరిమానా

**సత్తెనపల్లి టౌన్ ఆగష్టు 20ప్రభాతవార్త :**

మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ చుక్క శ్రీనివాసరావు, శివరాత్రి శివ కోటేశ్వరరావు, ఎనబల్ల బాల యేసు పట్టుబడ్డారు.పోలీసులు నిందితులను స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గోకనకొండ చిన్న ఎదుట హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి టౌన్ పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.ప్రమాదాలు అరికట్టాలని మద్యం సేవించి వాహనాలు నడప రాదని హెల్మెట్ ప్రతి ఒక్కరూ ధరించాలని ప్రమాదాన్ని అరికట్టాలని పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావుతెలిపారు

## క్రోసూరు మండల ప్రింట్ మీడియా నూతన కమిటీ ఎన్నిక



**క్రోసూరు( ఆగస్టు 20 ప్రభాతవార్త )**క్రోసూరు మండల ప్రింట్ మీడియా నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. ఈ కార్యక్రమంకు వివిధ పాత్రికేయులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా క్రోసూరు మండల ప్రింట్ మీడియా యూనియన్ అధ్యక్షులుగా బత్తుల సీతారామిరెడ్డి ( వినుకొండ వార్త ), ప్రధాన కార్యదర్శిగా అమీర్ జాన్ ( నేటి దిన పత్రిక సూర్య )లను వివిధ పాత్రికేయ "ులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రింట్ మీడియా విలేఖరులు ఎదుర్కొంటున్న పలు సమసలపై చర్చించి సదరు సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశం లో మార్కాపురపు నాగేశ్వరరావు ( పలనాడు జ్యోతి ), జొన్నవరపు విజయ సారధి రెడ్డి ( ప్రజా శక్తీ ), తేనేటి అశోక్ బాబు ( ప్రభాతవార్త ), పోతుగంటి నాగరాజు ( విశాలాంధ్ర ), చిలకా దాసు ( అమరావతి పోస్ట్ ), షేక్ మహబూబ్ సుభాని ( జెట్ న్యూస్ ), షేక్ ఖధీర్ ( పల్నాటి ప్రభ ), కోటేశ్వరరావు ( ప్రజా కాంక్ష ) తదితర విలేఖరులు పాల్గొన్నారు.సదరు నూతన కార్యవర్గాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు ప్రభుత్వ అధికారులు అభినందన శుభాకాంక్షలు తెలియజేసారు.

## దోమ కాటును అరికడదాం..దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం



**క్రోసూరు( ఆగస్టు 20 ప్రభాతవార్త )**గ్రామ చిన్న దే కానీ దోమ కాటు వల్ల మలేరియా, డెంగూ ్య, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి తీవ్రమైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, దోవ ౦ల నియంత్రణ కేవలం ఆరోగ్య శాఖ బాధ్యత కాదుప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు ప్రతి గ్రావ ౦ము మరియు ప్రతి పట్టణం యొక్క బాధ్యతని వైద్యులు రవికుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. గురువారం ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకొని క్రోసూరు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్ర "మంలో వారు మాట్లాడారు దోమల వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. పారేసిన టైర్లు, కొబ్బరి చిప్ప లు, పూల కుండీలు, పాత డబ్బాలు, నీటి తొట్టెలు, ఓపెన్ కంటైనర్లు, నిర్మాణ ప్రదేశాల్లో నిలిచిన నీరు వంటి చిన్న చిన్న నీటి నిల్వలు దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉంటాయన్నారు. ప్రతి శుక్రవారం "డ్రై డే"పాటిం చాలన్నారు. దోమతెరలు ఉపయోగించాలన్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు, లేదా ఇతర అనారోగ్య లక్షణాలు ఉంటే స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మేరీ శ్రీకళ, మాధవి, పీహెచ్ఎన్ సం౦ "ర్ణ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు, హెల్త్ సూపర్వైజర్ శివుడు, లక్షి ్మ కుమారి తదితరు లు పాల్గొన్నారు

## వైభవంగా డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు



**రాజుపాలెం, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** రాజుపా లెం మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమ సుబ్బారావు మాట్లాడుతూ.. ఐదు రోజులపాటు స్వామివారి కల్యాణోత్సవం, పౌరాణిక నాటకాలు, కోలాట ప్రదర్శనలు, స్వామివారి సంకీర్తనలు, అన్నవ ాచార్య సంకీర్తనలు తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారి ఆశీర్వాదంతో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.వార్షికోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం నిత్యారాధన, మంగళాశా సనం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పద్మశ్రీ పురస్కా గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావు ఆధ్వర ్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి మహత్య ంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆయన ప్రవచనాన్ని వినేందుకు రాజుపాలెం మండలంతో పాటు బెల్లంకొండ మండలం, చుట్టుపక్కల గ్రావ ాల నుంచి వేలాది మంది భక్తులు తరలివ చ్చారు.భక్తుల విశేష స్పందనతో ప్రవచన కార్య క్రమం అత్యంత వైభవంగా జరిగింది. వచ్చే ఏడాది ఇంతకంటే పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చేలా స్వామివారి వార్షికోత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు తెలిపారు.

# వర్ల రామయ్యకు శుభాకాంక్షలు



**రాజుపాలెం, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** టీడీపీ సీనియర్ నాయకులు వర్ల రామయ్య ఎమ్మెల్సీగా ఎంపికైన సందర్భంగా రాజుపాలెం మండలంలోని పెద్ద నెమలిపురి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. వర్ల రామయ్య స్వగ్రామం పెద్ద నెమలిపురి కావడంతో గ్రామస్తులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శనగపూల వెంకయ్య, సత్తెనపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు నాగరాజు, చిలక చంటి, కనుమూరు దానియేలు, కందుల జార్జి తదితరులు టీడీపీ జాతీయ కార్యాలయంలో వర్ల రామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వర్ల రామయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా వర్ల రామయ్య ఎంపిక కావడం పట్ల పెద్ద నెమలిపురి గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**రాజుపాలెం, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ మాట్లాడుతూ"దోమకాటు ఆరోగ్యానికి చేటు" అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అన్ని గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వసంతరావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, స్టాఫ్ నర్స్ చందన, ఫార్మసిస్ట్ శివ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాడు సెంటర్‌లో రెండు ఆంబోతుల పోరు



**సత్తెనపల్లి (ఆగస్టు 20, ప్రభాతవార్త):** సత్తెన "పల్లి పట్టణంలోని గార్లపాడు సెంటర్ మార్కెట్ వద్ద రెండు ఆంబోతులు ఒక్కసారిగా పరస్పరం ఘర్షణకు దిగాయి. దాదాపు 35 నిమిషాల పాటు ఆంబోతుల పోరు కొనసా గడంతో స్థానికులు, వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుం ్కొనా ్నరు.ఆంబోతులు రోడ్డుపై పరస్పరం దాడి చేసుక "వడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఘర్షణను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడ గుమిగూడారు. ఆంబోతుల పోరుతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వాటిని అదుపు చేయడం కూడా కష్టంగా మారింది.రోడ్డుపై ఆంబోతులు సంచరించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు



**సత్తెనపల్లి (ఆగస్టు 20, ప్రభాతవార్త):** మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.వి.కె. చైతన్య విద్యార్థులకు సూచించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు.కళాశాలల్లో ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు.విద్యార్థులు మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు తమ చుట్టూ ఉన్న వారిని కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరచాలని డీఎస్పీ సూచించారు.కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం. హైమారావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి దాతల చేయూత



**యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త :** చిరంజీవి చాగంటి దీప్తి జన్మదినోత్సవాన్ని పురస్క రించుకుని ఉన్నవ గ్రామానికి చెందిన చాగంటి అశోక్, శ్రీమతి త్రివేణి దంపతులు ఎంపీపీఎస్ మెయిన్ ఉన్నవ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి రూ.22 వేల విలువైన ప్రింటర్‌ను విరాళంగా గురువారం అందజేశారు. పాఠశాల విద్యార్థుల అవసరాలతో పాటు విద్యా సంబంధిత పత్రాల ముద్రణకు ఈ ప్రింటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ శారద తెలిపా రు. ఈ సందర్భంగా పాఠశాల తరఫున చాగంటి అశోక్, శ్రీమతి త్రివేణి దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు దీప్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

## వంకాయలపాడులో అక్రమ పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**యడ్లపాడు, అగస్టు 20, ప్రభాతవార్త :** యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వంకాయలపాడు గ్రామ శివారులో అక్రమంగా కోతముక్క (పేకాట) నిర్వహిస్తున్నారనే సమా చారంతో పోలీసులు దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న 7 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుంచి రూ.41,700 నగదు, 7 మొబైల్ ఫోన్లు, 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ పేకాట, జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై టి శివరామకృష్ణ హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## ప్రశాంతం వాతావరణంలో జీవించాలి

**పిడుగురాళ్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త :**

ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత వాతావ రణంలో జీవించాలని సీఐ వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలచెరువులో నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాలపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, ఘర్షణల జోలికి వెళ్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించాలన్నారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ సోదరబావంతో మెలగాలన్నారు. కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 31 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.


# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

**సత్తెనపల్లి (ఆగస్టు 20, ప్రభాతవార్త):** సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు అధికారులు, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా వీలైనంత ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు బ్యాంకు అధికారులు, న్యాయవాదులకు సూచించారు.సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉన్న సివిల్ తగాదాలు, బ్యాంకు రుణ వివాదాలు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ వివాదాలు తదితర కేసులను ముందుగానే గుర్తించాలని సూచించారు.ఇరువర్గాలతో సమన్వయం చేసుకుని కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. ఇలాంటి కేసులు పరిష్కారమైతే కక్షి దారులకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు.పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే కేసులను గుర్తించి లోక్ అదాలత్‌కు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు అధికారులు, న్యాయవాదులు, న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దౌసిద్దీన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సుజన్‌కుమార్‌తో పాటు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

MN 7 PAGE-GNTvffffff:MN 7 PAGE-GNTv 01/01/2001 10:41 Page 1



# పల్నాడు జిల్లా వార్త



## రోడ్డు ప్రమాదంలో భార్య,భర్త దుర్మరణం





వినుకొండ, ఆగస్ట్20,ప్రభాతవార్త: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని హనుమాన్ నగర్ వద్ద గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను వల్లూరి రవి (58),వల్లూరి సావిత్రి (55) గా పోలీసులు గుర్తించారు. మృతురాలు సావిత్రి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మిద్దె బావి కాలనీలోని కూతురి ఇంటి నుంచి బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న చీఫ్‌విప్ జీ.వీ,ఆయన సతీమణి లీలావతి దంపతులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుల పార్థివదేహాలకు ఘన నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.



## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వాగ్దేవి డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎంపిక



నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త ::ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్.వి. యూనివర్సిటీ స్టేడియం లో ఆగస్టు 11 నుంచి 13 వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2026లో గుంటూరు జిల్లాకు చెందిన వాగ్దేవి డిగ్రీ కాలేజీ విద్యార్థి శీరీ.అల్మాస్ మంచి ప్రతిభ కనబరచి, జూనియర్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన 400 మీటర్ల హర్డిల్స్ (91.4 సెం.మీ.) పోటీలలో ద్వితీయ స్థానాన్ని సాధించి మెరిట్ సర్టిఫికెట్‌నుఅందుకున్నారు. ఈ పోటీలో శీరీ.అల్మాస్ 1:02.5 సెకన్లలో రేసును పూర్తి చేశారు. జాతీయ స్థాయి పోటీలు పాండిచ్చేరి లో సెప్టెంబర్ 14 నుండి 16 వరకు జరుగుతాయి అని ఆ పోటీలలో మంచి ప్రతిభ కనపరచి ఆంధ్రప్రదేశ్ కి ప్రథమస్థానం తీసుకు రావాలని కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు.రాష్ట్ర స్థాయిపోటీల్లో అద్భుతప్రతిభ కనబరిచి గుంటూరు జిల్లాకు పేరు తీసుకురావడం పట్ల శీరీ.అల్మాస్ ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయల్ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షి ంచారు.ఈ సందర్భంగా ద్వితీయ స్థానం సాదించిన విద్యార్దిని కళాశాల చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, కళాశాల డైరెక్టర్స్ ఒగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీ రాజామెర్సీన్ మరియు కృష్ణంరాజు విద్యార్థులందరూ హృదయపూర్వకంగా అభినందించారు.

## పల్నాడు వైద్యుడికి అంతర్జాతీయ గౌరవం

### ఫిబాయు 18 ఆసియా కప్‌కు మెడికల్ కోఆర్డినేటర్‌గా డా. కొల్లి ఈశ్వర్ తేజ



నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త :: పల్నాడు ప్రాంతానికి చెందిన స్పోర్ట్స్ మెడిసిన్ వైద్యుడు డా. కొల్లి ఈశ్వర్ తేజ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించారు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఆసియా కప్-2026కు ఆయన మెడికల్ కోఆర్డినేటర్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఆగస్టు 13 నుంచి 23 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ అంర్జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో 16 దేశాల జట్లు పాల్గొంటున్నాయి. క్రీడాకారుల వైద్య భద్రత, మ్యాచ్‌ల సమయంలో అత్యవసర వైద్య సేవలు, మెడికల్ టీమ్ సమన్వయం తదితర బాధ్యతలను డా. ఈశ్వర్ తేజ పర్యవేక్షిస్తున్నారు.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు బాస్కెట్‌బాల్ జట్లకు టీమ్ డాక్టర్‌గా పలు జాతీయ పోటీల్లో సేవలందించిన ఆయన, ఈ ఏడాది జరిగిన 75వ సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా 65 జట్లు పాల్గొన్న ఈ పోటీలో క్రీడాకారులకు వైద్య సేవలు, అత్యవసర వైద్య నిర్వహణను సమన్వయం చేశారు.అలాగే భారత సీనియర్ బాస్కెట్‌బాల్ జట్టుకు టీమ్ డాక్టర్‌గా నీ.తీతి ఆసియా కప్ క్వాలిఫయర్స్, ఆసియా కప్, వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ వంటి పలు అంతర్జాతీయ పోటీల్లో వైద్య సేవలు అందించారు.శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య కుమారుడైన డా. కొల్లి ఈశ్వర్ తేజకు 16 దేశాలు పాల్గొంటున్న ప్రతిష్ఠాత్మక నీ.తీతి గీ18 ఆసియా కప్‌లో మెడికల్ కోఆర్డినేటర్‌గా అవకాశం లభించడం పల్నాడు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో ఆయన అందిస్తున్న వైద్య సేవలపై స్థానికంగా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

## ధనలక్ష్మి కళాశాల విద్యార్థినికి అంతర్జాతీయ గౌరవం



రొంపిచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త : ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎం.పి.ఎడ్. చదువుతున్న పి. రాజేశ్వరి భారత పారా మిక్స్‌డ్ హాకీ జట్టు కోచ్‌గా ఎంపికై అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం పట్ల కళాశాల చైర్మన్ రామ శేషగిరిరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరిని ఆయన అభినందించారు.ఆగస్టు 20 నుంచి 24 వరకు బెల్జియం, నెదర్లాండ్స్‌లో నిర్వహిస్తున్న పారా హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టుకు కోచ్‌గా రాజేశ్వరి సేవలందించనున్నారు. క్రీడాకారిణిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె కోచ్, అంపైర్‌గా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమని రామ శేషగిరిరావు పేర్కొన్నారు. కళాశాల విద్యార్థిని భారత జట్టుకు కోచ్‌గా ఎంపిక కావడం తమకు గర్వకారణమన్నారు. రాజేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

చిలకలూరిపేట,ఆగస్టు 20,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాదెండ్ల మండలంలోని సాతులూరు, చందవరం గ్రామాల్లో నిర్వహించిన రెండేళ్ల పాలన కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది.



గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వ్యవసాయం తదితర రంగాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది.అదేవిధంగా చిలకలూరిపేట నియోజకవర్గ స్థానిక మాజీ మంత్రి వర్యులు, శాసనసభ్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రభుత్వం దృష్టికి ప్రజల అవసరాలను తీసుకెళ్లి అవసరమైన నిధులు, అభివృద్ధి పనులు మంజూరు అయ్యేలా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఆడక స్వాములు గారు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు గారు, నాదెండ్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ గారు, చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి గారు, కమ్మ శ్రీను గారు, యన్నం వెంకటరామిరెడ్డి గారు, యన్నం చిన్న పుల్లారెడ్డి గారు, మండవ హనుమంతరావు గారు, సైదా గారు, తొరటి షణ్ముఖా గారు, ఒంటిపుల్లి భాను గారు, వెంకటరెడ్డి గారు, చెన్నకేశవులు గారు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఇంటింటికి తెదేపా


నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను



ప్రజలకు వివరించేందుకు నరరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం 16వ వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాంపురంలోని బ్రహ్మంగారి గుడి వద్ద నుంచి ప్రారంభమై ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.సమస్యలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న వారికి సూపర్ సిక్స్ పథకాలను అందించాలని శాతం సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నల్లపాటి రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, క్రాంతికుమార్, షేక్ మాబు, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ1సీ, టిడ్కో గృహాలు మంజూరుకాని లబ్ధిదారుల సమస్యలని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు 20,ప్రభాతవార్త : 22ఏ సమస్య పరిష్కారం ప్రజలకు అత్యంత కీలకమని, అన్నివర్గాల ప్రజలు ఈ సమస్యవల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, కావున ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని, అదేవిధంగా టిడ్కో గృహాలు మంజూరు కాని లబ్ధిదారుల ఇబ్బందుల్ని వెంటనే పరిష్కరించి,..



లక్షలాది కుటుంబాలకు న్యాయంచేయాల్సి న బాధ్యత, ప్రజా ప్రభుత్వంపై ఉందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

గురువారం ఆయన అసెంబ్లీలో జీరో అవర్లో 22ఏ భూముల సమస్య, టిడ్కో గృహాల అంశంపై మాట్లాడారు. ఈ రెండు సమస్యలపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఇవి అగ్రస్థానంలో ఉంటాయని ప్రభుత్వానికి విన్నవించారు. 22ఏ 1సీ సమస్యకు అనుబంధంగా అనేక ప్రజా సమస్యలు ముడి పడి ఉన్నాయి..22 ఏ 1సీ సమస్యతో రాష్ట్రంలో 5 లక్షల మంది ఇబ్బంది పడుతుంటే, చిలకలూరిపేట పట్టణంలో 20వేల మంది సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రత్తిపాటి తెలిపారు. 22ఏ 1సీ సమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనిపై తక్షణమే దేవాదాయ, రెవెన్యూ శాఖలు దృష్టి సారించాలని ప్రత్తిపాటి సూచించారు. రెవెన్యూ సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయని, కానీ భూమి తక్కువ, బాధితులు ఎక్కువ ఉన్న 22ఏ 1సీ సమస్య మాత్రం కొరకరాని కొయ్యగా తయారైందన్నారు. ఈ సమస్యతో ముడిపడి ప్రజలకు అనేక ఆర్థిక, ఇతర సమస్యలు ఉన్నాయని, వాటివల్ల వారు పడుతున్న వేదన మాటల్లో చెప్పలేనిదని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. 2013లో వెలువడిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా, 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం దిశగా కృషి చేసిందన్నారు. కానీ ఇప్పటికీ కొన్ని వివాదాలు అపరిష్కృతంగానే ఉన్నందున కూటమిప్రభుత్వం సమస్య పరిష్కారం దిశగా వెంటనే అడుగులు వేయాలన్నారు. ఇళ్ల మంజూరు కాని టిడ్కోలబ్ధిదారుల సొమ్ము తిరిగివ్వాలి...ఆగస్ట్ వచ్చినా రెండోదశ టిడ్కోఇళ్ల కేటాయింపు పూర్తి కాలేదని, డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు 8 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వీలైనంత త్వరగా టిడ్కో గృహ సముదాయంలో నివాసముండేవారికి అవసరమైన మౌలిక వసతుల్ని వేగంగా పూర్తి చేయాలని ప్రత్తిపాటి కోరారు. పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, దుకాణ సముదాయాలు, శ్మశానాల వంటివి ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అలానే లక్ష రూపాయలు, 50 వేలు చెల్లించిన వారికి ఇళ్లు మంజూరు కాలేదని, వారికి ఇళ్లు ఇవ్వడమో.. లేదా డబ్బులు తిరిగివ్వడమో చేయాలని ప్రత్తిపాటి సూచించారు. చిలకలూరిపేటలో ఇళ్లు మంజూరు కాని వారికి రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, దీని పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ప్రత్తిపాటి సభాముఖంగా విజ్ఞప్తి చేశారు.

## గణపవరంలో రెండు ఇళ్లలో భారీ చోరీ

నాదెండ్ల,ఆగస్టు 20,ప్రభాతవార్త : మండల పరిధిలోని గణపవరం గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తుతెలియని దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గాలి శ్రీనివాసరావు ఈ నెల 14న హైదరాబాద్‌లోని పిల్లల వద్దకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి ఉన్నాయి. అందులోని సుమారు 14 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు గుర్తించారు. అలాగే అదే గ్రామానికి చెందిన సాయిప్రసాద్ ఈ నెల 18న మహానందికి వెళ్లి తిరిగి రాగా, ఆయన ఇంట్లో కూడా దుండగులు చొరబడి బీరువాలోని సుమారు 2.5 కేజీల వెండి, ..60 వేల నగదునుఅపహరించుకు పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వర్లు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

చిలకలూరిపేట,ఆగస్టు 20,ప్రభాతవార్త : చిలకలూరిపేట:భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని చిలకలూరిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా తొలుత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్థానిక నాయకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో సమాచార, సాంకేతిక విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణ భారతానికి స్వయం ప్రతిపత్తి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ముఖ్యమని, సేవా దృక్పథంతో యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ రక్తదాన శిబిరంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు పండ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, పట్టణ కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.




## సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తా : జాయింట్ కలెక్టర్

నూజెండ్ల, ఆగస్టు20,ప్రభాతవార్త: మండలంలోని వువ్వాడ రెవెన్యూ గ్రామాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గురువారం సందర్శించారు. 2023లో నిర్వహించిన రీ సర్వే నందు ఉత్పన్నమైన సమస్యలకు సంబంధించి గ్రామ రైతులు గ్రీవెన్‌లో దరఖాస్తు చేశారు. సదరు విషయమై గ్రామంలోని రైతులను కలిసి



వారిసమస్యల పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా కొండ్రప్రోలు అగ్రహారం గ్రామం సెటిల్మెంట్ కంప్లీట్ అయి ఉన్నందున గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్,మండల సర్వేయర్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం



రొంపిచర్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలో ముత్తనపల్లి గ్రామంలో గల సుబాబుల్ తోటలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం అయింది.మృతుని ఒంటిమీద బట్టలు లేకుండా కాలిపోయి పడి ఉంది.సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.మృతుని వయస్సు సుమారు 35నుండి40సంవత్సరముల వయస్సు ఉండవచ్చు అని పోలీసులుతెలిపారు.మృతుని ఎత్తు 5.6అడుగుల ఎత్తు ఉండి,నీలం రంగు ఫార్మల్ ప్యాంట్,నలుపు రంగు మొలతాడు ధరించి ఉన్నారు.కుడి చేతికి ఆరంజ్ రంగు నాలుగు పేటల దారం ఉండి,కుడి చేతికి పసుపు రంగు ఫ్రెండ్షిప్ బ్యాండ్ ఉందని అన్నారు.పైన ఆనవాళ్లు బట్టి మృతుని ఎవరైనా గుర్తించినట్లయితే రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ సెల్ నెం.9440796247, నరసరావుపేట రూరల్ సిఐ సెల్ నెం.9440796225 కు సమాచారం తెలియజేయాలని సంఘటనా స్థలాన్ని సందర్శించిన రూరల్ సీఐ సుబ్బారావు,ఎస్ ఐ లోకేశ్వరరావు తెలిపారు.ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.

## రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో ఎంఏఎం ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

నకరికల్లు, ఆగస్టు 20 ప్రభాతవార్త : అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల్లో ఎంఏఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు రెడ్‌క్రాస్ కంటింజెంట్‌లో పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.కళాశాలకు చెందిన రీ. వెంకట సాయి చంద్, లీ. అఖిల్, శీరీ. మహమూద్ రాజాక్ రెడ్‌క్రాస్ కంటింజెంట్‌లో పాల్గొని రాష్ట్రస్థాయి వేడుకల్లో సేవలందించారు. క్రమశిక్షణ, దేశభక్తి స్ఫూర్తితో కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎమ్.ఆర్ . శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్యలుప్రత్యేకంగాఅభినందించారు. భవిష్యత్తులోనూ దేశ, సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.క ళాశాల ప్రిన్సిపాల్ డా. లీ. ప్రసాదరావు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా భావం, దేశభక్తినిపెంపొందించడంలో ఎన్సీసీ , రెడ్‌క్రాస్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు.విదిది కేర్‌టేకర్ రీ. శాలేమ్ రాజు కూడా విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో జాతీయ, సామాజిక సేవా కార్యమ్రాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో తమ విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## సూపర్ సిక్స్ పథకాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ వర్తింపజేయాలి



నరసరావుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, హోంగార్డులు తదితరులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు.గురువారం శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.40 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంక్షేమ పథకాల ప్రయోజనాలను కోరుతున్నారని తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, హోంగార్డులు తదితరులు పరిమిత వేతనాలతో కుటుంబాలను పోషించేందుకు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు.ఈ వర్గాలకు సాధారణంగా రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే వేతనాలు లభిస్తున్నాయని, ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల విద్య, ఇతర కుటుంబ ఖర్చులు భరించడం కష్టంగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఈ ఉద్యోగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు.ఇది ఒక్క నియోజకవర్గానికి సంబంధించిన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు తమ సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొస్తున్నారని అరవిందబాబు చెప్పారు. మానవీయ కోణంలో ఈ అంశాన్ని పరిశీలించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పేర్కొన్నారు.

## కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది

చిలకలూరిపేట,ఆగస్టు 20,ప్రభాతవార్త : చిలకలూరిపేట మండలంలోని కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం గ్రామాల్లో బుధవారం"పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. సరిత గారు పాల్గొని రైతులకు పంటల సాగు, భూసార పరిరక్షణ, ఎరువుల వినియోగం, పంట నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలని సూచించారు. అవసరానికి మించి ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు సాగు పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా సమతుల్యంగా



ఎరువులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పంట పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.అనంతరం గ్రామాల్లోని ప్రత్తి పంట పొలాలను సందర్శించి, పంట పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుత ఉన్న ఎల్ నీనో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటకు తగిన నీటి యాజమాన్యాన్ని పాటిస్తూ, పంట బెట్టకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి 191919 మరియు 13045 వంటి నీటిలో కరిగే ఎరువులను వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనల మేరకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు.ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితి ల లో రసం పీల్చే పురుగు ఉధృతి అధికంగా ఉన్నది కావున రైతులు రసంపీల్చే పురుగునివారణకు చేపట్టవలసిన సస్య రక్షణ చర్యలను వివరించారు.అలాగే రైతులు తాము సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి గారు సూచించారు.కౌలు రైతులు కూడా తమ సాగు వివరాలను అధికారికంగా నమోదు చేసుకుని, తప్పనిసరిగా రెవెన్యూ లేదా వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి కౌలు రైతు కార్డులు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్, ఆర్ఎస్‌కే సహాయకురాలు ఎస్.కె. అయిషా, ఆ గ్రామము లోని రైతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రత్యేకాధికారి మండలంలో సుడిగాలి పర్యటన

**పొన్నూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త:** డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి గురువారం మండంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని అన్నిశాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండలంలోని ప్రతిశాఖాధికారి, సిబ్బంది నిర్ధేశించుకున్నా లక్ష్యాలను చేరాల్సిందేనన్నారు. ప్రభుత్వ ం నిర్ధేశించిన కార్యక్రమాలను నూరుశాతం విజయవంతం అయ్యేవిధంగా అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు.

**గ్రీన్ గుంటూరు-మొక్కల పెంపకం:**

గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా మండలానికి ఆరువేల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్ధేశించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 400మొక్కలు అందుబాటులోకి వచ్చి 250మొక్కలు నాటడం జరిగిందన్నారు. మిగిలిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పంటల బీమా:**

పంటల బీమా నమోదు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించిన సందర్భంలో రైతులందరూ సద్వినియోగం చేసుకునేవిధంగా సంబంధిత శాఖాధికారులు కృషి చేయాలన్నారు. వరిపంట సాగుచేస్తూ పంట రుణాలు పొందిన రైతులు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించేవిధంగా చూడాలన్నారు.



అదేవిధంగా పంట వేసిన ప్రతి రైతు ఈక్రాప్‌బుకింగ్ చేసుకునేలా రైతుల్లో చైతన్యం తేవాలన్నారు.

**విబి-గ్రామ్-జి యాక్టు:**

విబి-గ్రామ్-జి యాక్టు పనుల పురోగతిని మరింత వేగవంతం చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రస్తుతం 11వ స్థానంలో ఉన్నందున, ర్యాంకును మరింత మెరుగుపరిచే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

**ఎస్‌జిఎస్‌డబ్ల్యూ శాఖ:**

ఎస్‌జిఎస్‌డబ్ల్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఈకెవైసీలు, ఎస్‌జిఎస్‌డబ్ల్యూ తనిఖీలు(పిఎంయు) తదితర అంశాలను నిర్ధేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌లేని పిల్లలకు డొమిసైల్ సర్టిఫికెట్లు పొందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవాల కోసం ఆసుపత్రులకు వచ్చే గర్భిణీలకు ఆకెవైసీపై ప్రత్యేక అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈకెవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**మన మిత్ర అవగాహన కార్యక్రమం:**

మన మిత్ర ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, సమాచారం, సేవల వినియోగంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో మన మిత్రపై అవగాహన పెంచడం ద్వారా కార్యక్రమ లక్ష్యాలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.

**ఎఫ్-లైన్ సర్వే:**

ఎఫ్-లైన్ సర్వే పురోగతిని మరింత మెరుగుపరచాలని సూచించారు. సర్వేలకు సంబంధించిన ప్రతికూల స్పందనలు వస్తున్నందున, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ సర్వే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు.

**వైద్య ఆరోగ్యశాఖ - ఐవిఆర్‌ఎస్ అవగాహన:**

మండలంలో నెలకు సుమారు 1,200మంది ఓపిలకు వైద్య సేవలు అందుతున్న నేపథ్యంలో వైద్య సేవలు, మందుల కోసం వచ్చే ప్రతి వ్యక్తికి ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఓపికి ఐవిఆర్‌ఎస్ కాల్స్ యొక్క ఉద్దేశం, వాటికి స్పందించే విధానం గురించి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**పిజిఆర్‌ఎస్ - ప్రతికూల స్పందనలు:**

పిజిఆర్‌ఎస్‌లో మండలస్థాయిలో సుమారు 95శాతం ప్రతికూల స్పందనలు నమోదవుతున్న అంశంపై సమీక్షి జరిగింది. ప్రజల ఫిర్యాదులను సంబంధిత ఉద్యోగులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ, ఫిర్యాదు పూర్తిగా పరిష్కరించబడే వరకు ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పటికీ వారి సంతృప్తి స్థాయిలో లోపం ఉండటం వల్ల ప్రతికూల స్పందనలు వస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

**పంచాయితీరాజ్‌శాఖ:**

పంచాయితీరాజ్‌శాఖలో ప్రస్తుతం 18శాతం ప్రతికూల స్పందనలు నమోదవుతున్నాయి. ఈ శాతాన్ని మరింత తగ్గించి పనితీరును మెరుగుపరచాలని సూచించారు.

**ఆర్‌ఓఆర్ సర్వే, భూరికార్డులు:**

ఆర్‌ఓఆర్ సర్వేలో గత నెలతో పోలిస్తే గణనీయమైన పురోగతి నమోదైందన్నారు. గత నెల 42శాతం ప్రతికూల స్పందనలు ఉండగా, ప్రసుత్తం 22శాతానికి తగ్గాయన్నారు. సర్వే, సెటిల్‌మెంట్, భూరికార్డులకు సంబంధించిన అంశాలను మరింత సమర్ధవంతంగా పరిష్కరించాలని సూచించారు.

**రీ సర్వేకు సంబంధించిన వివరాలు:**

రీ సర్వేలో గత నెల 33శాతం ప్రతికూల స్పందనలు ఉండగా, ఈ నెల 7శాతానికి తగ్గినట్లు చెప్పారు. ఇదే విధమైన పురోగతిని కొనసాగిస్తూ ప్రతికూల స్పందనలను మరింత తగ్గించాలని కోరారు.

**సాంఘిక సంక్షేమ వసతి గృహాలు:**

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ప్రస్తుతం 69మంది విద్యార్థులు ఉన్నందున, విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల విద్య, వసతి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిరోజూ అవగాహన కల్పించాలని సూచించారు.

**డొమిసైల్ సర్టిఫికెట్లు:**

డొమిసైల్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో మండల విద్యాశాఖాధికారి, మండల తహాశీల్దార్ సమన్వయంతో పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి సర్టిఫికెట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మన్నవ రోడ్డు:**

మండల పరిధిలోని మన్నవ రోడ్డు పనికి ఇప్పటికే అనుమతి లభించిందని,టెండర్లు కూడా ఆహ్వానించినప్పటికీ, పనిని చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదన్నారు. ఈ సమస్య సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి, పనిని త్వరగా ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవలని సూచించారు.

సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్, తహాశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెదేపాదే

**-టిడిపి బీసి నాయకుడు దాసరి విజయకుమార్‌గౌడ్**

**పొన్నూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతులకు(బీసీలకు) రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని టిడిపి బీసి నాయకుడు దాసరి విజయకుమార్ గౌడ్ అన్నారు. బీసీలకు సముచిత స్థానం, ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత నాడు స్వర్గీయ ఎన్టీఆర్ అయితే నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కూడా బీసీలను అక్కున చేర్చుకుంటున్న ఘనత టిడిపికే చెల్లుతుందన్నారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి టిడిపి ఎప్పుడూ కట్టుబడి పనిచేస్తుందన్నారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించి, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు టిడిపి తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయాల్లో వారికి మరింత భాగస్వామ్యం దక్కుతుందన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం టిడిపి ప్రభుత్వం నిరంతరం పనిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉండి, తమ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడుకోవాలని విజయకుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.



## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**-తహాశీల్దార్ సిద్ధార్ధ**

**కొల్లిపర,అగష్టు 20 ప్రభాతవార్త:** బిఎల్‌ఓలకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించటం జరిగిందని తహాశీల్ధార్ సిద్ధార్ధ స్పష్టం చేసారు.గురువారం మండల పరిధిలోని మున్నంగి పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల మ్యాపింగ్



ప్రక్రియను ఆయన తనిఖీ చేసి బిఎల్‌ఓలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సిద్ధార్ధ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించటమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు.మండలంలో మ్యాపింగ్ కాని ఓట్లు 73 పేర్లు ఉన్నాయని చెబుతూ తేడా ఉన్న ఓట్లు 267 ఉన్నాయని వాటిన్నటికీ ఇప్పటికే నోటీసులు జారీ చేయటం జరిగిందన్నారు.ఓటర్లు తగిన ఆధారాలు తీసుకువస్తే మరలా వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు.తనిఖీలో ఎంపిడీవో విజయలక్ష్మీ,డిప్యూటి ఎంపిడీఓలు భార్గవ్,దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

**-నియోజకవర్గ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి**

**పొన్నూరు, ఆగస్టు 20,ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్క రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని



డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వి.విజలక్ష్మి కోరారు. మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరి వెదసాగు చేయడం జరిగిందన్నారు. వరి వెదసాగు చేసిన రైతులు పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించాలన్నారు. తద్వారా నష్టం జరిగితే బీమా వర్తింపు వల్ల రైతుకు కొంత ఊరట చెందే అవకాశం ఉంటుందన్నారు. వరి పంట ఎకరాకు రూ.800చెల్లించి రూ.40వేలు బీమా వర్తిస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతు ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో డిఎపి, యూరియాను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రైతుకు నిబంధనల మేరకు ఎరువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ఇప్పటి వరకు చేసుకోనటువంటి రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్ళి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, విఏఏ మాణిక్యరావు, రైతులు పాల్గొన్నారు.

## పేదలను నిర్మూలించటమే జీరో ప్రావర్టి మిషన్ ముఖ్యఉద్దేశం

**-ఏపిఎం రమాదేవి**

**కొల్లిపర,అగష్టు 20 ప్రభాతవార్త:** పేదవారిని నిర్మూలించటమే జీరో ప్రావర్టి మిషన్ ముఖ్యఉద్దేశమని ఏపిఎం రమాదేవి అన్నారు.గురువారం మండల కేంద్రం కొల్లిపర స్రీశక్తి భవనంలో గ్రామ సంఘం వివోఏలకు..ఓబి సభ్యులకు జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.సీసీ విజయకుమార్ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చేయూత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కొల్లిపర మండలాన్ని జిల్లాలో జీరో ప్రావర్టి మిషన్‌గా ఎంపిక చేసినట్లు స్పష్టం చేసారు.నిరుపేద కుటుంబాలకు చేయూత ఇచ్చేందుకు మండలంలో 3020 కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించటం జరిగిందన్నారు.గుర్తించిన పేద కుటుంబాలకు మరలా సచివాలయాల్లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించటం జరుగుతుందన్నారు.చర్చించిన తరువాత మరలా అత్యంత పేదవారిని గుర్తించటం .జరుగుతుందని చెప్పారు.సమావేశంలో సీసీలు బుజ్జిబాబు,ప్రమీలాదేవి,ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధే తెదేపా ప్రధాన లక్ష్యం : ఉయ్యూరు వెంకట శివ

**చెరుకుపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని క్లస్టర్ ఇంచార్జ్ ఉయ్యూరు వెంకట శివ అన్నారు. మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు పూషడుపు కుమారస్వామి సహకారంతో కనగాల ఎస్టీ కాలనీలో గురువారం అంతర్గత రహదారులు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఎస్టీ కాలనీలోని ప్రజలు నివాస ప్రాంతాల నుండి రాకపోకలకు అవరోధంగా ఉండడంతో యుద్ధ ప్రాతిపదికన లారీలతో ఇసక తోలి సౌకర్యాలను మెరుగుపరిచారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పీర్ అహ్మద్, కేసిన గోపి ,పరీశ వెంకట శివయ్య ,జంపాని రవికుమార్, షేక్ కరిముల్ల పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజర్ల ఆట కట్టిస్తాం : తహాశీల్దార్ గోపాలకృష్ణ, సీఐ రాంబాబు

**తెనాలి ఆగస్ట్ 20(ప్రభాతవార్త):** విద్యార్థినిలు,మహిళల భద్రతకు ప్రాముఖ్యతనిస్తూ ఈవ్ టీచర్ల ఆగడాలను ఆట కట్టించటానికి ప్రత్యేక నిఘా పెట్టామని,తెనాలి మండల తహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ,వన్ టౌన్ సిఐ సిహెచ్.రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట దొడ్డపనేని ఇందిర బాలికల పాఠశాల విద్యార్థినుల సూచనల మేరకు తాసిల్దార్ గోపాలకృష్ణ సీఐ రాంబాబు గురువారం ఉదయం పాఠశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులను ఈ టీచింగ్ కు గురించి చేస్తున్న ఆగతాయులను గుర్తించటానికి ప్రత్యేక నిఘా పెట్టి పాఠశాల పరిసర ప్రాంతాల్లో పర్యటించారు.వారి నిఘాలో ఒక వ్యక్తి నీలం రంగు యాక్టీవా ద్విచక్ర వాహనంపై పాఠశాల బాలికలను అనుసరిస్తున్నట్లు గుర్తించగా,పోలీసు సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతను అక్కడి నుంచి పారిపోయాడు.అనంతరం పాఠశాలకు వెళ్లి సుమారు 500 మంది బాలికలకు మహిళలు, బాలికల భద్రత, ఈవ్‌టీజింగ్ మరియు అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తతపై, విధ్యార్థిని లకు అవగాహన కల్పించారు.తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడి, పాఠశాలకు వెళ్లే సమయంలో లేదా తిరిగి వచ్చే సమయంలో ఎవరైనా అనుసరించడం, వేధించడం లేదా అనుమానాస్పదంగా ప్రవర్తించడం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,ఈవ్‌టీజింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని,బాలికలను వేధించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,మీ పిల్లల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తహసిల్దార్ గోపాలకృష్ణ వన్ టౌన్ సిఐ రాంబాబు పేర్కొన్నారు.



## న్యాయవాదిపై దాడి చేసిన కేసులో ఆరుగురు అరెస్టు

**తెనాలి ఆగస్ట్ 20(ప్రభాతవార్త):** తెనాలి మండలం కొలెవరం గ్రామానికి చెందిన న్యాయవాది షేక్ హుస్సేన్ పై దాడికి పాల్పడిన కేసులో తప్పించుకు తిరుగుతున్న మరో ఆరుగురని తెనాలి రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు.ఆగస్ట్ 20 వ తేదీ గురువారం ఉదయం తెనాలి విఎస్ఆర్ కాలేజ్ మెయిన్ గేట్ రోడ్డుమీద ఉదయం 9 గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా ఆగస్ట్ 9వ తేదీ మధ్యాహ్నం కటివరం గ్రామంలోని అడ్వకేట్ ఇంటిపై దాడి చేసిన కేసులో నిందితులుగా నిర్ధారించి, వారందరూ సోమసుందర పాలెం గ్రామం కు చెందిన వారు మరియు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు యొక్క బంధువులు మరియు స్నేహితులు , అడ్వకేట్ పై దాడి చేసిన కేసులో నిందితులుగా నిర్ధారించుకొని ఆరుగురిని అరెస్టు చేసి తెనాలి కోర్టులోని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, మేజిస్ట్రేట్ ఆరుగురికి 14 రోజులు రిమాండ్ విధించగా, ఆరుగురిని గుంటూరు జిల్లా జైలు కి తరలించడమైనదని ఇప్పటివరకు ఈ కేసులో మొత్తం 12 మందిని అరెస్టు చేసి రిమాండ్ కి పంపించడం జరిగిందని తెనాలి గ్రామీణ పోలీసులు తెలిపారు.



## ఇన్ సర్వీస్ టీచర్స్‌కు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి : ఎంఆర్పీఎస్ నేతలు

**తెనాలి ఆగస్ట్ 20(ప్రభాతవార్త):** ఇన్ సర్వీస్ టీచర్స్ కు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్‌టెట్)నుండి మినహాయింపు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నిబంధన సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు.




గురువారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ అధ్యక్షులు చిలువూరు నాగరాజు మాదిగ గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కిన్నర నాగరాజు మాదిగ పాల్గొని సర్వీసులో ఉన్న టీచర్స్ కి టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఇన్ సర్వీస్ టీచర్స్ కి టెట్ తప్పనిసరి నిబంధనను రద్దు చేయాలన్నారు.టెట్ అర్హతను తప్పనిసరి చేయాలన్న కేంద్ర ఉపాధ్యాయ మండలి నిర్ణయాన్ని అమలుచేయక పోవటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తప్పిద్దమని, దానికి ఉపాధ్యాయులని బలిచేయటం ఎంతవరకు సమంజసమని వారు ఆరోపించారు.బిఈడీ డీఈడీ ల ఆధారంగా బోధన అభ్యాసన ప్రక్రియ తరగతి గదుల్లో కాకుండా రాత పరీక్షల ఆధారంగా ఎలా నిర్ణయిస్తారని దీనివల్ల పాఠశాల విద్యను ప్రైవేటుపరం కార్పొరేట్ పరం చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హతను నిర్ణయించడం అన్యాయమన్నారు. బీఈడీ డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉపాధ్యాయునిగా అర్హత సాధించాక,మరల టెట్ పరీక్షల్లో కూడా అర్హత సాధించాలనటం విడ్డూరమని, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు వారి కుటుంబాల సామాజిక భద్రతకు జీవించే హక్కును మనుగడను ప్రభుత్వ విధానాలు హరిస్తున్నాయన్నారు. సాధారణంగా ఇన్ సర్వీస్ ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే డిపార్ట్మెంటల్ ఎగ్జామ్స్ వారి ఉద్యోగ పదోన్నతికి ఉపయోగపడతాయని కానీ టీచర్స్ కు మాత్రం టెట్ పరీక్షల్లో ఫెయిల్ అయితే ఉద్యోగాన్ని కోల్పోతారు అనటం అన్యాయమని ఇప్పటికే దీనిపై వేల మంది ఉపాధ్యాయులు ఆందోళనలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించటం చట్టసభల్లో కనీసం దీనిపై చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటం ప్రభుత్వ బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని, దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పాఠశాలలు మూసివేసి విద్యా హక్కు చట్టాన్ని ఎలా అమలు చేస్తారని,నేతలు సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ అధ్యక్షులు చిలువూరు నాగరాజు మాదిగ, గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ, వేమూరు నియోజకవర్గ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు గొరిగపూడి జగ్గారావు మాదిగ, మోరంపూడి నాగరాజు మాదిగ, పాలపర్తి మదన్మోహన్ మాదిగ, దాసరి అభిషేక్ మాదిగ, కావలి ఏసుబాబు మాదిగ, తాడికొండ విజయ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణతో వ్యాధులకు దూరం

**మున్సిపల్ సహాయ కమిషనర్ జాస్తి రామారావు**

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 20(ప్రభాతవార్త):** దోమలు పెరగకుండా నివారించడం ద్వారా చికెన్ గున్యా, డెంగ్యూ , మలేరియా వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెనాలి మున్సిపల్ సహాయ కమిషనర్ జాస్తి రామారావు అన్నారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గల మలేరియా ఫైలేరియా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఏర్పాటు చేసిన ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ నీ మున్సిపల్ సహాయ కమిషనర్ జాస్తిరామారావు జెండా ఊపి ప్రారంభించారు. మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొని శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ సహాయ కమిషనర్ జాస్తి రామారావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆగస్టు 20వ తేదిని ప్రపంచ దోమల దినోత్సవం గా జరుపుకుంటున్నామని దీనికి కారణం 1897 ఆగస్టు 20వ తేదీన సికింద్రాబాద్ లో సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని కనుగొనడం జరిగిందని ,వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఈ తేదీని ప్రపంచ దోమల దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. దీని యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజలలో దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా డెంగ్యూ చికెన్ గునియా మెదడువాపు వంటి వ్యాధుల పట్ల మరియు వాటి యొక్క వ్యాప్తి పట్ల ప్రజలలో అవగాహన కల్పించి వ్యాధులను నిర్మూలించాలని లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలను మునిసిపల్ శాఖ మరియు మలేరియా శాఖ నిర్వహిస్తున్నట్లు తెలిపారు . పరిశుభ్రతతోనే దోమల ద్వారా మరియు ఇతర వ్యాధులన్నీ దూరమవుతాయని ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమోళి మాట్లాడుతూ,మన దేశంలో జరిగిన అనేక పరిశోధన కారణంగా 1897 ఆగస్టు 20వ తేదీన సర్ రోనాల్డ్ రాస్ ప్రపంచానికి మలేరియా అనే వ్యాధి దోమ కాటు వలన ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తంగా నిర్ధారించడం కారణంగా వారికి 1902 లో నోబుల్ బహుమతి ప్రధానం చేశారని తెలిపారు. ముఖ్యంగా 2027 నాటికి మనదేశంలో మలేరియా జీరో కేసులు తేవాలని 2030 నాటికి భారతదేశంలో మలేరియా రహిత దేశంగా చేయాలని ఉద్దేశంతో ప్రజల అవగాహన కొరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . నందుల పేట వైద్యాధికారిణి నక్కాసుశాన్ గ్రేస్ మాట్లాడుతూ,ఇంటి లోపల ఉండే నీటి నిల్వలలో కూడా పెరుగుతాయని వారానికి ఒకసారి ఫ్రైడే ఫ్రైడే పాటించాలని కోరారు. శివాజీ చౌక్ వద్ద మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమోళి మలేరియా ఫైలేరియా నగర దీపికలు పట్టణ ప్రజలచే ప్రపంచ దోమల దినోత్సవం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహింప చేశారు.ఈ కార్యక్రమంలో గంగానమ్మపేట వైద్యాధికారిని డాక్టర్ చందోలు వెంకట , ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్ధంటి రవికుమార్, సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు బండారు మల్లేశ్వరరావు దాసరి శివ నాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ ప్రసాద్ , మలేరియా ఫైలేరియా సిబ్బందిఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మురుగునీటి పారుదలకు ఆటంకాలు తొలగించండి

**-మున్సిపల్ కమీషనర్.**

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 20(ప్రభాతవార్త):**

మురుగునీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు పట్టణం లోని 28 వ వార్డు



ఆలపాటినగర్,సుందరయ్య నగర్ ప్రాంతాలలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు తో కలిసి పరిశీలించారు. నీటిపారుదలకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను జెసిపి ద్వారా తొలగింపజేశారు. కాలువలలో పూడికను పూర్తిగా తీయించాలని, రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్ల పైన చెత్త వేసిన వారికి కాలువలపై నీటిపారుదలకు ఆటంకంగా ఆక్రమణలు చేసిన వారికి అపరాధ రుసుము విధించారు. కాలువలలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి తడి చెత్త ,పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా చూడాలని అన్నారు.కమీషనర్ వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : అనగాని శివప్రసాద్

**చెరుకుపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. కావూరు గ్రామంలోని డాక్టస్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, తుమ్మల అమరేంద్ర జ్ఞాపకార్థం గురువారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారిచే ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అనగాని శివప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో మమోగ్రఫీ, గర్భాశయం స్కానింగ్, పాప్ స్మియర్, ఊపిరితిత్తులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొడాలి శ్రీనివాసరావు , సుఖవాసి వాసు, చెల్లి జ్యోతి రవికుమార్, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



## టిడ్కో హౌసింగ్ లో కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి!..

**చిలకలూరిపేట,ఆగస్టు 20, ప్రభాతవార్త :** చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించిన నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం. చిలకలూరిపేట పట్టణ టిడ్కో హౌసింగ్ కాలనీలో కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కనీస వసతులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం పాఠశాల, గ్రంధాలయం, వైద్యశాల ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు కి వినతిపత్రం నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం సమర్పించారు.సుమారుగా 4000 మంది పైగా నివాసం ఉండే చోట పోలింగ్ బూత్ లేకపోవడం వల్ల వాళ్ళు ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు ఇబ్బందిగా ఉంటుంది అని వివరించారు.కనీసం ప్రయాణం చేసేందుకు కూడా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదని తెలిపారు.కలెక్టర్, ఎన్నికల కమిషనర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్ళి పరిష్కారం చేయాలన్నారు. నవతరం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన టైగర్ వాక్ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ పరిధిలో సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

21-8Pg5:21-8Pg5.qxd 20/Aug/26 10:40 PM Page 1



# జంతర్‌మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ



## జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు

### ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** నీట్‌యుజి ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో గత నెలలో జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద, దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాలలో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది మితిమీరి, అసమానంగా బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి విచారణ కమిటీని సుప్రీంకోర్టు గురువారం ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రెడ్డితో పాటు, ఈ ప్యానెల్‌లోని ఇతర సభ్యులలో పంజాబ్ - హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, సిబిఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ మాజీ డిజిపి ఎల్ ఆర్ బిష్ణోయ్ ఉన్నారు. పిటిషనర్లు, ప్రతివాదులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, ప్యానెల్ పరిశీలించబోయే అంశాలను నిర్దేశించింది.

**ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ**

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది.

మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది. "ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. హైపవర్ కమిటీచేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా అంచనా వేయవచ్చు.

అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. హైపవర్ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది.



# చెత్త నిర్వహణ బాధ్యత ప్రతి ఒక్కరిది

## కఠిన చర్యలు తీసుకోండి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** చెత్త నిర్వహణ అనేది పారిశుధ్య సిబ్బంది పని మాత్రమే కాదు, చెత్తను ఉత్పత్తి చేసే ప్రతి వ్యక్తి, సంస్థ బాధ్యత అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.పాఠశాలలు, కాలేజీల్లో వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల పాఠ్యాంశాలు, శిక్షణ కార్యక్రమాల్లో సైద్ధాంతిక, ప్రాక్టికల్ విద్యను వెంటనే చేర్చాలని సుప్రీంకోర్టు సూచించింది. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణ పొందిన విద్యార్థులు తమ ఇళ్లలోనే వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్తంగా బల్క్ వేస్ట్ జనరేటర్లను ఆరు వారాల్లో గుర్తించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిబంధనలను పాటించని సంస్థలు, సముదాయాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించడంలో విఫలమైతే అవసరాన్ని బట్టి నీరు లేదా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయవచ్చని ధర్మాసనం పేర్కొంది. నిబంధనలు పాటించినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించిన తర్వాతే ఆయా సదుపాయాలను పునరుద్ధరించాలని సూచించింది. మున్సిపల్ సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సక్రమంగా అమలు చేయాలన్న అంశంపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన అప్పీళ్లను సుప్రీంకోర్టువిచారించింది. మొదట భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన వ్యవహారంగా ప్రారంభమైన ఈకేసు.. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించేలా విస్తరించింది. సమాజంలో 'చెత్తను ఉత్పత్తి చేసే హక్కు ఉంది కానీ దాని ప్రభావాన్ని నియంత్రించేందుకు సహకరించాల్సిన అవసరం లేదు' అనే ధోరణి ఉండటం విచారకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఘన వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు డిజిటల్ విధానాలను విస్తృతంగా ఉపయోగించాలని సుప్రీంకోర్టు సూచించింది. చెత్త పేరుకు పోయిన ప్రాంతాల జియోట్యాగ్‌డ్ ఫొటోలు, ప్రతి నెలా అమలు నివేదికలను ప్రత్యేక పోర్టల్ ద్వారా సమర్పించాలని



# కెన్యాలో హెలికాప్టర్ కూలి ఏడుగురు దుర్మరణం

**నైరోబి, ఆగస్టు 20:** కెన్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సఫారీ ప్రయాణంలో ఉన్న హెలికాప్టర్ కుప్పకూలడంతో ఏడుగురు మరణించారు. మృతుల్లో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ దంపతులతో పాటు ఐదుగురు అమెరికన్లుఉన్నారు. ఉత్తర కెన్యాలోని మారుమూల ప్రాంతంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. కెన్యా పౌర విమానయాన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. లోయిసాబా కన్జర్వెన్సీ నుంచి ఎవాసో న్యిరో ప్రాంతానికి వెళ్తుండగా ఉదయం 9.13 గంటలకు సాంబురు కౌంటీలోని పర్వత ప్రాంతంలో హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఘటన సమయంలో హెలికాప్టర్‌లో ఆరుగురు ప్రయాణికులు, ఒక పైలట్‌ఉన్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతి చెందినట్లు సాంబురు పోలీసు కమాండర్ డేవిడ్ న్కోరోయ్ వెల్లడించారు. మృతుల్లో ఐదుగురు అమెరికా పౌరులు ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈక్వెడార్ నేషనల్ ఇంటెలిజెన్స్ సెంటర్ డైరెక్టర్ పేరు మిచెల్ సెన్సీ-కాంటూగి.. ఆయన సతీమణి స్టెఫనీ హోలిహాన్ కూడా మృతి చెందారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపిన అమెరికా రాయబార కార్యాలయం.. స్థానిక అధికారులతో కలిసి కాన్సులర్ సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది.

# భార్య, సోదరిని చంపి ఆత్మహత్య చేసుకున్న ఎస్‌బిఐ ఉద్యోగి

**లక్నో, ఆగస్టు 20:** మానస్ వాజ్‌పేయి అనే ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఉద్యోగి గురువారం మధ్యాహ్నం లక్నోలోని ప్రముఖ ప్రాంతమైన గోమతి నగర్‌లో ఉన్న ఐసిఐసిఐ బ్యాంక్ బయట తన భార్యను కాల్చి చంపాడు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం అందించారు. వారికి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 38 ఏండ్ల మానస్ వాజ్‌పేయి బ్యాంక్‌లో పనిచేస్తున్న తన భార్య దివ్య మిశ్రాను బయటకు పిలిచాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడ ఉన్నవారు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. మానస్, దివ్యలకు 12 యేండ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలంగా వారు విడిగా ఉంటున్నారు. దివ్య గతేడాది విడాకుల కోసం దరఖాస్తు చేసుకుందని సమాచారం. మానస్ మానసిక సమస్యలతో బాధపడుతున్న తన 28 ఏండ్ల చెల్లెలు శివ వాజ్‌పేయిని కూడా కాల్చి చంపాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకునేముందు తన భార్యను, చెల్లెలిని చంపిన విషయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. ఈ రోజు నన్ను మోసం చేసిన నా భార్యను చంపేశాను.

నా చెల్లెల్లిని చంపి, నేను చనిపోతున్నాను. ఆమె చెల్లెలు ప్రజ్ఞ, అన్నీ అంతం కావాలి అని వాట్సప్ స్టేటస్‌లో రాశాడు. మానస్ 12:30కు ఇంటికి వచ్చాడని, ఆందోళన, చెమటలు పట్టిన ముఖంతో కనిపించాడని పొరిగింటివారు చెప్పారు. ఇంటిలోకి వెళ్లిన అతడు హనుమాన్ చాలీసాను ప్లే చేశాడు. తరువాత అతడి వాట్సాప్ స్టేటస్ చూసి లోనికివెళ్లి చూడగా మానస్ విగతజీవిగా కనిపించాడని వారు చెప్పారు. ఈ ఘటన గురించి దివ్య సోదరి ప్రజ్ఞ మిశ్రా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. నా సోదరిపై కాల్పులు జరిగాయని నాకు ఇప్పుడే ఫోన్ వచ్చింది. ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు. దయచేసి ప్రార్థించండి అని ఆమె యుపి పోలీసులకు ట్యాగ్ చేశారు. మానస్ తన వాట్సప్ స్టేటస్‌లో ప్రస్తావించిన ప్రజ్ఞ ఈమె అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

# చీనాబ్ వంతెనపై 100 కిమీ వేగంతో వందేభారత్

**శ్రీనగర్, ఆగస్టు 20:** భారతీయ రైల్వే చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. దుర్భేద్యమైన కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే క్రమంలో నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ రైల్వే బ్రిడ్జిపై మన ప్రతిష్ఠాత్మక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లి సరికొత్త రికార్డు సృష్టించింది.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనపై గంటకు దాదాపు 100కి.మీ వేగంతో శరవేగంగా ప్రయా ణించి, భారత్ తన రవాణా సాంకేతికతతో ప్రపంచాన్ని మరోసారి ఆశ్చర్యపరిచింది. ఉత్తర రైల్వే పరిధిలోని శ్రీమాతా వైష్ణోదేవి కత్రా నుంచి బనిహాల్ వరకు ఉన్న 111 కిలోమీటర్ల పొడవైన నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గంలో రైళ్ల వేగాన్ని గంటకు 100 కిలోమీటర్లకు పెంచేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదం తెలిపింది. గతంలో ఈ మార్గంలోని కత్రాసంగల్దాన్ సెక్షన్‌లో గంటకు 85 కి.మీ, సంగల్దాన్ బనిహాల్ సెక్షన్‌లో గంటకు 75 కి.మీ మాత్రమే గరిష్ట వేగానికి అనుమతి ఉండేది.

# ఇరాన్‌కు ఆర్థిక సాయం చేస్తే భారీ మూల్యం తప్పదు

## దేశాలకు ట్రంప్ 'ఎకనామిక్ డీ-డే' హెచ్చరిక



**వాషింగ్టన్, ఆగస్టు 20:** ఇరాన్‌కు ఆర్థికంగా లేదా లాజిస్టిక్స్ పరంగా సహాయం చేసే దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక సహాయం అందించినా 'భారీ ఆర్థిక పరిణామాలు' ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా సైనిక చర్యను అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆపరేషన్‌గా ట్రంప్ అభివర్ణించారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో ఇరాన్‌కు సంబంధించిన చమురు అక్రమ రవాణా, నగదు బదలీలు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, షిప్ రిజిస్ట్రేషన్లు, నకలీ లేదా ముందస్తు కంపెనీల ద్వారా జరిగే లావాదేవీలను వెంటనే నిలిపివేయాలని కోరారు.

**'ఎకనామిక్ డీ-డే' అంటూ ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌కు సహాయం చేస్తున్న దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా మిత్రదేశాలన్నీ తమతో కలిసి ఇరాన్‌ను ఒంటరిగాచేసి, ఆ దేశం నుంచి ఎదురయ్యే ముప్పును ఓడించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఆ దేశం 'ఒక దారంతో వేలాడుతున్నట్లుగా' ఉంది ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాల్ని పొందేందుకు అనుమతించబోమని కూడా మరోసారి స్పష్టం చేశారు.

**ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలకు సంకేతాలు**

ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలు విధించే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఫిబ్రవరి 28 నుంచి అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరికలు వచ్చాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా సిద్ధమవుతోందనే సంకేతాలను ట్రంప్ తాజా వ్యాఖ్యలు ఇస్తున్నారు. ఇరాన్‌పై చేపట్టిన నౌకాదళ దిగ్బంధనం విజయవంతమైందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దిగ్బంధనం '100 శాతం విజయవంతమైంది' అని అన్నారు. ఇరాన్‌పై ఆంక్షలు, సైనికచర్యలు కొనసాగుతున్నప్పటికీ అంతర్జాతీయ చమురు ధరలు పెద్దగా పెరగలేదని ట్రంప్ పేర్కొన్నారు. చమురు మార్కెట్‌లో అంతరాయాలు ఉన్నప్పటికీ ధరలు ఎక్కువగా స్థిరంగా ఉన్నాయని అన్నారు.

ఇరాన్‌పై అమెరికా చర్యల విషయంలో ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం.. ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్‌నుతెరిస్తే అమెరికా తనచర్యలను నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్ అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకిటి కావడంతో, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

## అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యుఎస్సీఐఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నతస్థాయి దౌత్య మర్యాదలు ఇవొవ్వద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యుఎస్సీఐఆర్‌ఎఫ్ చైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు.

ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యుఎస్సీఐఆర్‌ఎఫ్.. ఆర్‌ఎస్‌ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది.

అయితే యుఎస్సీఐఆర్‌ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై వక్రీకరించిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

అనుమానాస్పత వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యుఎస్సీఐఆర్‌ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అమెరికాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారతీయులపై పెరుగుతున్న అసహనాన్ని ముందుగా పరిశీలించాలని సూచించారు.

# జార్ఖండ్ ప్రభుత్వం పరీక్ష, నియామకాల రద్దుపై హైకోర్టు స్టే



**రాంచి, ఆగస్టు 20:** జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. జెపిఎస్‌సి పరీక్షల్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ దీపక్ రోషన్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జెపిఎస్‌సి పరీక్షల ద్వారా ఇటీవల నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. జెపిఎస్‌సి (జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)తోపాటు జెపిఎస్‌సి (జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్) చేపట్టిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అక్కడి విద్యార్థి సంఘాలు, యువత గత నెల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కొందరు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు కూడా విద్యార్థులకు మద్దతుగా నిలిచాయి. రెండేళ్లుగా ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిన సిఎం హేమంత్ సోరెన్ ఆధ్వర్యంలోని సర్కార్ పరీక్షల్ని రద్దు చేసింది. 2024 నుంచి జెపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు, నియామకాల్ని రద్దు చేస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నిర్ణయాన్ని తాజాగా ఎంపికైన ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. జెపిఎస్‌సిద్వారా రెండేళ్లుగా దాదాపు 39 ఉద్యోగ నియామక పరీక్షలు జరిగాయి. వాటిలో కొన్ని ఫలితాలు వెలువడి నియామకాలు కూడా పూర్తయ్యాయి. వేలాది మంది ఉద్యోగాల్లో చేరిపోయారు. జెపిఎస్‌సి ప్రక్రియద్వారా ఎన్నికై.. యేడాది, రెండేళ్ల నుంచి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఈ పరీక్షల్ని, నియామకాల్ని రద్దు చేయడంతో వారి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో వారు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఎంపికైన ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయంవల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారించిన కోర్టు పరీక్షల్ని రద్దుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్‌కుమార్ కన్నుమూత



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూశారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో ఆయన జీవితకాల శిక్షను అనుభవిస్తున్నారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో ఆయన ప్రాణం విడిచారు. తీహార్ జైలు నుంచి ఆయన్ను చివరి క్షణాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 80 ఏళ్లు. చాలా కాలంగా పలు రకాల రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చింది. ఆ తర్వాత ఆయనకు ఆ కేసులో జీవితకాల శిక్షను విధించింది. సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలని కోరుతూ సిక్కు అల్లర్ల బాధితులు డిమాండ్ చేశారు. మూడు సార్లు ఆయన లోక్ సభకు ఎన్నికయ్యారు. ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నేతగా గుర్తింపు ఉన్నది. 2018లో దోషిగాతేలడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత ఢిల్లీలో అల్లర్లు చోటుచేసుకున్నాయి. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరా గాంధీ బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ ఆమె హత్యకు పాల్పడ్డారు. అయితే ఆ హత్య నేపథ్యంలో సిక్కులపై ఢిల్లీలో ఊచకోత జరిగింది. సిక్కుల ఇండ్లు, షాపులపై దాడి చేశారు. సుమారు 3వేల మంది సిక్కులను హతమార్చారు. జశ్వంత్ సింగ్‌తో పాటు ఆయన కుమారుడి హత్య కేసులో సజ్జన్‌కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత ఇద్దరు సిక్కులను హతమార్చిన కేసులో మరో వ్యక్తి యశ్‌పాల్ మాలిక్‌కు మరణశిక్ష వేశారు. ఇక ఇదే ఘటనతో లింకున్న కిషోరి లాల్ అనే వ్యక్తికి కూడా 1996లోనే మరణశిక్ష విధించారు. కానీ సిక్కుల మర్డర్ కేసులో సజ్జన్ కుమార్‌కు కేవలం జీవితకాల శిక్ష పడింది.

# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేతల నివాళులు!

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్‌చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోడీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోడీ స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అంటూ ఎక్స్ వేదికగా మోడీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ (గుడ్‌విల్ డే) జరుపుకుంటారు. ఈ రోజు మాజీ ప్రధాని ప్రతిపాదించిన విలువలను స్మరించుకుంటారు.

# సంక్షిప్త వార్తలు

## పాక్ హైకమిషన్‌వద్ద ఢిల్లీ సర్కార్ బుల్‌డోజర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పాకిస్థాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పింది. పాకిస్తాన్ చర్యకు ధీటుగా బదులిచ్చింది. ఇటీవల పాకిస్తాన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న బారికేడ్లను పాక్ ప్రభుత్వం తొలగిస్తే ఇప్పుడు ఇండియా కూడా ఇక్కడ ఉన్న పాక్ రాయబార కార్యాలయం వద్ద బుల్డోజర్ చర్యకు దిగింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారత రాయబార కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం వద్ద ఉన్న సెక్యూరిటీ బారికేడ్లను ఇటీవల పాకిస్థాన్ ప్రభుత్వం తొలగించింది. ఇది జరిగి మూడు రోజులు అవుతోంది. దీంతో పాక్ చర్యకు భారత్ కూడా అదేరీతిలో బదులిచ్చింది.

## గ్యాంగ్‌స్టర్ వినోద్‌ను కాల్చివేసిన దుండగులు

**హిసార్, ఆగస్టు 20:** గ్యాంగ్‌స్టర్ వినోద్ పను అలియాక్ కనాను దుండగులు గురువారం కాల్చి చంపారు. హరియాణాలోని హిసార్‌లో ఉన్న కోర్టు గేటు బయట కాల్చిచంపారు. ఒక కేసు విచారణ కోసం వినోద్ కోర్టుకు వెళ్తుండగా, బైకుపై వచ్చిన దుండగులు అతడిపై గేటు బయట కాల్పులు జరిపారు. దాదాపు 12 రౌండ్ల కాల్పులు జరపడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు.ముందుగా వినోద్ దగ్గరికి వచ్చిన దుండగులు సమీపం నుంచి వరుసగా కాల్పులు జరిపారు. అనంతరం రెండు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం ఇద్దరు దుండగులు వేగంగా బైకుపై అక్కడినుంచి పారిపోయారు.

## రూ. 20 లంచం కేసులో 30 యేళ్లకు సుప్రీం క్లీన్ చిట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** 1996లో నమోదైన రూ.20 లంచం ఆరోపణల కేసులో గుజరాత్ ప్రభుత్వానికి చెందిన ఓ క్లర్క్, ప్యూన్‌కు విధించిన శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. విద్యార్థికి ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.120 లంచం డిమాండ్ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎసిబి నిర్వహించిన ట్రాప్‌లో ప్యూన్ వద్ద రూ.20 స్వాధీనం చేసుకోగా.. క్లర్క్ వద్ద ఆరోపించిన రూ.100 లభించలేదు. లంచం డిమాండ్ చేసినట్లు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లేవని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదుదారు వాంగ్మూలంలోనూ భిన్నతలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది.

## బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంలో తేజ్‌పాల్ సవాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జర్నలిస్టు తరుణ్ తేజ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలుశిక్ష విధించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ తరుణ్ తరుపున అడ్వకేట్ ఆదిత్య సమద్దర్ పిటిషన్ దాఖలు చేశారు. తెహల్కా మాజీ ఎడిటర్‌కు శిక్ష విధించాలని గోవా ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. తీవ్రమైన నేరానికి చాలా తక్కువశిక్ష విధించినట్లు గోవా సర్కారు అభిప్రాయ పడింది.

## రెండుట్రక్కులు ఢీ...నలుగురు మృతి



**సిమ్లా, ఆగస్టు 20:** హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్, మండి జిల్లా, చండీగఢ్‌మనాలి నేషనల్ హైవేపై, హనోగి టన్నెల్ లోపల గురువారం ఉదయం జరిగింది. టన్నెల్ లోపల ఉదయం 7.45 గంటలకు రెండు ట్రక్కులు వేగంగా వెళ్తూ, ఎదురెదురుగా ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో వాహనాల ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ట్రక్కుల్లోని ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు.

MN 10 final:MN 10 final 01/01/2001 10:40 Page 1



# డిఏపి ఎరువుల నిల్వల పై తనిఖీలు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 20, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాలలోని ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాలను గుంటూరు వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.మోహన్ రావు తన సిబ్బందితో కలిసి గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రశాంతి ట్రేడర్స్, మోహన్ ట్రేడర్స్, అమరలింగేశ్వరా ఫర్టిలైజర్స్, మన గ్రోమోర్ సెంటర్ మరియు రాధా రమణ ఫర్టిలైజర్స్ తదితర ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. నిన్న ఒ దినపత్రికలో వచ్చిన నకిలీ డిఏ పి ఎరువులు అనే వార్త పై గురువారం పై మండలాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. పైనపేర్కొన్న ఎరువుల షాపుల లైసెన్సలను, స్టాక్ బోర్డులను, ఫారం ఖ0ఖ లను, డిఏపి, యూరియా నిల్వలు మరియు స్టాక్ రిజిస్టర్లను, ఫీజికల్ బాలన్స్, ఈపోష్ మిషన్ లోని స్టాక్ లను పరిశీలించారు. అలాగే డిఏపి స్టాక్ ఇన్వాయిస్ లను పరిశీలించారు.

ముఖ్యంగా రైతు సోదరులు అందరూ ఎరువులు కొనుగోలు చేయునపుడు, తప్పని సరిగా బిల్లులు తీసుకుని కొనుగోలు చేయాలనీ తెలిపారు, ప్రతి ఒక్క ఎరువుల డీలరు రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు, అలాగే డీలర్లు ఎవరైనా ఎరువులను ఎం.ఆర్.పి రేటు కంటే ఎక్కువకు అమ్మినచో వారిపై ఎఫ్సిఓ1985 యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా, డిఏపి ఎరులను ఎటువంటి లింక్ ప్రొడక్ట్స్ అంట గట్టకుండా ఎరువులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్లో యూరియా, డిఏపి ఎరువులకు ఎటువంటి కొరత లేదని, రైతులందరూ ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. ఈ తనిఖీల్లో ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారి సుగుణ బేగం మరియు వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రీ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

**వేమూరు ఆగస్టు 20 (ప్రభాతవార్త) :** మండల గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలిన రేపల్లె ఆర్డీవో శ్రీదేవి తెలియజేశారు. గురువారం మండలంలోని పెరవలి



గ్రామంలో జరుగుతున్న ర సర్వే పనులను పరిశీలించారు. వచ్చే నెల 10వ తేదిలోపు డిఎల్ఆర్‌ను పూర్తి చేయాలన్నారు. రీ సర్వే జరుగుతున్న తీరు తెన్నులను సర్వే బృందాల నుండి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు తహశీల్దార్ పి.పార్వతి, ట్రైనీ డిప్యూటీ తహశీల్దార్ కొక్కిలిగడ్డ కళ్యాణ్, మండల సర్వేయర్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

# వార్డు డీలిమిటేషన్ ప్రతులు విడుదల

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు 20(ప్రభాతవార్త):** ప్రస్తుతమున్న తెనాలి పురపాలక సంఘవార్డుల సంఖ్యను 40 నుండి 52వార్డులకు పెంచుచు ప్రభుత్వము వారు అమోదించిన డిలిమిటేషన్ (పునర్వీభజన)ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ గజిట్ నందు ప్రచురించుట జరిగిందని, సదరు ప్రచురించిన ప్రతులు నకళ్ళును పురపాలక సంఘ కార్యాలయం నోటీసు బోర్డు నందు ప్రజల పరిశీలనార్థం ఉంచబడిందని మున్సిపల్ కమీషనర్ రామ అప్పల నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ పి శ్రీకాంత్, మునిసిపల్ మేనేజర్ విల్సన్ జయకర్ మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.ఓటరు వివరాలు పక్కాగా నిర్వహించండి.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ సూచనలతో మున్సిపల్ ఎలక్షన్స్ లో భాగంగా స్వర్ణ వార్డు సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సూచనలు సలహాలు తెలియజేసియున్నారు. సిబ్బంది అందరు కూడా ఓటరు వెరిఫికేషన్ చాలా బాధ్యతగా చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ,ఓసీ ఓటర్స్ వెరిఫికేషన్ లో సమాచారం పక్కాగా సేకరించాలన్నారు.



# దేశంలో టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్ గాంధీ : డా.చందు సాంబశివుడు

**తెనాలి ఆగస్ట్20(ప్రభాతవార్త):** భారతదేశంలో టెక్నాలజీకి ఆధ్యుడు,దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు.గురువారం స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా, పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, డాక్టర్ చందు సాంబశివుడు పార్టీ శ్రేణులతో కలిసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ, చిన్న వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడమే కాకుండా,భారతదేశంలో నాలుగు దశాబ్దాల క్రితమే కంప్యూటర్లను పరిచయం చేసి దేశంలో టెక్నాలజీకి ఆద్యుడు అయిన రాజీవ్ గాంధీ చిరస్మరణీయులని, అలాగే యువతకు ఓటు హక్కును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి దేశ నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. అంతేకాకుండా స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఆనాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అమలులోకి తెచ్చారన్నారు. ఆనాడు దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితం గాని నేడు భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని ఈ సందర్భంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలను దేశ ప్రజలు యువత ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారన్నారు. ఒక ప్రధానికి కుమారుడిగా మరొక ప్రధానికి మనవడిగా తాను కూడా ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ పనిచేసి, దేశ సేవలో తన ప్రాణాలను పోగొట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శశిధరరావు,బీసీ సెల్ అధ్యక్షుడు దోగిపర్తి శ్రీనివాసరావు, కడిదం కోటేశ్వరావు,తన్నీరు శివన్నారాయణ, శీలం సుబ్బారావు,భీమ రమేష్, నక్కా మాధవరావు, అఖిల్, ప్రసాద్, శ్రీను,ఎన్. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.




# కొలనుకొండ గంగానమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన చిల్లపల్లి

**మంగళగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** తాడేపల్లి మండలం, కొలనుకొండ గ్రామంలోని ప్రసిద్ధ గంగానమ్మ తల్లి ఆలయాన్ని గురువారం ఏపీ ఎం ఎస్ ఐ డి సి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు సందర్శించారు.ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగానమ్మ తల్లి ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యత, అమ్మవారి మహిమను గ్రామ పెద్దలు వివరించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని చిల్లపల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరేటర్, వాటర్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు నిరంతర విద్యుత్ సౌకర్యంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం గ్రామస్తులు, ఆలయ కమిటీ చేస్తున్న కృషిని చిల్లపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ ఐఏఎస్,ఐపిఎస్ ల పట్ల విమర్శలు గర్హియనీయం : కేసన శంకరరావు

**తాడేపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మిగతా సామాజిక వర్గ అధికారుల పట్ల ఎంతో జాగ్రత్త పడే రాజకీయ పార్టీల నాయకులు, వెనుకబడిన తరగతులకు చెందిన బిసి ఐఏఎస్,ఐపిఎస్ అధికారుల పట్ల వివక్ష చూపుతూ, నిరాధార నిందారోపణలతో విమర్శలు చేయడం చేసిన మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వైఖరి సరికాదన్నారు . గతంలో రాజకీయ నాయకులు ఇదే విధంగా బీసీ అధికారులను దూషించిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఓబీసీ




గర్హియనీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్థానిక రాష్ట్ర కార్యాలయంలో ఖఖ కొందరు రాజకీయ నేతలు బీసీ అధికారులపై విమర్శలు ఖఖ అన్న అంశంపై జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ఆక్షేపించారు. ఉదాహరణకు ఇటీవల తిరుపతి బాలాజీ జిల్లా కలెక్టర్, బీసీ వర్గానికి చెందిన వెంకటేష్ ను డాకు మంగళ్ సింగ్ అంటూ అవహేళన చేస్తూ, వ్యక్తిగతంగా పలు రకాల విమర్శలు అధికారుల పట్ల ఆధిపత్య పెత్తందారి రాజకీయ పార్టీల నాయకులు కొందరు అనుసరిస్తున్న తప్పుడు వైఖరిని మార్చుకోవాలన్నారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఉపాధ్యక్షులు గుర్రం ద్వారకా శ్రీను, రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, మంగలిగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, దా నా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# మంగళగిరిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**మంగళగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** మంగళగిరి పట్టణంలో మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం షేక్ సలీం మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక, సమాచార రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని అన్నారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడంతో పాటు దేశాన్ని ఆధునిక, సాంకేతిక భారతంగా తీర్చిదిద్దేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం, మండల అధ్యక్షులు కొప్పాకుల కృష్ణారావు చౌదరి, ఐ.ఎన్.టీ.యూ.సీ గుంటూరు జిల్లా అధ్యక్షులు రేమిశెట్టి హనుమంతరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బుల్లా సమర్పణ కుమార్, సీనియర్ నాయకులు గండికోట వెంకయ్య, మంగళగిరి మహిళా అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ మహిళా సెక్రటరీ, విజయవాడ సిటీ ఇంచార్జ్ కూర్మాల రాధిక, ఐఎన్‌టీయూసీ గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు ఉచిత శిక్షణతో ఉద్యోగ అవకాశాలు

**నరసరావుపేట టౌన్ , ఆగస్టు 20 ప్రభాతవార్త :** కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తో పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దిన్ తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (తి। లీలి), జనరేటివ్ తి। వంటి పరిశ్రమలో అధిక డిమాండ్ ఉన్న ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, రెజ్యూమ్ తయారీ, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు.కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ అందిండంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ చల్లా మోహన్, ట్రైనింగ్ ప్రతినిధి విక్రమ్, ప్రిన్సిపాల్ డా. జి. నామల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ ముజీర్ తదితరులు పాల్గొన్నారు.



# చెన్నారెడ్డి చిత్రపటానికి డాక్టర్ గోపిరెడ్డి నివాళి

**నరసరావుపేట,ఆగస్టు 20 ప్రభాతవార్త :** రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి కుమారుడు నవులూరి చెన్నారెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.చెన్నారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్మరించుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన ఆయన మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. చెన్నారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భరోసాఇచ్చారు.కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, యేనుమల మురళీధర్‌రెడ్డి, గురజాల నియోజకవర్గ పరిశీలకులు శివారెడ్డి, జెడ్పీటీసీ పదమొత్తం చిట్టిబాబు, యంపాటి వెంకటప్పరెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 34 బిసి రిజర్వేషన్ బిల్లుని పార్లమెంటులో చట్టబద్ధత చేయండి

## గురజాల మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త : :** 34 బిసి రిజర్వేషన్ బిల్లుని పార్లమెంటులో పెట్టి చట్టబద్ధత చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరుతూ గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి గురువారం ఒక వీడియోని విడుదల చేశారు. 34 బీసీ రిజర్వేషన్ చారిత్రకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోను, కేంద్రంలోను ఉన్నది ఎన్డిఏ ప్రభుత్వమేనని, అలాంటప్పుడు మీరు పార్లమెంట్ లో 34 బీసీ రిజర్వేషన్ బిల్లును పెట్టి ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు అసెంబ్లీలో చేసిన చట్టం, రేపు కోర్టులలో నిలబడదని కూటమి నాయకులకు తెలుసన్నారు. అంటే దీని అర్థం బీసీలను మరోసారి మోసం చేయడమేనన్నారు. చట్టసభల్లో బిసిలకు 34 రిజర్వేషన్ పై ఆమోదించి, చట్టం చేస్తేనే బీసీలకు భరోసా కలుగుతుందన్నారు. అప్పుడు మాత్రమే ప్రజలు విశ్వసిస్తారని, అప్పుడు వారికి హక్కు ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితమే పార్లమెంటు సమావేశాలు ముగిశాయని, ఆ సమావేశాలలో డి లిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను పాస్ చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం అనుకున్నా కుదరలేదని అన్నారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉండి ఉంటే దానికన్నా ముఖ్యమైన 34 బీసీల రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఎందుకు పెట్టలేదని కాసు మహేష్ రెడ్డి ప్రశ్నించారు.



# గుంటూరు వెస్ట్ ఎంఈఓను కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

**గుంటూరు విద్య ఆగస్టు 20 ప్రభాతవార్త :** నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నూతన గుంటూరు వెస్ట్ మండల విద్యాశాఖ అధికారి షేక్ షరీఫ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ను అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఈ ఎస్ ఆర్ చేయవలసిన నేపథ్యంలో మండలంలోని ఉపాధ్యాయుల ఎస్సార్ లను అప్డేట్ చేయవలసిందిగా విన్నవించడం జరిగింది. దీనికి స్పందించిన ఎంఈఓ మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని ఎస్ ఆర్ లను అప్డేట్ చేయడం జరిగిందని, మిగిలినవన్నీ కూడా సకాలంలో పూర్తిచేసి ఉపాధ్యాయులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర మున్సిపల్ శాఖ కన్వీనర్ పి లలిత బాబు, గుంటూరు ఈస్ట్ మండల అధ్యక్షులు కె .వీర రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ రావు, గుంటూరు వెస్ట్ మండల అధ్యక్షులు టి రవి, ప్రధాన కార్యదర్శి కె .వేణుగోపాల రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ కోసం కరూర్ వైశ్యా బ్యాంక్ యాజమాన్యం ఓపెన్ జిమ్ ఏర్పాటు అభినందనీయం

## నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 20,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ కి కరూర్ వైశ్యా బ్యాంక్ వారు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అన్నారు. గురువారం బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో కరూర్ వైశ్యా బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ని కమిషనర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ ఫిట్ నెస్ పై దృష్టి పెడుతున్నారని, అటువంటి వారి కోసం కరూర్ వైశ్యా బ్యాంక్ ముందుకు వచ్చి సిఎస్ఆర్ లో భాగంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతి రోజు వందల సంఖ్యలో వాకర్స్ వస్తారని, వారికి ఓపెన్ జిమ్ ఉపయోగపడుతుందన్నారు. స్టేడియంలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. స్టేడియంలో పారిశుధ్య పనులకు కార్మికులు అవసరమని సెక్రెటరీ తమ దృష్టికి తెచ్చారని, కార్మికులను కేటాయించాలని సిఎంఓహెచ్ ని ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, స్టేడియం సెక్రెటరీ వజ్జా రామకృష్ణ, కరూర్ వైశ్యా బ్యాంక్ డిజిఎం ఎన్.రమేష్, చీఫ్ మేనేజర్లు అరవింద్ గణేష్, వెంకట సత్యనారాయణ, స్టేడియం కమిటి నుండి ఉమామహేశ్వరరావు, కాంతారావు, వెంకట రత్తయ్య, యామిని శివజ్యోతి పాల్గొన్నారు.



# సనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహమ్మద్ అస్లామ్‌కు ఘన సన్మానం

**చిలకలూరిపేట,ఆగస్టు 20, ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన‘చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్-2026 పురస్కారాన్ని అందుకున్న ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్ డైరెక్టర్ శ్రీ మహమ్మద్ అస్లామ్కు సనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. లక్కీ రోడ్ లైన్స్ చైర్మన్ శ్రీ యూసుఫ్ అలీ, ఖాజీ శ్రీ అనాస్ ఖాన్లు మున్సిపల్ దీని రహీం అస్లామ్‌ను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో విశేషంగా రాణిస్తూ, సమాజ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్న మహమ్మద్ అస్లామ్ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఖ్యంగా అనాథ పిల్లలకు ఉచిత విద్య అందించడం, బాలికల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం, విద్యార్థులకు ఆధునిక విద్యా విధానాలను అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు.అస్లామ్ విద్యారంగంలో అందిస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం చిలకలూరిపేట ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ (తిలీశి) ఆధ్వర్యంలో అందుకున్న‘చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్-2026 పురస్కారం ఆయన చేస్తున్న సేవలకు దక్కిన సముచిత గౌరవమని అన్నారు.విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ సమాజంలోని అవసరమైన వర్గాలకు అండగా నిలుస్తున్న మహమ్మద్ అస్లామ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సనా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొని మహమ్మద్ అస్లామ్‌కు ఘనంగా అభినందనలు



# విద్యార్థులకు ఉద్యోగాలు

## - ఇద్దరికి 24 లక్షల వార్షిక వేతనం..





**గుంటూరు విద్య ఆగస్టు 20 ప్రభాతవార్త** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నందు ప్రముఖ అంతర్జాతీయ ఐటి సంస్థ ఖిష్నార్ ఇంటర్నేషనల్ ఎల్ఎల్‌సిఖి నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 25 మంది వివిఐటియు విద్యార్థులు భారీ వార్షిక వేతనాలతో ఉద్యోగ నియామకాలు పొందారని వివిఐటియు ప్రోఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో ఇద్దరు విద్యార్థులు చుండూరు గిరి వెంకటేశ్వరరావు, గుడిపూడి గణేష్ అత్యధికంగా 24 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక కాగా, 11 మంది విద్యార్థులు 14 లక్షల వార్షిక వేతనంతో, 12 మంది విద్యార్థులు 6 లక్షల వార్షిక వేతనంతో నియామకాలు పొందారని తెలిపారు. కెరియర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డేటా స్ట్రక్చర్స్, ఆల్గోరిథమ్స్ శిక్షణ, క్లౌడ్, ఏఐఎంఎల్ విభాగాలలో రియల్ టైమ్ ప్రాజెక్ట్‌లు, లాజికల్ రీజనింగ్, వర్బల్ నైపుణ్యాలపై సాధన ద్వారా విద్యార్థులు భారీ వేతనాలతో మెరుగైన నియామకాలు పొందగలుగుతున్నారని వివరించారు వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం ప్లేస్‌మెంట్స్ సీజన్‌కు ఇది ఒక మంచి ఆరంభం అని, రాబోయే రోజులలో మరింత మంది విద్యార్థులు అంతర్జాతీయ సంస్థలలో భారీ వేతనాలతో నియామకాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం నియామకాలు పొందిన విద్యార్థులను ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ టి. శ్రీనివాసరావు మరియు అధ్యాపకులు అభినందించారు.

# అచ్చంపేటలో కార్డన్ సెర్చ్

## 40 వాహనాలు స్వాధీనం

**అచ్చంపేట ఆగస్టు 20 (ప్రభాత వార్త):** పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం వేల్పూరులో గురువారం ఉదయం అచ్చంపేట సీఐ శ్రీనివాస్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి డీఎస్పీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో 80 మంది పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని 40 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# నిజాయితీ చాటుకున్న రాజీవ్ అభినందించిన సి.ఐ రమేష్

**చిలకలూరిపేట,ఆగస్టు 20, ప్రభాతవార్త :** చిలకలూరిపేట టౌన్ పురుషోత్తపట్నానికి చెందిన ఏలూరి నరేంద్ర ఈరోజు ఉదయం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఆది ఆంధ్ర కాలనీ సమీపంలో తన జేబులో ఉన్న రూ.29,000 నగదు జారిపడింది. అనంతరం అటుగా వెళ్తున్న బండారపు రాజీవ్‌కు ఆ నగదు కనిపించడంతో, ఎలాంటి స్వార్థం లేకుండా వెంటనే చిలకలూరిపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నగదును పోలీసులకు అప్పగించారు. రాజీవ్ నిజాయితీని సీఐ అభినందించి ప్రశంసించారు. అనంతరం నగదును పోగొట్టుకున్న ఏలూరి నరేంద్రకు రాజీవ్ చేతుల మీదుగా తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ నిజాయితీని పలువురు అభినందించారు.



# ఈనెల 23న అన్నవరం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**చిలకలూరిపేట,ఆగస్టు 20, ప్రభాతవార్త :** రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ ఆధ్వర్యంలో పెదనందిపాడు మండలం అన్నవరం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్బు అధ్యక్షురాలు ఏ శివకుమారి, కార్యదర్శి జై జయశ్రీ లు గురువారం తెలిపారు. ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ శిబిరాన్ని సుదర్శన ఐ అండ్ విజన్ అసోసియేషన్ మరియు సుదర్శన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ గణేష్ ని పరంధామయ్య గారికి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు, ఈ శిబిరంలో కంటి పరీక్షలు, దృష్టి సమస్యల గుర్తింపు, అవసరమైన వైద్య సలహాలు తదితర సేవలను వివరిస్తారు సుదర్శని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అందించనున్నారు అవసరమైన వారికి తదుపరి చికిత్స కూడా ఉచితంగా చేస్తామని వారు తెలిపారు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావటమే ఈ శిబిర ప్రధాన లక్ష్యమని వారుతెలిపారు

# బీసీల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

## రిజర్వేషన్లు 34 శాతానికి పెంచడంపై పాలాభిషేకం

**సత్తెనపల్లి (ఆగస్టు 20, ప్రభాతవార్త):** బీసీలకు రిజర్వేషన్లను 24 శాతం నుంచి 34 శాతానికి పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సత్తెనపల్లిలో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజావేదిక వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దరువూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీలకు న్యాయం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలిపారు.

21-8pg7exHMNWJQE:21-8pg7exHMNWJQE.qxd 21/Aug/26 1:20 AM Page 1



### 2023లో తనపల్లిలో ఏం జరిగింది?

## చెట్లను కొట్టేశారెందుకు!?

### ● వైసిపి నేత భూమనను ప్రశ్నించిన పోలీసులు

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ఎమ్మెల్యేగా, టిటిడి చైర్మన్‌గా 2023లో కొనసాగిన భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతి రూరల్ తనపల్లిలో 7.91 ఎకరాల అప్రూవ్డ్ లేఔట్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించారని, అక్కడ ఉన్న పలురకాల చెట్లను కొట్టివేశారని వెంకటేశ్వరప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై భూమనపై నమోదైన భూకబ్జా కేసులో పోలీసుల నోటీసులతో గురువారం కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పోలీస స్టేషన్‌కు హాజరయ్యారు. అక్కడ ఆయనను తిరుపతి చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్ బాధితుడి ఫిర్యాదుపై పలు ఆధారాలతో భూమనను పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. కరుణాకర్‌రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి పోలీసుల ఎదుట హాజరై పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారనేది తెలుస్తోంది. న్యాయవాదితో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళారు. తనపల్లిలో అప్రూవ్డ్ లేఔట్‌లో మామిడి, టేకు, జామ, నేరేడు చెట్లను కొట్టివేశారని, ఆ భూమిలో భూమన కుటుంబానికి చెందిన మామిడి తోటకు రోడ్డువేసేందుకు యత్నించారని, అక్కడున్న తన మనుషులను బెదిరించారని ఫిర్యాదుపై కూడా ఆరా తీశారు. హైకోర్టు ఆదేశాలతో భూమనను పోలీసులు ఆధారాలతో విచారణ చేయడం విశేషం. తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఆయన్ను ప్రశ్నించారు.

అయితే ఈ కేసు నమోదు ప్రక్రియపై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని అన్నారు. తొలుత ఎఫ్ఐఆర్‌లో ఫిర్యాదుదారుగా జిల్లా కలెక్టర్ పేరును నమోదు చేసి, ఆ తర్వాత అదే క్రైమ్ నంబర్‌పై ప్రైవేట్ వ్యక్తి పేరును చేర్చారని, అధికారిక రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు.

భూమన ఆరోపణలను తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తోసిపుచ్చారు. రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్న ప్రచారంలో వాస్తవం లేదని, కేవలం ఒకే ఎఫ్ఐఆర్ నమోదైందని స్పష్టం చేశారు. భూ కబ్జాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమకు లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖ ఆధారంగా, సిఐ ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారని వివరించారు.

## సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఆధునికతను, సాంకేతిక విప్లవానికి ఆద్యుడని తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు కొనియాడారు. నేడు ప్రపంచంలోనే ఆధునిక సాంకేతిక విప్లవంతో భారత్ వేగంగా అభివృద్ధి చెందడానికి ఆనాడు రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని వివరించారు. భారతదేశంలో కంప్యూటర్లు, సమాచార సాంకేతికత రంగాల అభివృద్ధికి ఆయనే పునాది వేయడం జరిగిందని, విదేశాల నుంచి కంప్యూటర్ల దిగుమతిపై పన్నులను తగ్గించారని అన్నారు. ఈ కారణంగానే దేశంలో కంప్యూటర్లు, సెల్ ఫోన్లు ప్రతి ఒక్కరి వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. రాహుల్ గాంధీ అదే స్ఫూర్తితో దేశ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతోందని 2029 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి, పిసిసి కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్, పిసిసి మాజీ కార్యదర్శి సుప్రజ, పార్టీ సీనియర్ నాయకులు వెంకటరామయ్య, శివబాలాజీ, గౌతమ్, దుగ్గాని రెడ్డెప్ప, పార్థసారథి రెడ్డి, తవన్ కళ్యాణ్, ముసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.



## గంజాయిపై డ్రోన్లు, స్నిఫ్ఫర్ డాగ్స్‌తో నిఘా

**శ్రీకాకుళం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లు, స్నిఫ్ఫర్ డాగ్స్ ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గంజాయి సాగు, నిల్వల గుర్తింపునకు జూన్, జులై నెలల్లో 320 ప్రదేశాల్లో డ్రోన్ సర్వేలు, 53 ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామని వెల్లడించారు. సరిహద్దు చెక్ పోస్టులైన పురుషోత్తపురం, పాతపట్నం, గొప్పిలి, పైడిభీమవరం వద్ద వేలాది వాహనాలను తనిఖీ చేసి, పురుషోత్తపురం చెక్ పోస్ట్ వద్ద 1,127 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడంలో భాగంగా ఫార్వర్డ్ లింక్స్ ద్వారా 28 మందిని, బ్యాక్‌వర్డ్ లింక్స్ ద్వారా 47మంది నిందితులను గుర్తించి వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘా పెంచామని వివరించారు. నేరాలకు పాల్పడే 329 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచామని, పిట్ ఎన్డీపీఎస్ కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బడి ఈడు పిల్లలు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన 'సంకల్పం' సదస్సుల ద్వారా జూన్, జులై నెలల్లో ఏకంగా 7 లక్షలకు పైగా విద్యార్థులు, వేలాది మంది ప్రజలకు అవగాహన కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని డిఅడిక్షన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న 11 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు మెరుగైన కౌన్సెలింగ్, వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే ఎన్ఆర్ఎక్స్ ఔషధాలు విక్రయించే మెడికల్ షాపులపై నిర్వహించిన 18 తనిఖీల ఫలితంగా విక్రయాలు 10 శాతం తగ్గాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైల్వే స్టేషన్లలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ దళాలతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి రవాణాను అరికట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈగల్ అదనపు ఎస్పీ చుక్కా శ్రీనివాసరావు, డిఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, భవాని, ఆర్టీవో గంగాధర్, పోలీస్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిరాహారదీక్ష.. 22 మంది వైసిపి శ్రేణులపై కేసు

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశాంత తిరుపతి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల విధులకు ఆటంకం కలగకుండా జిల్లా పోలీసులు 30 పోలీస్ యాక్ట్ అమలుచేస్తున్నారు. ఇదే సమయంలో బుధవారం తిరుపతిలో నిత్యంరద్దీగా ఉండే నాలుక్కాళ్ళ మండపం వద్ద వైసిపి నేత వాసు యాదవ్‌పై అక్రమ కేసు బనాయించారంటూ అతని తల్లి రేణుక నిరాహారదీక్షకు దిగారు. అక్కడ ఆమెకు మద్దతుగా వైసిపి శ్రేణులు దీక్షలో కూర్చుకున్నారు. అయితే శాంతియుతంగా భగవద్గీత చేతిలో పెట్టుకుని ఆమె నిరాహారదీక్ష చేయడంతో, ధర్నాకు అనుమతి లేదని 30 పోలీస్ యాక్ట్ ఉందంటూ పోలీసులు రంగప్రవేశం చేశారు. అనుమతి లేకుండా దీక్ష కొనసాగించడం తగదని ఆమెను అదుపులోకి తీసుకుని తదుపరి తిరుపతి తూర్పు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకా ఈ ఘటనలో వాసు యాదవ్ తల్లి వై.రేణుక, మాజీ మేయర్ డాక్టర్ ఆర్.శిరీషతో బాటు పార్టీ శ్రేణులు జి.విజయలక్ష్మి ్మ, ఎం.ఉమా యాదవ్, బి.గీతా యాదవ్, టి. ప్రియాంక, కె.రాణెమ్మ, వి. కృష్ణవేణమ్మ, ఇ. సుశీల, ఎం. మునేశ్వరి, సి. పుష్పలత, ఎన్. మమత, ఇంకా వైసిపి నేతలు తులసి యాదవ్, సురేష్, మురళీకృష్ణ, శరత్ యాదవ్, గురవయ్య, కృష్ణ యాదవ్, గురవయ్య, అరుణ యాదవ్, నీరజా రెడ్డిపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు.

### గ్రూప్-1 నియామకాలపై మేం సిద్ధం... డిఎస్సీపై సిబిఐ విచారణకు

# చంద్రబాబు సిద్ధమా?

### వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సవాల్

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ అక్రమాల నుంచి తన కుమారుడు లోకేష్‌ను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిపిఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైపిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. ఎపిపిఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై సిబిఐ విచారణకు తాము సిద్ధమని అన్నారు. డిఎస్సీపై సిబిఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. డిఎస్సీపై సిబిఐతో విచారణ చేయించాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామన్నారు. ఎపిపిఎస్సీ గ్రూప్-1 ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారి జీవితాలను నాశనం చేయాలని చంద్రబాబు టార్గెట్ చేశారని ధ్వజమెత్తారు. వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ డిఎస్సీ స్కామ్‌తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కేవలం డైవర్షన్ కోసం గ్రూప్-1 పరీక్షపై రాద్ధాంతం చేస్తుందన్నారు. డిఎస్సీలో జరిగిన తప్పులు గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ విషయంలో జరగలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా ఈ గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందే 2019 మే 26 ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ కూడా అయిపోయాయని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020లో డిసెంబర్ 14 నుంచి 20 మధ్య మెయిన్స్ నిర్వహించిందన్నారు. ఆ సమయంలో ఎంపికైన వారికి రాజకీయ రంగు పులుముతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ కారణంగా ఫలితాలు ఆలస్యం కాకూడదని ఎపిపిఎసీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి వెళ్లాలని నిర్ణయించిందన్నారు. ఈ కమిషన్‌లో చంద్రబాబు ప్రభుత్వంలో నియమించినవారు కూడా సభ్యులుగా ఉన్నారని జగన్ చెప్పుకొచ్చారు. ఈ డిజిటల్ మూల్యాంకనంపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు సైతం స్పష్టంగా ఈ డిజిటల్ మూల్యాంకనాన్ని తప్పుబట్టలేమని చెప్పిందని, మాన్యువల్ మూల్యాంకనం చేసి ఆ మార్కుల ఆధారంగానే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 163మందికి పోస్టులు ఇచ్చామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు ఆదేశాలతోనే జరిగిందన్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తుంటే చంద్రబాబు వారిపై విషం కక్కుతున్నారని జగన్ విమర్శించారు.



**పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు:** 'డిఎస్సీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. బహుషా దేశంలో కూడా జరిగి ఉండదు. అసలు పరీక్ష రాయకుండానే, స్పోర్ట్స్ కోటా కింద తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. దీని కోసం జిఒలు జారీ చేసినట్లు తండ్రీ కొడుకులు ఇద్దరూ అసెంబ్లీలో ఒప్పుకున్నారు. ఇంకా దాన్ని సమర్థించుకుంటూ స్పోర్ట్స్ పర్సన్స్‌కు పరీక్ష పెట్టాల్సిన అవసరం లేదు, పివి సింధుకు నేరుగా ఉద్యోగం ఇచ్చారని, అలాగే ఇక్కడా ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. అలా ఏకంగా 372 ఉద్యోగాలు ఇచ్చామంటూ, దానికి దీనికి పొంతన పెట్టారు. పివి సింధు పేరు చెప్పి 372 ఉద్యోగాలను ఇచ్చారు' అని జగన్ ఆరోపించారు. ఆ 372 మంది టీచర్లు పిల్లలకు ఎలా పాఠాలు చెబుతారు? అని ప్రశ్నించారు. ఇన్ని అక్రమాలు జరిగాయి కాబట్టే, తాము సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ పునరుద్ఘాటించారు.

## 'నడిచే విజ్ఞాన సరస్వతి మాలతీచందుర్'


**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** నలభై యేళ్ళ కిందట సామాజిక దృష్టితో పాఠకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలందించిన డాక్టర్ మాలతీ చందూర్ ఆనాటి గూగులమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. ఈరోజు గూగుల్ అందిస్తున్న ఎన్నో విషయాలను అనాడే తన రచనల ద్వారా అందించిన గూగులమ్మగా, నడిచే విజ్ఞాన సరస్వతిగా ఆమెను పేర్కొన్నారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షురాలు, కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ మాలతి చందూర్ రచనలు సమున్నతమైన దృష్టితో రాశారన్నారు. తాను ఎంతో ముందుచూపుతో ప్రపంచ భాషలు నేర్చుకొని విశ్వసాహిత్యాన్ని పరిచయం చేసిన మహోన్నత మేధోజనిత వ్యక్తిగా ఆవిడను కొనియాడారు. ఆమెవి సామాజిక వాస్తవికతను, చారిత్రక స్పష్టతను ఇచ్చిన రచనలన్నారు. మాలతీ చందూర్ తన రచనల ద్వారా అందించిన వెలుగు సాహిత్య భవిష్యత్తు నిర్ణయిస్తుందన్నారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీన్ ఎస్.ఎస్.ఎస్. హెచ్‌ఎం ఆచార్య పి.విజయలక్ష్మి ్మ మాట్లాడుతూ మాలతీ చందూర్ 1980లోనే ఈరోజు మనం చెబుతున్న మానసిక శారీరక అంశాలను ఎన్నింటి నో తన ప్రశ్నలు జవాబుల ద్వారా అందించే వారని, అవి ఇప్పటికీ విలువైనవని కొనియాడారు. కుటుంబ విలువలను నిలుపుకోవాల్సిన అవస రాన్ని మాలతీ చందూర్ తన రచనల ద్వారా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమ సంచాలకు రాలు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు నిర్వహించుకో వడానికి ఆర్థిక సహాయమందజేసిన వారికి కృతజ్ఞ తలు తెలియజేశారు. మాలతీ చందూర్ జగమె రిగిన రచయిత అని, ఆమె ప్రతి రచన ప్రత్యేకమై నదని అన్నారు. ప్రమదావనం శీర్షికను నడిపిన మొదటి మహిళగా కొనియాడారు. మన్నవ గంగాధర్ ప్రసాద్, ఆచార్య జె.నీరజ, వివిధ కళాశాలలు, విభాగాల ఆచార్యులు, విద్యార్థులు సాహితీ

# సమష్టిగా శ్రీవారి బహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

**● సెప్టెంబర్ 15నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ● అక్టోబర్ 11నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ● సెప్టెంబర్ 15న తొలిరోజు సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు**



శ్రీవారి బ్రహ్మోత్సవాలపై జిల్లా అధికారులతో టిటిడి ఇఒ రవిచంద్ర సమీక్ష

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది అధికమాసం రావడంతో కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోనున్నామని, ఈ బ్రహ్మోత్సవాలను టిటిడి, జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర కోరారు. ఇందుకోసం అన్ని విభాగాల, శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వ తేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెంబర్ 15 మంగళవారం రోజునే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో 19వ తేదీ గరుడసేవ, 20న బంగారురథం, 22న రథోత్సవం, 23న చక్రస్నాన మహోత్సవం, ధ్వజావరోహణం ప్రధాన ఘట్టాలు. కాగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11వ తేదీ నుండి మొదలుకానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా అక్టోబర్ 16వ తేదీ గరుడవాహనం, 17న పుష్పపల్లకి, 19న స్వర్ణరథోత్సవం, 20న చక్రస్నాన మహోత్సవంతో ముగియనున్నాయి. రెండు బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై గురువారం తిరుమల అన్నమయ్యభవన్‌లో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పి ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, టిటిడి డిప్యూటీ ఇఒలు లోకనాథమ్, భాస్కర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ తదితర విభాగాల అధికారులతో కలసి ఇఒ సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అదనపు ఇఒ చౌదరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

**సమన్వయంతో పనిచేద్దాం:** బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు తిరుమలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇఒ రవిచంద్ర ఆదేశించారు. భక్తుల భద్రతకు ఎలాంటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గరుడ వాహనం రోజున అధిక మంది భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారికి నిస్వార్థంగా సేవలందించే శ్రీవారి సేవకులను గుర్తించి వారి సేవలను బ్రహ్మోత్సవాలకు వినియోగించుకోవాలని చెప్పారు.

**సెప్టెంబర్ 14లోగా పనులు పూర్తి చేయాలి:** బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని సమీక్షి ంచి, మిగిలిన పనులను సెప్టెంబర్ 14లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశించారు. యేటా తిరుమలకు పెరుగుతున్న భక్తుల సంఖ్య, ఈ ఏడాదిరథసప్తమి సందర్భంగా సుమారు 3.75 లక్షల మంది భక్తులు, 15 వేల వాహనాలు వచ్చిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జరగబోయే బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీపై ముందస్తు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో భక్తుల రద్దీ, వాహన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో బాటు ఆరోగ్యం, పారిశుద్ధం, అన్నప్రసాదం, ఘాట్‌రోడ్ల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షి ంచినట్లు వివరించారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, సౌకర్యాలు ఏర్పాట్లుపై ఇఒ రవిచంద్ర అధికారులతో కలసి ఆలయ నాలుగు మాడ వీధులను తనిఖీ చేశారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, టిటిడి విభాగాల మధ్య సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తెలిపారు. తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పరం సమన్వయం పనిచేయడం ద్వారా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా

## తిరుమల సమాచారం



### తిరుమలనంబి 1053 అవతార మహోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1053వ అవతార మహోత్సవం తిరుమలలో దక్షి ణ మాడ వీధిలోని తిరుమలనంబి ఆలయంలో గురువారం జరిగింది. తొలుత వేద పండితులు వేద పారాయణం, ప్రబంధ పారాయణం, రామాయణం, ఇతిహాసాది పురాణాలను శ్రావ్యంగా పఠించారు. ఈ కార్యక్రమంలో తిరుమల నంబి వంశీయులు టి.కె.శేషాద్రి స్వామి, టి.కె.ముకుంద తాతాచార్యులు, తిరుమల నంబి వంశీయులు పాల్గొన్నారు. నేటి ఉదయం శ్రీవారి తొలి ఘంట నైవేద్యాన్ని తిరుమల నంబి వారికి సమర్పిస్తారు. అనంతరం 16 మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసిస్తారు.


### భక్తి జ్ఞానానికి ప్రతిరూపం తరిగొండ వెంగమాంబ



**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తి, జ్ఞానం, యోగసాధనల సమన్వయంతో వెలుగొందిన మహనీయురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అని టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. వెంగమాంబ భక్తి కేవలం ఆరాధనకు పరిమితం కాలేదని, సంపూర్ణ శరణాగతి, దైవానుభూతికి ప్రతిరూపంగా నిలిచిందని తెలిపారు. వేంకటేశ్వరస్వామివారిపై ఆమెకున్న అచంచలమైన విశ్వాసం, ఆత్మనివేదన ప్రతి రచనలోనూ ప్రతిఫలిస్తాయని చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో గురువారం తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ – భక్తి తత్వం" అనే అంశంపై డాక్టర్ మేడసాని మోహన్ ప్రసంగిస్తూ భక్తి, భావోద్వేగం, ఆత్మానుభూతి సమన్వయంతో సాగిన ఆమె సాహిత్యం నేటికీ భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. శ్వేత ఇన్‌చార్జ్ సంచాలకులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ వేమా వేంకట రత్నం మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయక మన్నారు. నైతిక విలువలను పాటిస్తూ ధార్మిక జీవనం సాగించాలని ఆమె జీవితం సందేశమిస్తుందని తెలిపారు. వెంగమాంబ రచనలు జనరంజకమైన, సరళమైన భాషలో ఉండటంతో అన్ని వర్గాల ప్రజలకు సులభంగా చేరువయ్యాయని చెప్పారు. ఆమె సాహిత్యంలో భక్తి, ఆధ్యాత్మిక చింతన, యోగసాధన, దైవానుభూతి స్పష్టంగా ప్రతిఫలిస్తాయని వివరించారు. వెంగమాంబ జీవితం, సాహిత్యం సమాజంలో భక్తి, ధర్మం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే శక్తివంతమైన ప్రేరణగా నిలిచాయని అన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్. ఆనంతీర్థాచార్యులు శ్రీవారితో ఆమెకున్న అనుబంధం, ఆత్మీయ భక్తి ప్రతి రచనలోనూ ప్రతిధ్వనిస్తుందని తెలిపారు. సాహితీవేత్త గంగవరం శ్రీదేవి, శ్వేత ప్రతినిధులు అరుణా దేవి, ఎన్ సుశీల, ఎల్ఎన్‌వి రవికుమార్, పండితులు, శ్వేత సిబ్బంది, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో బండ్ల గణేశ్

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి శ్రీనివాసులు దేవతల రూపంలో సిఎం చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరి తన కుమార్తె వివాహానికి హాజరయ్యారని సినీ నిర్మాత బండ్ల గణేశ్ తెలిపారు. ఇటీవల ఆయన కుమార్తెకు వివాహం జరగడంతో గురువారం ఉదయం నూతన దంపతులతో కలసి ఆయన తిరుమలకు వచ్చారు. గురూవారం ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక తరానికి చేరువ చేయాలి

### మాజీ ఉపకులపతి ప్రొ. దేవనాథన్ ● వైభవంగా ముగిసిన ఉత్కర్ష మహోత్సవం-2026



**తిరుపతి(విద్య), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఆధునిక తరానికి సంస్కృత భాష, భారతీయ జ్ఞాన సంప్రదాయాన్ని చేరువ చేయాలని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొ. కె.ఈ. దేవనాథన్ సూచించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన ఉత్కర్ష మహోత్సవం-2026 గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. దేవనాథన్ మాట్లాడుతూ సంస్కృతాన్ని గురుకుల పద్ధతిలో బోధిస్తూ ఆధునిక తరానికి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్ర విజ్ఞానాన్ని పరిరక్షి ంచడంలో సంస్కృతం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీలోని లాల్ బహదూర్ ఆచార్యుడు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, భారతీయ జ్ఞాన సంపద సంస్కృత భాషలోనే నిక్షి ప్తమై ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా సంస్కృత భాష, భారతీయ జ్ఞాన పరంపర విశిష్టతను ఆధునిక తరానికి తెలియజేయాలని సూచించారు. వచ్చే ఏడాది ఉత్కర్ష మహోత్సవాన్ని న్యూఢిల్లీలోని తమ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో రెండోసారి ఉత్కర్ష మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంస్కృత భాషాభివృద్ధితో పాటు సంస్కృతాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసే దిశగా విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మహోత్సవంలో భాగంగా 75 పుస్తకాలను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆయా గ్రంథాలను అధ్యయనం చేసి శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం వరిష్ఠ ఆచార్యులు, దర్భంగా విశ్వవిద్యా లయం మాజీ ఉపకులపతి ప్రొ. సర్వనారాయణ ఝా మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్ భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉత్కర్ష వంటి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థులు శాస్త్ర జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు భారతీయ జ్ఞాన సంప్రదాయాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఉత్కర్ష మహోత్సవ సమన్వయకర్త ప్రొ. గణపతి భట్ మాట్లాడుతూ రెండు రోజులపాటు పలువురు పండితులతో వివిధ అంశాలపై ప్రయోజనకరమైన చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. శాస్త్రీయ జ్ఞానాన్ని ఆధునిక పద్ధతుల్లో ప్రజలకు చేరువ చేసేందుకు మహోత్సవం దోహదపడిందన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అదనపు సమన్వయకర్తలు ప్రొ. భరత భూషణ్ రత్, ప్రొ. నాగరాజు భట్, డా. బుల్టీదాస్‌ను అభినందించారు. విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు అతిథులు, నిర్వాహకులు, విశ్వవిద్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమానికి సభా నిర్వాహకులుగా సాహిత్య విభాగ ఆచార్యులు ప్రొ. సి.రంగనాథన్ వ్యవహరించారు. అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత శుక్ల,పీఆర్వో ప్రొ. రమేష్ బాబు, ఏపీఆర్వో డా. కనపాల కుమార్, వివిధ పాఠశాలల డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు,

21-08pg10:21-08pg10.qxd 20/Aug/26 10:49 PM Page 1



## ఆసియాన్ చెస్ ఛాంపియన్‌షిప్..
# భారత్ బాలికల జట్టుకు కాంస్యం

**సింగపూర్:** సింగపూర్‌లో జరిగిన ఆసియాన్ ఏజ్ గ్రూప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత అండర్11 బాలికల జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని, ఈ అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్‌లో తమ అద్భుతమైన ప్రదర్శనను ముగించింది. భారత జట్టులో వరేణ్య లక్ష్మి వకా, అలిగిరి అమృత హేమల్‌తో పాటు మాయ సిద్ధార్థ్ నరులా ఉన్నారు. భారత్ 14.5 పాయింట్లతో ఆతిథ్య సింగపూర్‌తో సమానంగా నిలిచినప్పటికీ, టోర్నమెంట్ టైబ్రేక్ నిబంధనల ఆధారంగా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వియత్నాం 19.5 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, సింగపూర్ రజత పతకాన్ని దక్కించుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 27 దేశాలకు చెందిన 700 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. పోటీ అంతటా భారత క్రీడాకారులు నిలకడ, పోరాట స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, ఆసియా నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ జూనియర్ క్రీడాకారులకు దీటుగా నిలిచారు. వారి ప్రదర్శన, అన్ని వయసుల వర్గాలలో భారత జూనియర్ చెస్ యొక్క పెరుగుతున్న ఆసక్తిని కూడా నొక్కి చెప్పింది. భారతీయ క్రీడాకారులు వయోవర్గ ఖండాంతర మరియు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో నిలకడగా అద్భుత ప్రదర్శన కనబరుస్తూ, క్లాసికల్, ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ ఫార్మాట్లలో పతకాలు గెలుచుకున్నారు.



## మహిళల హాకీ ప్రపంచ కప్..
# ఇంగ్లండ్‌తో భారత్ డ్రా




**కొలంబో:** హాకీ మహిళల ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. దీంతో భారత్ అమ్మాయిల జట్టు పూల్ డిలో కీలక పాయింట్ సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు ఒక్క గోల్ కూడా సాధించకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి క్వార్టర్‌లో భారత్ జట్టు అద్భుతమైన ఆటతీరు కనపరచింది. పెనాల్టీ కార్నర్‌లో నవ్‌నీత్ కౌర్ బంతిని నెట్‌లోకి పంపినప్పటికీ, అది భారత్ ప్లేయర్ శరీరానికి తగలడంతో గోల్‌ను అనుమతించ లేదు. మరోవైపు ఇంగ్లండ్‌కు వరుస పెనాల్టీ కార్నర్లు లభించాయి. అయితే భారతన గోల్‌కీపర్ సవితా పునియా, డిఫెండర్ సలీమా టెటే అద్భుతమైన డిఫెన్స్‌తో ఇంగ్లండ్‌కు గోల్ సాధించే అవకాశాలు ఇవ్వలేదు. కాగా పూల్ డి నుండి చైనా, భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు ఇంటి ముఖం పట్టాయి.




## మహిళల ఛాంపియన్స్ లీగ్..
# ఈస్ట్ బెంగాల్ విజయం

**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ 2026-27 ప్రాథమిక దశలో రోవర్స్ ఎఫ్‌సి (గ్వామ్) పై 12-0 తేడాతో ఘన విజయం సాధించిన తర్వాత ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి వరుసగా తమ రెండవ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో ఈస్ట్ బెంగాల్ గ్రూప్ దశకు చేరుకోవడానికి మరో విజయం దూరంలో నిలిచింది. గురువారం ఇక్కడ జరిగిన మొదటి మ్యాచ్ రోజున రాజ్‌షాహి స్టార్స్ ఎఫ్‌సి (బంగ్లాదేశ్) పై 4-0 తేడాతో సునాయాస విజయం సాధించిన ఈస్ట్ బెంగాల్ ఆరంభం నుంచే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆరో నిమిషంలో ప్రియాంక దేవి నవోరేమ్ కొట్టిన బంతితో ఈస్ట్ బెంగాల్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 15వ నిమిషంలో రోవర్స్ గోల్ కీపర్ జే అల్మోంటే బాక్స్ లోపలి నుండి అంజు చాను కయెన్‌పైబమ్ కొట్టిన షాట్‌ను వదిలేయడంతో మళ్ళీ గోల్ ఇచ్చింది. అయితే వేగంగా స్పందించిన అస్తమ్ ఒరాన్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచింది. ఈస్ట్ బెంగాల్ తమ ఒత్తిడిని కొనసాగించగా, ఏడు నిమిషాల తర్వాత ప్రియాంగ తన గోల్స్ సంఖ్యను రెట్టింపు చేసింది. విరామం తర్వాత అదే రీతిలో ఆటను పునఃప్రారంభించారు. 48వ నిమిషంలో సులంజన రౌల్ బంతిని డ్రిబ్లింగ్ చేసుకుంటూ వెళ్లగా, ఆమె ఇచ్చిన క్రాస్ డిఫ్లెక్ట్ అయి ఒలివియా అనోక్యే వద్దకు చేరడంతో గోల్ చేసింది. ఒక నిమిషం తర్వాత, సౌమ్య గుగులోత్ కచ్చితమైన క్రాస్‌తో అబిగైల్ అంట్వికి బంతిని అందించగా, ఆమె గోల్ చేసి ఈస్ట్ బెంగాల్‌కు ఐదవ గోల్‌ను అందించింది 51వ నిమిషంలో జే రీబౌండ్‌ను గోల్‌గా మార్చింది. 58వ నిమిషంలో షాట్ కొట్టి ఒలివియా తన రెండవ గోల్ సాధించగా, 64వ నిమిషంలో అబెనా ఒపోకు గోల్ పూర్తి చేసింది. అబెనా (70), అంజు (73), సౌమ్య (93+3) గోల్స్‌తో ఈస్ట్ బెంగాల్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, సమగ్రమైన విజయాన్ని పూర్తి చేసింది.

# భారత్‌కు అసలైన పరీక్ష
## 8 టెస్టుల్లో 7 గెలిస్తేనే ఫైనల్‌కు ఛాన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకలోని గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన తర్వాత భారత జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రస్తుతం టీమిండియా ఖాతాలో 53.33 శాతం పాయింట్లతో 5వ స్థానంలో ఉంది. అయితే ఫైనల్ రేసులో నిలవాలంటే కనీసం 60 శాతం మార్కును దాటడం అత్యవసరం. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ చరిత్రను పరిశీలిస్తే, 60 శాతానికి పైగా పాయింట్లు సాధించిన జట్లే పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ సమరానికి అర్హత సాధించాయి. గతంలో జరిగిన మొదటి రెండు డబ్ల్యూటీసీ సైకిళ్లలోనూ టీమిండియా వరుసగా ఫైనల్స్‌కు చేరుకుంది. అయితే తొలిసారి న్యూజిలాండ్ చేతిలో, రెండోసారి ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలై రన్నరప్గా నిలిచింది. ఇక మూడో సైకిల్లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాల మధ్య ఫైనల్ జరగ్గా, అందులో దక్షిణాఫ్రికా విజయం సాధించి కొత్త చరిత్ర సృష్టించింది. ఇక ప్రస్తుత సైకిల్ విషయానికొస్తే, శ్రీలంకతో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను 2 -0తో క్లీన్ స్వీప్ చేస్తే, భారత్ పాయింట్ల శాతం 57.57కు చేరుతుంది. శ్రీలంక పర్యటన తర్వాత న్యూజిలాండ్ వేదికగా రెండు టెస్టుల సిరీస్, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల హోరాహోరీ సిరీస్ ఆడాల్సి ఉంది. రాబోయే ఈ ఏడు మ్యాచ్‌లూ భారత్‌కు అత్యంత కీలకంగా మారనున్నాయి. మొత్తంగా మిగిలివున్న 8 టెస్టుల్లో టీమిండియా కనీసం 6 నుండి 7 టెస్టుల్లో విజయం సాధించాలి. 6 విజయాలు సాధిస్తే పాయింట్లు 60 శాతానికి చేరువవుతాయి. అదే 7 నుండి 8 మ్యా టెస్టులు గెలిస్తే టాప్2 స్థానం ఖాయమవుతుంది. గత సైకిల్లో స్వదేశంలో సౌతాఫ్రికా చేతిలో 2-0తో ఓడిపోవడం భారత్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. ఆ సిరీస్ గెలిచి ఉంటే భారత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండేది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 77.78 శాతంతో అగ్రస్థానంలో, డిఫెండింగ్ ఛాంపియన్ సౌతాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. అయితే దక్షిణాఫ్రికాకు రాబోయే నాలుగు సిరీస్లలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్లతో కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇది టీమిండియాకు సానుకూలంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం న్యూజిలాండ్ 72.22 శాతంతో మూడో స్థానంలో, బంగ్లాదేశ్ 66.67 శాతంతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. రాబోయే కివీస్ సిరీస్ భారత్ ఫైనల్ అర్హతను నిర్దేశించడంలో ఇవన్నీ కీలకం కానున్నాయి.







## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# సింధు సంచలన ఓటమి
### క్వార్టర్స్‌కు ట్రీసా-గాయత్రి



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ప్లేయర్ పివి సింధు చైనా క్రీడాకారిణి వాంగ్ జియి చేతిలో ఓటమిపాలైంది. అయితే భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ గురువారం బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ 2026లో ఒక పెద్ద విజయాన్ని నమోదు చేశారు. వారు రౌండ్ ఆఫ్ 16లో ప్రపంచ 7వ ర్యాంకర్ అయిన జపాన్ ద్వయం రిన్ ఇవానగా-కీ నకానిషిలను ఓడించి, పతకం సాధించడానికి కేవలం అడుగు దూరంలో ఉన్నారు. మొదటి గేమ్‌లో జపాన్ జంట చక్కగా ఆడటంతో ట్రీసా-గాయత్రి జోడి 9-13తో వెనుకబడింది. ఆ తర్వాత ట్రీసా కొన్ని శక్తివంతమైన స్మాష్‌లను సంధించి, జపాన్ జంట వ్యూహాన్ని అడ్డుకుంది. దీంతో ట్రీసా, జాలీలు అద్భుతంగా పుంజుకుని, వరుసగా 8 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను తమకు అనుకూలంగా ముగించారు. రెండవ గేమ్‌లో గాయత్రి కచ్చితమైన నెట్ షాట్‌లతో వెనుక ఉన్న ట్రీసాకు బంతిని అందించగా, ఆమె శక్తివంతమైన విన్నర్‌లతో పాయింట్లను ముగించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుని, తమ పతక ఆశలను సజీవంగా ఉంచుకున్నారు. ఇక రౌండ్ ఆఫ్ 16లో, భారత క్రీడాకారిణి పివి సింధు, మూడో సీడ్ చైనా క్రీడాకారిణి వాంగ్ జి యి చేతిలో మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో (21-11, 15-21, 21-17) ఓటమి చెందింది..వాంగ్ మొదటి గేమ్‌లో ఆధిపత్యం చెలాయించి, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సింధుపై ఆధిక్యం సాధించి, చివరికి అర్థమైన ఆధిక్యాన్ని కైవసం చేసుకుంది. సింధు, రెండవ గేమ్‌లో ఆరంభంలోనే ఆధిక్యం సాధించినా మధ్యలో కాస్త తడబడినప్పటికీ, అవసరమైనప్పుడు పాయింట్లు సాధించి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో 18-17 స్కోరు వద్ద సింధు, వాంగ్ 54 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో తలపడ్డారు. అయితే సింధు కోలుకోలేకపోవడంతో, వాంగ్ చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

# 13.37 కోట్లకు పెరిగిన స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్లు



**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది జూలై నాటికి దేశంలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 13.37 కోట్లకు చేరింది. 2019 ఆర్థిక సంవత్సరంమొదటి త్రైమాసికంలో ఉన్న 2.75 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు ఐదు రెట్లు అధికం. పశ్చిమ భారతదేశానికే పరిమితమైన స్టాక్ మార్కెట్ భాగస్వామ్యం ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. జూలైలో కొత్తగా 13.3 లక్షల మంది ఇన్వెస్టర్లు నమోదు చేసుకున్నారు. జూన్‌తో పోలిస్తే ఇది 14.1 శాతం పెరుగుదల. 2025 జూలైతో పోలిస్తే కొత్త రిజిస్ట్రేషన్లు 12.1 శాతం తగ్గాయి. మార్కెట్‌లో ఇన్వెస్టర్ల వయసు కూడా తగ్గుతోంది. 2026 జూన్ నాటికినమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 37.9 శాతంగా ఉన్నారు. 30-39 ఏళ్ల వయసు వారు మరో 30.2 శాతం ఉన్నారు. నమోదైన ఇన్వెస్టర్ల మధ్యస్థ వయసు 33 సంవత్సరాలుగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కొత్తగా నమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 59 శాతంగా ఉన్నారు. క్యూవన్26లో ఈ వాటా 56.4 శాతంగా ఉంది. కొత్త ఇన్వెస్టర్ మధ్యస్థ వయసు కేవలం 27 సంవత్సరాలుగా నమోదైంది. జూలైలో ఉత్తర భారతదేశంలో 4.93 కోట్ల మంది నమోదైన ఇన్వెస్టర్లు ఉన్నారు. ఇది దేశ మొత్తం ఇన్వెస్టర్ బేస్‌లో 36.9%. పశ్చిమ భారత్‌లో 3.89 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉండగా, దేశ మొత్తం వాటాలో 29.1 శాతంగా ఉంది. దక్షిణ భారత్‌లో 2.82 కోట్లు, తూర్పు భారతదేశంలో 1.62 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. తూర్పు భారతదేశంలో ఇన్వెస్టర్ బేస్ ఆరు రెట్లు, దక్షిణ భారతదేశంలో 4.2రెట్లు, పశ్చిమ భారతదేశంలో నాలుగు రెట్లు పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే జూలైలో కొత్త ఇన్వెస్టర్ల చేరికలో ఉత్తరప్రదేశ్ ముందంజలో నిలిచింది. ఆ రాష్ట్రంలో 1.9 లక్షల మంది కొత్తగా నమోదు కాగా, మొత్తం కొత్త రిజిస్ట్రేషన్లలో ఇది 14 శాతం. మహారాష్ట్రలో 1.4 లక్షలు, గుజరాత్‌లో 1.2 లక్షలు, తమిళనాడులో 90 వేలు, పశ్చిమ బెంగాల్‌లో 80 వేల మంది కొత్త ఇన్వెస్టర్లు చేరారు. ఈ 5 రాష్ట్రాలు కలిపి జూలైలో నమోదైన కొత్త ఇన్వెస్టర్లలో 46.6% వాటాను కలిగి ఉన్నాయి.

వాణిజ్యం



# రూ.10వేల కోట్ల రియాల్టీ లావాదేవీలపై ఐటీ శాఖ నజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఐదు సరిహద్దు రాష్ట్రాల్లో రూ.10వేల కోట్లకు పైగా విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆదాయపు పన్ను శాఖ పరిశీలనలోకి వచ్చాయి. పన్ను ఎగవేత, లావాదేవీలను తక్కువగా చూపించడం, తప్పుగా నివేదించడం వంటి పన్ను నిబంధనల ఉల్లంఘనఐటిశాఖ గుర్తించింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన 2025-26 ఆర్థిక సంవత్సర లావాదేవీలను శాఖ పరిశీలిస్తోంది. మొత్తం 14,743 ఆస్తి లావాదేవీల్లో పన్ను నిబంధనలకు సంబంధించిన లోపాలను గుర్తించింది. ఇందులో 2,552 లావాదేవీలు అసలు నివేదించనివి ఉన్నాయి. విలువ పరంగా రూ.9,350 కోట్ల లావాదేవీల్లో తప్పులున్న ఫైలింగ్స్ గుర్తించగా, మరో రూ.1,628 కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు నివేదించలేదు. ఆస్తి లావాదేవీలకు సంబంధించిన రూ.63 కోట్ల నగదు లావాదేవీలను కూడా ప్రకటించలేదని శాఖ గుర్తించింది. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్ అత్యధికంగా రూ.4,081.27 కోట్ల లావాదేవీలతో ముందుంది. రాజస్థాన్ రూ.2,694.62 కోట్లు, గుజరాత్ రూ.1,795.65 కోట్లు, బిహార్ రూ.1,472.81 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.554.15 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పాన్ వివరాలను తప్పుగా నమోదు చేయడం, లావాదేవీల విలువను తక్కువగా చూపించడం, లావాదేవీలను నివేదించకపోవడం, తప్పు ఆర్థిక సంవత్సరంలో చూపించడం, నగదు భాగాన్ని వెల్లడించకపోవడం వంటి పలు లోపాలను ఐటీ శాఖ గుర్తించింది. ఐదు రాష్ట్రాల్లో పన్ను చెల్లింపులతో పోలిస్తే నగదు జమలు, ఉపసంహరణలు గణనీయంగా అధికంగా ఉన్నట్లు శాఖ విశ్లేషణలో వెల్లడైంది. ఉత్తరప్రదేశ్‌లో నగదు డిపాజిట్ పన్ను నిష్పత్తి 21.38 రెట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా ఈ నిష్పత్తి 2.5 రెట్లు మాత్రమే. అలాగే నగదు ఉపసంహరణపన్ను నిష్పత్తి ఉత్తరప్రదేశ్‌లో 15.6 రెట్లు ఉండగా, దేశవ్యాప్తంగా ఇది 0.74 రెట్లు ఉంది. నగదు డిపాజిట్లు లేదా ఉపసంహరణలను చెల్లించిన పన్నుతో పోల్చి ఈ నిష్పత్తిని లెక్కిస్తారు. అసోంలో నగదు డిపాజిట్‌పన్ను నిష్పత్తి 17.31 రెట్లు, నగదు ఉపసంహరణపన్ను నిష్పత్తి 16.76 రెట్లుగా ఉంది. పశ్చిమ బెంగాల్‌లో ఈ రెండు నిష్పత్తులు వరుసగా 10.38 రెట్లు, 10.28 రెట్లుగా ఉన్నాయి. గుజరాత్‌లో 10.27 రెట్లు, 11.85 రెట్లు, బిహార్‌లో 7.63 రెట్లు, 8.41 రెట్లుగా నమోదయ్యాయి.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిసింది. వరుసగా ఏడు రోజులుగా కొనసాగిన నష్టాలకు ఈ రోజు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 628 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153 పాయింట్లు లాభపడింది. ఐటీ, ఫైనాన్సియల్ స్టాక్స్ భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే సాగింది. గరిష్టంగా 77,611.11 పాయింట్లను తాకింది. చివరకు 628.04 పాయింట్లు లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153.55 పాయింట్ల లాభంతో 24,231.85 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఐటీసీ, కోటక్ బ్యాంక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్ షేర్లు లాభపడ్డాయి. వీటిలో ఎటర్నల్ 2 శాతం పైగా లాభపడింది. మరోవైపు టైటాన్, ఇండిగో, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 షేర్లు 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు 2.13 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్స్ మాత్రం 0.50 శాతం నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌షేర్లు 0.53శాతం క్షీణింస్తే స్మాల్‌క్యాప్ కూడా 0.48శాతం క్షీణించింది. బిఎస్ఇలో మొత్తం 2450 షేర్లు లాభపడగా 1874 షేర్లు పతనం చెందాయి. మరో 237 షేర్లుస్థిరంగా కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 93.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.71గా ఉంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి అత్యధికంగా 5.74 శాతం లాభపడింది. జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే కొనసాగుతున్నాయి. ఇక ఐపిఒలపరంగా టెంప్‌పెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ 5.69 రెట్లు అధికంగా బిడ్లు రాబట్టిఇంది. ఐపిఒ ధరలు రూ.285 నుంచి రూ.300గా నిర్ణయించింది. గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ 2.36శాతం రెట్టింపు బిడ్లుసాధించింది. ఇష్యూధర రూ.152.నుంచి రూ.160గా నిర్ణయించింది. సన్‌షైన్ పిక్చర్స్ 105.34 రెట్లు బిడ్లు రాబట్టింది. సంకేష్ జ్యూయెలర్స్ 2.77 రెట్లు బిడ్లు సాధించింది. కనీసం 160 షేర్లు కొనుగోలుచేయాలి. రూ.88 నుంచి రూ.93వరకూ ఇష్యూధరలు నిర్ణయించింది.



# కీలక రంగాల ఉత్పత్తి వృద్ధి 5.4%

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధి 5.4 శాతంగా నమోదయింది. కేంద్ర మంత్రిత్వశాఖ మోస్పీ ఈ గణాంకాలు గురువారం విడుదలచేసింది. ఎనిమిది మౌలిక రంగాల్లో సిమెంట్ ఉత్పత్తి జూలైలో అత్యధికంగా 13.1 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. జూన్‌లో ఈ వృద్ధి 9.9 శాతంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి వృద్ధి జూన్‌లోని 11.4 శాతం నుంచి జూలైలో 9 శాతానికి తగ్గింది. బొగ్గు ఉత్పత్తి మాత్రం జూన్‌లోని 1.4 శాతం వృద్ధితో పోలిస్తే జూలైలో 7.6 శాతానికి పెరిగింది. ఎరువుల ఉత్పత్తిలో క్షీణత మరింత పెరిగి, జూన్‌లో నమోదైన 3.3 శాతం డీగ్రోత్ నుంచి జూలైలో 8 శాతం క్షీణతకు చేరింది. ఇనుప ఖనిజం ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 29.5 శాతం పెరిగింది. ఇది మైనింగ్ కార్యకలాపాల్లో బలమైన వృద్ధిని ప్రతిబింబించింది. అయితే జూన్‌లో నమోదైన 44.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. ఉక్కు ఉత్పత్తి 2.9 శాతం మేర పెరిగింది. జూన్‌లో ఈ వృద్ధి 5.6 శాతంగా ఉంది. మరోవైపు పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తుల ఉత్పత్తి జూలైలో 2.7 శాతం వృద్ధి సాధించింది. జూన్‌లో ఇది 4 శాతం క్షీణించింది. సహజవాయువు ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 3.7 శాతం క్షీణించింది. అయితే జూన్‌లో నమోదైన 4.8 శాతం క్షీణతతో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగుపడింది. ముడి చమురు ఉత్పత్తి జూలైలో 5.3 శాతం తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 4.2 శాతం క్షీణించింది. సమిష్టి ప్రాతిపదికన ఏప్రిల్ జూలై కాలంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 4.3 శాతానికి చేరింది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14